సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 4

బుధవారం 27-3-2024



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



చెన్నై ధనాధన్ గెలుపు

చెలరేగిన దూబే, రచిన్.. 63 పరుగుల తేడాతో గుజరాత్‌పై విజయం - 14లో



బిలియనీర్ల నగరంగా ముంబై

92 మంది సంపన్నులకు కేంద్రం.. హురున్ గ్లోబల్ రిచ్‌లిస్ట్‌లో వెల్లడి - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కస్టడీ నుంచి కేజ్రీవాల్ ఉత్తర్వు

ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆస్పత్రుల్లోని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చారు.

వివరాలు 6లో ▸



ఢీకొట్టిన నౌక.. కూలిన వంతెన

అమెరికాలోని బాల్టిమోర్‌లో భారీ నౌక ఢీకొట్టడంతో వంతెన కూలిపోయింది. పలువురు గల్లంతైనట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



103 మంది ఎంపీలకు నో టికెట్

టికెట్ల కేటాయింపులో బీజేపీ.. గెలుపు చాన్స్ లేని వారిని పక్కన పెట్టేస్తోంది. సిట్టింగ్ ఎంపీల్లో 103 మందికి 'నో' చెప్పింది.

వివరాలు 6లో ▸



తిహార్ జైలుకు కవిత

ఢిల్లీ మద్యం స్కాం కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ కవితకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు ఆదేశాలిచ్చింది.

వివరాలు 5లో ▸

మరో యాత్రకు సిద్ధం

నేటి నుంచి సీఎం జగన్ బస్సు యాత్ర

ఎన్నికల ప్రచార భేరికి ఇడుపులపాయలో శ్రీకారం



- తొలి రోజు కడప పార్లమెంట్ పరిధిలో నిర్వహణ
- వేంపల్లి, వీరపునాయునిపల్లె, యర్రగుంట్ల మీదుగా కొనసాగనున్న యాత్ర
- ప్రొద్దుటూరు భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం
- అనంతరం దువ్వూరు, చాగలమర్రి మీదుగా ఆళ్లగడ్డ బైపాస్ రోడ్డు వద్ద శిబిరానికి చేరుకోనున్న ముఖ్యమంత్రి
- రాత్రికి అక్కడే శిబిరంలోనే బస చేయనున్న సీఎం జగన్

2లో

- ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 21 రోజుల పాటు కొనసాగనున్న యాత్ర
- నిత్యం ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహణ
- రోజూ ఉదయం వివిధ వర్గాలతో మమేకం.. ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపర్చుకోవడంపై సలహాలు, సూచనల స్వీకరణ
- సాయంత్రం పూట ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో భారీ బహిరంగ సభలు
- 58 నెలల్లో సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో చేకూర్చిన మేలును వివరిస్తూ సభలు

- 2014-19 మధ్య చంద్రబాబు నేతృత్వంలోని కూటమి మోసాలను గుర్తు చేస్తూ ప్రసంగాలు
- ఇప్పుడు మళ్లీ అదే కూటమితో బాబు వస్తున్నారంటూ ప్రజలను అప్రమత్తం చేయనున్న సీఎం
- మీ బిడ్డ పాలనలో మీ ఇంటికి మంచి జరిగి ఉంటే ఓటుతో మరోసారి ఆశీర్వదించాలని వినమ్రంగా ప్రజలకు విజ్ఞప్తి
- 99% హామీల అమలు, సుపరిపాలనతో జగన్ నాయకత్వంపై జనంలో పెరిగిన విశ్వసనీయత
- 175 శాసనసభ, 25 ఎంపీ సీట్లు లక్ష్యంగా నిర్వహించిన నాలుగు సిద్ధం సభలు సూపర్ హిట్

తొలిరోజు యాత్ర ఇలా.. 2లో

ప్రారంభం: వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ

బహిరంగ సభ: ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు సమీపంలో

బస: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బైపాస్ రోడ్డులోని శిబిరంలో

పొత్తు కోసం నేను వెళ్లలేదు



- వాళ్లు వస్తేనే పొత్తు పెట్టుకున్నా
- బీజేపీతో పొత్తుపై ముస్లింలతో చంద్రబాబు
- ఇంటింటి ప్రచారంలో బాబుకు మహిళ షాక్
- మీ హయాంలో ఇల్లు కొట్టేశారు.. కట్టించండని నిలదీత

11లో

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఐఐటీ శిక్షణ

విద్యార్థులకు నీట్, ఏపీఈఏపీ సెట్స్‌కు కూడా.. పైలట్ ప్రాజెక్టుగా 51 కాలేజీల్లో ప్రారంభం

దాదాపు 3 వేల మందికి ట్రైనింగ్

ఐఎఫ్‌పీలు, ప్రొజెక్టర్ ద్వారా 3డీలో సైన్స్ పాఠాలు.. ఉచితంగా ఎంబైబ్ సంస్థ సాంకేతిక సహకారం

ఏఐ టెక్నాలజీతో ప్రత్యేక టెస్టుల నిర్వహణ

3లో

'అందరికీ న్యాయం' మన లక్ష్యం



5లో

- దేశ న్యాయవ్యవస్థలో 50 శాతం పైగా మహిళలు
- న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లు
- దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉంది
- యువత విద్యతోపాటు ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలి
- తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

ఏపీ బీజేపీలో 'కోట్లుకు సీట్లు'



10లో

- టీడీపీ నేత మీనాక్షినాయుడు మేనల్లుడికి బీజేపీ నేత నీలకంఠ సోదరుడు నాగరాజు ఫోన్
- రూ.3 కోట్లు ఇస్తే ఆదోని టీడీపీకి వదిలేసి.. ఆలూరు అడుగుతామని ప్రతిపాదన
- బోర్డులో లక్ష్మణ్ జీ ఉన్నారు.. మేం ఏది చెబితే అదే
- పురందేశ్వరి మేడమ్‌కూ ఇవ్వాలంటూ బీజేపీ నేత ప్రతిపాదన
- రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఆడియో

వైఎస్సార్‌సీపీలోకి భారీగా నేతల చేరికలు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత డాక్టర్ మస్తాన్ యాదవ్. చిత్రంలో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తదితరులు




సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన విజయవాడకు చెందిన టీడీపీ మాజీ కార్పొరేటర్లు గండూరి మహేష్, నందెపు జగదీష్, మాజీ కోఆప్షన్ మెంబర్ దేవమణి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ కోసూరు సుబ్రహ్మణ్యం (మణి), డివిజన్ మాజీ అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు, జనసేన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన రాము. చిత్రంలో విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాశ్


సీఎం సమక్షంలో పార్టీలో చేరిన విశాఖ సీనియర్ నాయకులు జీవీ రవిరాజు, బొగ్గు శ్రీనివాస్, జనసేన నేత బొడ్డేటి అనురాధ. చిత్రంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు గుడివాడ అమర్‌నాథ్, కేకే రాజు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పాయకరావుపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ, జనసేన నేత అంగూరి లక్ష్మీ శివకుమారి


సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన సూళ్లూరుపేట టీడీపీ సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డి. చిత్రంలో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి


జై భారత్ నేషనల్ పార్టీ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొరకు పార్టీ కండువా కప్పుతున్న సీఎం జగన్


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఇన్‌చార్జి గంటా నరహరి. చిత్రంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, మరో రీజనల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి


సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జి గోరుముచ్చు గోపాల్ యాదవ్. చిత్రంలో తణుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, దెందులూరు అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్


సీఎం సమక్షంలో పార్టీలో చేరిన నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, ఆయన కుమారుడు చిన్నం చైతన్య. చిత్రంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, వైఎస్సార్‌సీపీ మైలవరం నేత జ్యేష్ఠ శ్రీనాథ్

మీ వెంటే.. మేమంటూ!

- సీఎం జగన్ సమక్షంలో చేరిన ఏలూరు టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి గోపాల్ యాదవ్
- పార్టీ తీర్థం పుచ్చుకున్న రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఇన్‌చార్జి గంటా నరహరి, జనసేన విజయవాడ ఈస్ట్ ఇన్‌చార్జి బత్తిన రాము
- మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మి శివకుమారి, నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య సైతం చేరిక
- పార్టీలో చేరిన సూళ్లూరుపేట టీడీపీ సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డి, వెంకటగిరి సీనియర్ నేత మస్తాన్ యాదవ్
- పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై ప్రజల్లో ఆదరణ మరింత పెరుగుతోంది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక, రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు సమాజంలో సమోన్నత గౌరవాన్ని తీసుకురావడంలో చెరగని ముద్ర వేశారు. రాజకీయ చరిత్రలో ఏనాయకుడు కనీసం ఊహించని విధంగా మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాల్లో 99 శాతం చిత్తశుద్ధితో అమలు చేసి విశ్వసనీయతకు సరైన నిర్వచనాన్ని ఇచ్చారు. దీంతో వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతోంది. ఫలితంగా టీడీపీ, జనసేన పార్టీల్లోని కార్యకర్తల నుంచి కీలక నేతలు వరకు వైఎస్సార్‌సీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయానికి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు కీలక నేతలు క్యూ కట్టారు. వీరిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

సీఎం సమక్షంలో చేరిన గోపాల్ యాదవ్

ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గోరుముచ్చు గోపాల్ యాదవ్ మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో తణుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్ పాల్గొన్నారు. మరోవైపు.. రాజంపేట టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటా నరహరి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే రామకోటయ్య

నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, ఆయన కుమారుడు చిన్నం చైతన్య సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో తుని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా, ఏలూరు పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్, వైఎస్సార్‌సీపీ మైలవరం నేత జ్యేష్ఠ శ్రీనాథ్ పాల్గొన్నారు.

పార్టీ కండువా కప్పుకున్న వేనాటి

సూళ్లూరుపేట టీడీపీ సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డి సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, నెల్లూరు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. కాగా.. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత డాక్టర్ మస్తాన్ యాదవ్ సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

జనసేన లక్ష్మీశివకుమారి చేరిక

పాయకరావుపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ, జనసేన నాయకురాలు అంగూరి లక్ష్మి శివకుమారి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి పాల్గొన్నారు.

జై భారత్ పార్టీ నుంచి..

జై భారత్ నేషనల్ పార్టీ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

సీఎం సమక్షంలో చేరిన విజయవాడ నేతలు

విజయవాడకు చెందిన టీడీపీ మాజీ కార్పొరేటర్లు, జనసేన నాయకులు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గండూరి మహేష్, నందెపు జగదీష్, కొక్కిలిగడ్డ దేవమణి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ కోసూరు సుబ్రహ్మణ్యం (మణి), డివిజన్ మాజీ అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు, జనసేన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన రాము వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, విజయవాడ ఈస్ట్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాశ్ పాల్గొన్నారు.

విశాఖ నేతల చేరిక

విశాఖపట్నానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ, జనసేన సీనియర్ నాయకులు జీవీ రవిరాజు, బొగ్గు శ్రీనివాస్, బొడ్డేటి అనురాధకు సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ నార్త్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పాల్గొన్నారు.

తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

- విజయవాడ తూర్పు నేతలకు సీఎం జగన్ దిశానిర్దేశం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన యలమంచిలి రవి, బత్తిన రాము

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని సీఎం జగన్ కోరారు. మంగళవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌తో పాటు యలమంచిలి రవి, గత ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసిన బత్తిన రాము, ఎంపీ కేశినేని నాని, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులను పిలిపించి జగన్ మాట్లాడారు. అవినాష్ అధిక మెజార్టీతో విజయం సాధించేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జోష్ కొనసాగుతుండగా, సీఎం జగన్‌ను యలమంచిలి రవి, బత్తిన రాము కలవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఇక తూర్పులో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సీఎంను కలిసిన వారిలో యలమంచిలి రవి తనయుడు రాజీవ్ కూడా ఉన్నారు.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి, యలమంచిలి రాజీవ్, దేవినేని అవినాశ్, చిత్రంలో ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

సీఎం వైఎస్ జగన్ వెంటే మేమంతా..

బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సాంబశివరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల శంఖారావం పూరిస్తూ బుధవారం నుంచి బస్సు యాత్ర చేపడుతున్న సీఎం వైఎస్ జగన్ వెంటే మేమంతా సిద్ధమని బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగిడి సాంబశివరావు ప్రకటించారు. బీసీ సంఘం రాష్ట్ర నేతలు పోనమాల నాగరాజు, వల్లభుని మణికంఠ, వల్లభుని దుర్గాప్రసాద్, సైకం చినబాబు తదితరులతో కలిసి ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రారంభిస్తున్న బస్సు యాత్రలో తామంతా పాల్గొంటామన్నారు.

మరో యాత్రకు సిద్ధం

ఎన్నికల ప్రచార భేరికి నేడు ఇడుపులపాయలో సీఎం జగన్ శ్రీకారం

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచారభేరి మోగించనున్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నివాళులు అర్పించిన అనంతరం 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను ప్రారంభిస్తారు. తొలి రోజు బస్సు యాత్ర కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరగనుంది. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు మొత్తం 21 రోజులపాటు ఈ బస్సు యాత్ర కొనసాగుతుంది. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తూ 'సిద్ధం' సభలు నిర్వహించిన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలు మినహా మిగతా పార్లమెంట్ స్థానాల పరిధిలో బస్సు యాత్రను నిర్వహించనున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తాను చేసిన ప్రజా సంకల్ప పాదయాత్ర తరహాలోనే బస్సు యాత్రలోనూ రోజూ ఉదయం వివిధ వర్గాల ప్రజలు, మేధావులతో సీఎం జగన్ మమేకమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింతగా మెరుగుపర్చుకోవడానికి వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. సాయంత్రం ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగిస్తారు.

మోసాలను ఎండగడుతూ..

బస్సు యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకూ సీఎం జగన్ పూర్తిగా ప్రజలతో మమేకమవుతారు. యాత్ర సందర్భంగా ఎక్కడికక్కడ ఆయా ప్రాంతాల్లో విడిది చేయనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ప్రతి ఇంటికీ మేలు చేసిన అంశాన్ని సీఎం జగన్ యాత్రలో వివరించనున్నారు. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో జనసేన–బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేయనున్నారు. వ్యవసాయ, డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని, ఆడపిల్ల పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు డిపాజిట్ చేస్తామని, ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తామని, చేనేత, పవర్ లూమ్స్ రుణాలు పూర్తిగా మాఫీ.. లాంటి 650కిపైగా వాగ్దానాలు గుప్పించి పది శాతం కూడా అమలు చేయకుండా వంచించిన వైనాన్ని సీఎం జగన్ ఎండగట్టనున్నారు. నాడు మోసం చేసిన కూటమితోనే జట్టు కట్టి చంద్రబాబు మళ్లీ వస్తున్నారని ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీ ఇంటికి మంచి జరిగి ఉంటే ఓటు వేసి ఆశీర్వదించాలని వినమ్రంగా ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నయా జోష్

చేసిన మంచిని ప్రతి ఇంటికి వివరించి ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలకు జనం బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో బలంగా నాటుకుపోయిన నమ్మకాన్ని ఈ రెండు కార్యక్రమాలు ప్రతిబింబించాయి. గత 58 నెలల పాలనలో సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో విప్లవాత్మక మార్పులు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ స్థానాలు, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయబావుటా ఎగురవేయడం కచ్చితంగా సాధ్యమేనని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ సీఎం జగన్ సిద్ధం సభలు నిర్వహించారు. భీమిలి (ఉత్తరాంధ్ర), దెందులూరు (ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల (ఉత్తర కోస్తా)లలో నిర్వహించిన నాలుగు సభలకు జనం కదలితో పోటీపడుతూ పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజాసభలుగా నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ మరో సారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని సిద్ధం సభలతో తేటతెల్లమైందని రాజకీయ పరిశీలకులు విశ్లేషించారు. జనసేన–బీజేపీతో టీడీపీ జతకట్టినా... సార్వత్రిక ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని, వైఎస్సార్‌సీపీ మరోసారి చారిత్రక విజయం సాధించడం తథ్యమని టైమ్స్‌నౌ–ఈటీజీ, జీన్యూస్–మాట్రిజ్ లాంటి డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థల సర్వేలు తేల్చి చెప్పాయి. ఇప్పటికే 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించిన సీఎం జగన్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి ముందే బస్సు యాత్ర ద్వారా తొలి విడత ప్రచారాన్ని పూర్తి చేసేందుకు సిద్ధమవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నయా జోష్ కనిపిస్తోంది.

కూటమి అష్టకష్టాలు..

వైఎస్సార్‌సీపీని ప్రజాక్షేత్రంలో ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమని బెంబేలెత్తిన చంద్రబాబు ఉనికి కోసం జనసేన అధ్యక్షుడుతో జట్టు కట్టారు. టీడీపీ–జనసేన పొత్తుల లెక్క తేలాక ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో 2 పార్టీలూ నిర్వహించిన జెండా సభకు జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీ పెద్దల కాళ్లావేళ్లా పడి ఆ పార్టీతో జత కలిశారు. మూడు పార్టీల మధ్య పొత్తు కుదిరాక ప్రధాని మోదీని రప్పించి చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభకు జనం కదలిరాలేదు. ఆ సభా పేలవంగా సాగడంతో మూడు పార్టీలదీ అవకాశవాద పొత్తులని ప్రజలు తేల్చి చెప్పినట్లయింది. పొత్తు కుదిరినా ఇప్పటికీ మూడు పార్టీలు తమ అభ్యర్థులను పూరిగా ప్రకటించలేని స్థితి నెలకొంది.

మరింత పెరిగిన విశ్వసనీయత..

ఎన్నికల్లో హామీల్లో 99 శాతం అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్న సీఎం జగన్ మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం ఇచ్చారు. గత 58 నెలల్లో నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా వివక్ష, లంచాలకు తావులేకుండా 87 శాతం కుటుంబాల ప్రజలకు డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ)తో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను ఖాతాల్లోకి జమ చేశారు. నాన్ డీబీటీతో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.4.49 లక్షల కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూర్చారు. దీన్ని సద్వినియోగం చేసుకున్న ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కుతున్నారు. రాష్ట్రంలో పేదరికం 2015–16లో 11.77 శాతం ఉండగా 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు తార్కాణం. విప్లవాత్మక సంస్కరణల ద్వారా విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధి పథంలో నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. హామీలన్నీ అమలు చేయడం, సుపరిపాలన అందిస్తుండటంతో జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత మరింతగా పెరిగింది.

తొలి రోజు యాత్ర ఇలా..

- సీఎం జగన్ బుధవారం ఉదయం తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు ఇడుపులపాయకు చేరుకుంటారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తారు.
- మధ్యాహ్నం 1.30 గంటలకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారు.
- ఇడుపులపాయ నుంచి కుమారునిపల్లి, వేంపల్లి, సర్వరాజుపేట, వీరపునాయనిపల్లి (కమలాపురం), గంగిరెడ్డిపల్లి, ఊరుటూరు, యర్రగుంట్ల (జమ్మలమడుగు), పోట్లదుర్తి మీదుగా సాయంత్రం 4.30 గంటలకి ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభ వద్దకు సీఎం జగన్ చేరుకుంటారు. బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.
- అనంతరం సున్నపురాళ్లపల్లి, దువ్వూరు, జిల్లెల, నాగలపాడు, బోధనం, రాంపల్లె క్రాస్, చాగలమర్రి మీదుగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో
ఐఐటీ శిక్షణ

విద్యార్థులకు నీట్, ఏపీఈఏపీ సెట్స్‌కు కూడా..

పైలట్ ప్రాజెక్టుగా 51 కాలేజీల్లో ప్రారంభం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే సైన్స్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ వంటి శిక్షణను సర్కారు అందుబాటులోకి తెచ్చింది. వీరిని ఉత్తమంగా తీర్చిదిద్ది పోటీ పరీక్షలకు సిద్ధంచేస్తోంది. గత ఏడాది ఆగస్టులో పైలట్ ప్రాజెక్టుగా జిల్లాకు రెండు కళాశాలల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 51 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ శిక్షణను ఇంటర్మీడియట్ బోర్డు అందుబాటులోకి తెచ్చింది. తొలిదశలో 3 వేల మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఐఐటీ, నీట్, ఏపీఈఏపీ సెట్‌కు శిక్షణనిస్తున్నారు. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ లెక్చరర్లు 800 మందికి శిక్షణనిచ్చి, వారి సూచనల మేరకు విద్యార్థులకు శిక్షణ ప్రారంభించారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఎంబైబ్ సంస్థ ఉచితంగా అందిస్తోంది. సైన్స్, మ్యాథమెటిక్స్ తరగతులకు అవసరమైన మెటీరియల్, వీడియో పాఠాలను ఈ సంస్థ అందిస్తోంది. శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ ఏడాది జరిగే ఏపీ ఈఏపీ సెట్, నీట్, జేఈఈ పరీక్షల్లో సాధించిన ఫలితాల ఆధారంగా శిక్షణలో అవసరమైన మార్పులుచేసి రాష్ట్రంలోని 470 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోను ఈ శిక్షణను ప్రారంభించాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించింది.

స్వచ్ఛంద బోధనకు లెక్చరర్ల అంగీకారం..

ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న ఐఐటీ, నీట్, ఏపీ ఈఏపీ సెట్ శిక్షణకు ఉచితంగా సాంకేతిక సహకారం అందించేందుకు వెంబైబ్ సంస్థ ముందుకొచ్చింది. దీంతో సాధాసాధ్యాలను అంచనా వేసేందుకు ఇంటర్ బోర్డు లెక్చరర్ల సహకారం తీసుకుంది. ఒక్కో సబ్జెక్టు నుంచి ఆసక్తిగల 10 మందిని ఎంపిక చేసి, వారికి ఎంబైబ్ సంస్థ పరిశీలన కోసం మెటీరియల్‌ను పంపించింది. వీడియో పాఠాలు, నమూనా పరీక్ష పత్రాలను పరిశీలించిన అనంతరం వారు సూచించిన మార్పులు చేసి శిక్షణను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఖరీదైన ఐఐటీ, నీట్ వంటి శిక్షణను



అందించేందుకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా 800 మంది జూనియర్ లెక్చరర్లు ముందుకొచ్చారు. వారికి నిపుణులతో శిక్షణపై ఇంటర్ బోర్డు పూర్తి అవగాహన కల్పించింది. రెగ్యులర్ పాఠాలు పూర్తయిన తర్వాత ఎంపీసీ విద్యార్థులకు ఐఐటీ, ఏపీఈఏపీ సెట్.. బైపీసీ విద్యార్థులకు నీట్, ఈఏపీ సెట్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఐఎఫ్‌పీలపై 3డీలో వీడియో పాఠాలు..

మెటీరియల్‌తో పాటు సబ్జెక్టు వారీగా వందలాది వీడియో పాఠాలను ఎంబైబ్ సంస్థ అందించింది. నాడు–నేడులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కాలేజీల్లోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను అందించింది. మరికొన్ని కాలేజీల్లో ప్రొజెక్టర్లు ఉన్నాయి. వీటిద్వారా విద్యార్థులకు 3డీలో సైన్స్ వీడియో పాఠాలను బోధిస్తున్నారు. పాఠం పూర్తయ్యాక టాపిక్ వారీగా ఆన్‌లైన్ టెస్టులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో స్వయంగా టాపిక్‌ల వారీగా టెస్టు పేపర్లు తయారుచేసుకునే విధానం అందుబాటులోకి తెచ్చారు. గతంలో వచ్చిన ప్రశ్నలను విశ్లేషించి, ఏ తరహా ప్రశ్నలు రావచ్చో ఈ టెక్నాలజీ వివరిస్తోంది. గతంలో హెచ్‌సీఎల్ నిర్వహించిన ‘టెక్ బీ’ ప్రోగ్రామ్‌కు 4,500 మంది విద్యార్థులు శిక్షణ పొందగా, 900 మంది ఎంపికయ్యారు. ప్రస్తుతం ఇస్తున్న జేఈఈ, నీట్‌లోను విద్యార్థులు విజయం సాధిస్తారని ఇంటర్మీడియట్ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఆశాభావం వ్యక్తంచేశారు.

పిల్లలను ఎన్నికల ప్రచారానికి వాడొద్దు

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సూచన

సాక్షి, అమరావతి: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పిల్లలను వాడుకోవద్దని రాజకీయ పార్టీలకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సూచించింది. మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు బాలలను సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాల్లో వినియోగించకూడదన్నారు. బాలలను ఎన్నికల్లో భాగస్వామ్యం చేస్తే ఆయా రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఎన్నికల కమిషన్ సైతం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. గత కొద్ది రోజులుగా కొందరు అభ్యర్థులు బాలలను ఎన్నికల పనులకు వినియోగిస్తున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. సభ్యులు గొండు సీతారామ్, జంగం రాజేంద్ర ప్రసాద్, త్రిపర్ణ ఆదిలక్ష్మి మాట్లాడారు.

ఏపీకి ఇద్దరు ఏఐసీసీ ఎన్నికల పరిశీలకులు

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇద్దరు ఏఐసీసీ ఎన్నికల పరిశీలకులను నియమించారు. పార్టీ నేతలు వి.శంకర్, మనోజ్ చౌహాన్‌లను ఎన్నికల పరిశీలకులుగా నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

గానకోకిల సుశీలమ్మకు జీవిత సాఫల్య పురస్కారం



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న పీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్: పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీలమ్మకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు శ్రీ గురునారాయణ కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ జి.సన్యాసమ్మ, వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎ.నారాయణ తెలిపారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేదీన కళాపీఠం తృతీయ వార్షికోత్సవాలు విజయనగరం ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా సుశీలమ్మ సుస్వరాలు, మణిశర్మ మధురగీతాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా గానకోకిలకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. ఆమెతో పాటు ప్రఖ్యాత సినీ సంగీత దర్శకుడు మణిశర్మకు ఆత్మీయ సన్మానం, లవకుశ చిత్రంలో కుశుడు పాత్రతో పేరుపొందిన వియ్యూరి సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సత్కారం చేస్తామని చెప్పారు.



నిజమైన సంతోషం అనేది
దాని సహజగుణం కారణంగా అంతటా వ్యాప్తి చెందుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 27 మార్చి 2024

అసమానతల భారతం

ప్రపంచం ముందుకు పోతోంది... దేశం శరవేగంతో సాగిపోతోంది... అని పాలకులు భుజాలు ఎగరేస్తున్న వేళ కళ్ళు తిరిగే గణాంకాల లెక్క ఇది. అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో కొందరు అంతెత్తున ఉంటే, అనేకులు అధఃపాతాళంలోనే ఉన్నారని తేలింది. భారతదేశంలో ఆదాయం, సంపదల్లో అసమానతలు గడచిన శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా తారస్థాయికి చేరాయని 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' అధ్యయన పత్రం వెల్లడించింది. నోబెల్ బహుమతి గ్రహీత థామస్ పికెట్టీ సహా నలుగురు ప్రసిద్ధ ఆర్థికవేత్తలు రూపొందించిన ఈ పత్రం ప్రపంచంలో అసమానత అధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటని తెలిపింది. ఆదాయ అసమానతలో మన దేశం దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలను సైతం వెనక్కి నెట్టేసింది. బ్రిటీషు పాలనలో కన్నా ఇప్పుడే భారత్‌లో అసమానతలు ఎక్కువయ్యాయట. ఇది ఆందోళన రేపుతోంది. పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది.

'భారతదేశ ఆదాయం, సంపదల్లో అసమానత 1922 – 2023: బిలియనీర్ల రాజ్య ఆవిర్భావం' అనే ఈ పత్రం అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది. 2000ల నుంచి దేశంలో అసమానతలు తారాపథానికి దూసుకుపోయాయి. ప్రస్తుతం దేశ సంపదలో 40 శాతం పైగా కేవలం ఆర్థిక బలసంపన్నులైన అగ్రశ్రేణి 1 శాతం మంది దగ్గరే పోగుబడింది. దేశ ఆదాయం లెక్కన చూస్తే 22.6 శాతం ఈ కొందరి వద్దే ఉంది. ఇక, కింది 50 శాతం జనాభా జాతీయ ఆదాయం మాత్రం 15 శాతమే. వెరసి, గడచిన ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేనట్టు అత్యధిక స్థాయిలో ఒకేచోట సంపద పోగుబడుతోంది. మరో ముఖ్య విషయమేమంటే, భారత్‌లో ఆర్థిక సమాచార నాణ్యత అంతంతే గనక వాస్తవిక అసమానతా స్థాయులతో పోలిస్తే పత్రంలో పేర్కొన్న అంచనాలు ఇంకా తక్కువేనట. పైనున్న వర్గాలు పైపైకి పోతుంటే, కింది వర్గాలు ఇంకా కిందకు పోయేలా ఆర్థిక అసమానతలు పెరగడం ఆందోళన రేపుతోంది. సమాజంలో అశాంతి, అస్థిరత పెచ్చరిల్లే ముప్పుంది.

ఇలాంటి అంతర్జాతీయ నివేదికలే కాదు దేశంలోని స్థానిక నివేదికలు సైతం అసమానతల్ని పట్టిచూపుతున్నాయి. కర్ణాటకలోని ప్రగతివాద బృందాల సమ్మేళనమైన 'బహుత్వ కర్ణాటక' సైతం దేశంలో, ముఖ్యంగా కన్నడ సీమలో పెరుగుతున్న ఆదాయ అసమానతల్నీ, ఉపాధి రంగంలోని ఆందోళనకరమైన ధోరణుల్నీ ఈ మధ్యే తన నివేదికలో వివరించింది. ఆర్థికాభివృద్ధి, ఉపాధి వృద్ధి, ఆదాయ సమానత అంటూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 'గ్యారెంటీ' ప్రకటనలకూ, క్షేత్రస్థాయి వాస్తవాలకూ మధ్య ఉన్న అంతరాన్ని వెల్లడించింది. నిజానికి, కేంద్రంలోని ప్రస్తుత పాలకులు పదేళ్ళ క్రితం అభివృద్ధి, ఆర్థిక సంస్కరణల అజెండాతో గద్దెనెక్కారు. తమ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ 8.4 శాతం వంతున వృద్ధి చెందిందనీ, ముఖ్యంగా 2023లో ఆఖరి మూడు నెలల్లో అత్యంత వేగంగా ఈ పురోగతి సాగిందనీ వారు జబ్బలు చరుస్తున్నారు. అయితే, వారు అధికారంలో ఉన్న ఈ రెండుసార్లలోనే బీద, గొప్ప తేడా బాగా పెరిగిందనేది ప్రతిపక్షాల ప్రధాన విమర్శ. పైపెచ్చు, ఢిల్లీ సర్కార్ శతకోటీశ్వరులకు సన్నిహితంగా మెలుగుతోందని ఆరోపణలు సరేసరి.

గమనిస్తే 1991నాటి ఆర్థిక సరళీకరణ ఆసరాగా దేశంలో బిలియనీర్ల సంఖ్య పెరిగింది. 1991లో వారి సంఖ్య కేవలం 1 కాగా, 2022 నాటికి 162కు పెరిగిందని ఫోర్బ్స్ పత్రిక కథనం. పికెట్టీ తాజా పత్రం ఫోర్బ్స్‌తో పాటు పలు పత్రికలనూ, ఇతర అధ్యయనాలనూ ఉటంకించింది. అవన్నీ దేశంలో ధనికులకూ, గ్రామీణ నిరుపేదలకూ మధ్య అంతరం పెరుగుతోందని నిర్ధారిస్తున్నాయి. అయితే, ప్రపంచంలో అసమానత అధికంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటనే మాట సత్యదూరమనే వారూ లేకపోలేదు. పికెట్టీ అధ్యయన విధానం పారదర్శకంగా లేదనీ, అసమానతల్ని పెంచి చూపేలా ఫోర్బ్స్ వగైరా నుంచి సంపన్నుల జాబితాలను ఎంచుకుంటున్నారనీ దశాబ్ద కాలంగా విమర్శకుల అభ్యంతరం. అయితే ఎంత ఎక్కువనే మాట పక్కనపెడితే... దేశంలో ఆర్థిక అసమానతలు ఇప్పటికీ గణనీయంగా ఉన్నాయనేది ఎవరూ కాదనలేనిది. వాటిని తగ్గించడానికి ప్రయత్నించడమే కర్తవ్యం.

దారిద్ర్యాన్ని తగ్గించడానికి వీలుగా వృద్ధిపై పెట్టడం వల్ల ఇటు ఆదాయ, సంపదల్లో అసమానతలు పెరిగినప్పటికీ అదే పంథాను అనుసరించాలా అన్నది మరో ప్రాథమిక ప్రశ్న. 1960 – 80ల మధ్య పై శ్రేణిలోని 10 శాతంతో పోలిస్తే, దిగువనున్న 90 శాతం మంది గణనీయంగా వృద్ధి సాధించారు. ఆర్థికసరళీకరణ అనంతరం మాత్రం మిగతా జనాభా కన్నా అగ్రశ్రేణి వర్గమే పైకెదిగింది. ఇక, 2014-2022 నడుమ దిగువ 50 శాతంతో పోలిస్తే, మధ్య 40 శాతం జనాభా వృద్ధి నిదానించింది. అగ్రస్థాయి 10 శాతం వారి పురోగతేమో ఆపలేని వేగం అందుకుంది. ధనిక, పేద తేడాకు ఇది ప్రధాన కారణం. మొత్తానికి గత దశాబ్దిన్నరలోనే అసమానతలు హెచ్చాయనేది నిర్వివాదాంశం.

శతకోటీశ్వరుల సంఖ్య పెరిగిందనే వాస్తవాన్ని గుర్తిస్తే... ఆర్థిక వ్యత్యాసాల్ని చక్కదిద్దడానికి తాజా పత్ర రచయితలు చేసిన కొన్ని విధాన సూచనల్ని కొట్టిపారేయలేం. సంపద పంపిణీ దృష్ట్యా చూస్తే, పేదలతో పోలిస్తే ధనికులు తక్కువ పన్నులు కట్టే ఇప్పటి విధానంలో మార్పు తేవాలి. ఆదాయం, సంపదలు రెంటినీ పరిగణించేలా పన్ను షెడ్యూల్‌ను పునర్వ్యవస్థీకరించి, భారత్‌లోని బిలియనీర్ల పైన సూపర్ ట్యాక్స్ విధించాలని వారు సూచిస్తున్నారు. అలాగే, బీదాగొప్ప తేడాల్ని తగ్గించేందుకు వ్యూహాత్మక దీర్ఘకాలిక విధానాలపై దృష్టి సారించాలి. స్వల్పకాలిక వరాల కన్నా సుస్థిర, దీర్ఘకాల దారిద్ర్య నిర్మూలన పథకరచన సాగించాలి. సంక్లిష్టమైన ఈ వృద్ధి, దారిద్ర్యం, ఆర్థిక అసమానత లాంటి అంశాలపై మరింత లోతైన అధ్యయనం చేయాలి. ప్రజాస్వామ్య భారతం ధనికస్వామ్యంగా మారితేనే కష్టం, నష్టం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.విదియ ప.3.12 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** చిత్త ప.2.41 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.8.44 నుండి 10.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.1142 నుండి 12.30 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.40 నుండి 9.23 వరకు

సూర్యోదయం : 6.02
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఆప్ ముందున్న అసలు సవాలు

విశ్లేషణ



ఆశుతోష్

మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడం పరిహాసాస్పదం! అవినీతి వ్యతిరేక ఉద్యమంలో నుంచి నాయకుడిగా ఎదిగి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ని స్థాపించిన కేజ్రీవాల్ భారత రాజకీయాల్లో ఒక ఆశాకిరణంగా కనబడ్డారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ ఐసీయూలో ఉందంటే దానికి కారణం కేజ్రీవాల్. అలాంటిది... ఇప్పుడు ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడమే ఆప్ ముందున్న పెద్ద సవాలు. రెండవ వరుస నాయకులను ఎదగనివ్వకపోవడం ఆప్ వైఫల్యాలలో ఒకటి. ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ జైలు నుండే నడుపుతారని ఆప్ చెబుతోంది. ఈ వాదన ఆచరణలో నిలబడదు. చివరకు ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించేలా కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను అమలు చేయడానికి ఇది తగిన సందర్భమయ్యే ముప్పుంది.

ఇది ఎంత పరిహాసాస్పద విషయం! అవినీతి వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన వ్యక్తి ఇప్పుడు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్నారు. మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

పార్టీ నిలబడేనా?

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక ఆప్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ఢిల్లీలో పోటీ చేయాలని నిర్ణయించుకున్న తర్వాత జరిగిన కేజ్రీవాల్ అరెస్టు ఉదంతం... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం గణనీయ స్థాయిలో రిస్క్ తీసుకున్నట్లు చూపిస్తోంది. ఈడీ చర్య వెనక్కి తన్నడమే కాదు, ఆఖరికి ఢిల్లీలో బీజేపీ ఎన్నికల అవకాశాలను దెబ్బతీసే అవకాశం కూడా ఉంది. అయినప్పటికీ అవినీతికి వ్యతిరేకంగా పోరాడటంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోగల దూతగా తనను తాను చూపించుకోవాలనే నరేంద్ర మోదీ గేమ్ ప్లాన్‌లో భాగంగానే ఈ అరెస్టు జరిగినట్టు తెలుస్తోంది. తాను ప్రధాని అయినప్పటి నుండి మోదీ... తాను అవినీతికి పాల్పడని వ్యక్తిగానే కాదు, ఇతరులను కూడా అలా చేయడానికి అనుమతించనివాడిగా తన ఇమేజ్‌ను ఒక తెలివిడితో నిర్మించుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ సహా ప్రతిపక్షాలను అవినీతిలో కూరుకుపోయిన రాజకీయ పార్టీల సమాహారంగా చిత్రీకరించడానికి ఆయన ఏ మార్గాన్నీ వదిలిపెట్టలేదు. ఎన్నికలు సమీపంలో ఉన్న కాలంలోనే ఇద్దరు ముఖ్యమంత్రులను (జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్, ఢిల్లీలో కేజ్రీవాల్) అరెస్టు చేయడం చూస్తే, అవినీతి అనేదాన్ని ఎన్నికల్లో పెద్ద అంశంగా మోదీ కోరుకుంటున్నారని రుజువు. ఈ వ్యూహం విజయవంతమవుతుందో లేదో కానీ, కేజ్రీవాల్ అరెస్ట్ మాత్రం కచ్చితంగా ఆప్‌కు అస్తిత్వ సంక్షోభాన్ని సృష్టించే అవకాశం ఉంది.

అవినీతికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం తాలూకు పరిణామం ఆమ్ ఆద్మీ పార్టీ. రాజకీయ పార్టీని ప్రారంభించడానికి ముందు దాని నాయకులకు క్రియాశీల రాజకీయాల్లో అనుభవం లేదు. ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా కాకుండా, ఆప్‌కి వెనక్కి మరలడానికి సంస్థాగత స్మృతి లేదు. పైగా ఇంతటి సంక్షోభాన్ని ఎదుర్కొనే సంస్థాగత పటిష్ఠత కూడా దానికి లేదు. ఇటువంటి సంక్షోభాలు తరచుగా ఇతర నాయకులను ముందు వరసలోకి నెడుతుంటాయి. కానీ ప్రస్తుతానికి, ఇది ఆప్‌కు అసంభవంగా కనిపిస్తోంది. కేజ్రీవాల్ లేనప్పుడు శూన్యతను భర్తీ చేయగల మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ ఇప్పటికే నిర్వీర్యులై జైలులో మగ్గుతున్నారు. ఈ ముగ్గురూ లేకపోవడంతో పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆఫీస్ బేరర్లు, క్యాడర్‌లందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడు ఎవరూ లేకుండాపోయారు. రెండవ



మద్యం కుంభకోణంలో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

వరుస నాయకులను ఎదగనివ్వకపోవడం ఆప్ అతిపెద్ద వైఫల్యాలలో ఒకటి. పార్టీ కేజ్రీవాల్ చుట్టూ కేంద్రీకృతమై నడిచింది. ఎవరికీ స్వయంప్రతిపత్తి, స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అవకాశం లేదు.

పోరాట యోధుడు

అయితే, ఆమ్ ఆద్మీ పార్టీ దాని ప్రారంభం నుండి పోరాట పటిమను కలిగి ఉంది. ఇది అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిత్వానికి ప్రతిబింబం. భారత రాజకీయాలలో సంక్షోభాలను ఎదుర్కోవడాన్ని ఆనందించడమే కాదు, మోదీలా అందరినీ ఏకతాటి మీదకు తెచ్చే నాయకుడు కేజ్రీవాల్. ఆయన్ని ఇష్టపడవచ్చు లేదా ద్వేషించవచ్చు, కానీ ఎప్పుడూ విస్మరించలేం. ఆయన మేధావితనం లక్ష్యం కోసం ఒకే దీక్షగా సాగిన సాధనలో ఉంది. ఆయన ఫీనిక్స్ పక్షిలా బూడిద నుండి లేచే అరుదైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. ఆయన అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమ రూపశిల్పి. అది మొత్తం రాజకీయ వ్యవస్థను కదిలించింది, కాంగ్రెస్ పార్టీ పతనానికి దారితీసింది. ఈరోజు కాంగ్రెస్ పార్టీ ఐసీయూలో ఉందంటే దానికి కారణం కేజ్రీవాల్. అయితే, కేజ్రీవాల్ సృష్టించిన పరిస్థితిని బీజేపీ నేర్పుగా ఉపయోగించుకుని కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

2014లో 49 రోజుల అధికారం తర్వాత కేజ్రీవాల్ తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసినప్పుడు ఆయన రాజకీయ జీవితం పట్ల అనేక సంస్మరణ గీతాలు రాసేశారు. ఆ తర్వాత, 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆప్ మొత్తం ఏడు స్థానాలను కోల్పోయింది. దీంతో 2015లో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ గెలుపొందుతుందనే ఆశను ఆఖరికి దాని నాయకులు కూడా కోల్పోయినప్పుడు ఇది జరిగింది: అపూర్వమైన తీర్పుతో పార్టీ తిరిగి పుంజుకుని, 70 అసెంబ్లీ సీట్లలో 67 గెలుచుకుంది. కేజ్రీవాల్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో కనెక్ట్ అవ్వడం వల్ల ఇది సాధ్యమైంది. కానీ నేడు పార్టీ తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, దానిని నడిపించడానికి ఆయనకు స్వేచ్ఛ లేదు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లోని నిబంధనలతో ఆయనపై అభియోగాలు మోపారు. బెయిల్ అంత సులభం కాదు. పైగా ఆయన నెలలపాటు జైలులో గడపవలసి ఉంటుంది.

రాజీనామా చేయడమే మేలు!

ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవడమే ఆప్ ముందున్న మొదటి, అతిపెద్ద సవాలు. అయితే ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ జైలు నుండే నడుపుతారని ఆప్ చెబుతోంది. ఈ వాదన మంచి వాక్చాతుర్యానికి పనికొస్తుందికానీ, ఆచరణలో నిలబడటానికి చట్టపరమైన ప్రాతిపదికలు లేవు. కేజ్రీవాల్ తన సహచరుల్లో ఎవరినీ విశ్వసించరనీ లేదా రాజ్యాంగ చట్రంపై ఆయనకు అంతగా అవగాహన లేదనీ సూచిస్తూ, పార్టీలోని అంతర్లీన బలహీనతను ఇది బహిర్గతం చేస్తుంది. ఒక ముఖ్యమంత్రి ప్రభుత్వం మొత్తానికి మూలాధారం. కానీ ఆయనే జైలులో ఉంటే, అన్ని ఆచరణాత్మక ప్రయోజనాల కోసం పరిపాలనను నడపలేరు. ఈ స్థితిని చేపట్టడం అంటే బీజేపీ,మోదీ ప్రభుత్వం చెప్పుచేతల్లో ఆడటమే అవుతుంది. ఇది రాజ్యాంగ విచ్ఛిన్నానికి దారి తీస్తుంది. ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను అమలు చేయడానికి తగిన సందర్భం అవుతుంది. మాజీ ముఖ్యమంత్రులు లాలూప్రసాద్ యాదవ్, జయలలిత అరెస్ట్ అయినప్పుడు చేసినట్లుగానే కేజ్రీవాల్ రాజీనామా చేసి, తాను లేనప్పుడు సీఎం కాగల కొత్త నాయకుడిని పార్టీ ఎన్నుకోనివ్వాలి. హేమంత్ సోరెన్ కూడా అరెస్టు కావడానికి ముందు, తన స్థానంలో చంపయీ సోరెన్‌కు మార్గం సుగమం చేశారు.

అలా కాదంటే, ఆప్ ప్రస్తుత వ్యూహానికి ఎదురుదెబ్బ తగులుతుంది. పైగా ఢిల్లీకున్న డీమ్డ్ రాష్ట్ర హోదాను ఉపసంహరించుకునే పరిస్థితికి కూడా దారితీయవచ్చు. పైగా అది ఎన్నుకున్న ప్రభుత్వం లేదా అసెంబ్లీ లేకుండా 1993 పూర్వ స్థితికి తిరిగి వెళ్లవచ్చు. అది ఆమ్ ఆద్మీ పార్టీకి విపత్తే అవుతుంది.

ఆప్ ఆవిర్భావం ఒక ఆశాకిరణమై, భారత రాజకీయాల్లో ఆదర్శవాదం తిరిగి వచ్చినట్లు ప్రశంసలు పొందింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు జాతీయ ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించే అవకాశం ఉండింది. ఆప్ పాత భవనాన్ని ధ్వంసం చేసి కొత్త రాజకీయ నిర్మాణాన్ని నిర్మించాలనే చిత్తశుద్ధితో పాత వ్యవస్థ తిరస్కరణను ప్రబోధించింది. కానీ అయ్యో, దానికి చరిత్రపై స్పృహ లేకపోవడం, దేశాన్ని పునర్నిర్మించాలనే దృక్పథం లేకపోవడం వల్లే ఆప్ ఈనాటి నిరాశకు కారణమైంది.

వ్యాసకర్త 'ఆప్' మాజీ సభ్యుడు, పత్రికా సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సరైన పని



ఇండియా సరైన పని చేస్తోంది. తమ జాతీయ సార్వభౌమత్వాన్ని నిలుపుకోవడంలో ఫిలిప్పీన్స్‌కు మద్దతిస్తోంది (చైనా విషయంలో).

– సనా హాష్మీ, ఫెలో

దారుణం



నేను బాల్టిమోర్ (యూఎస్) ప్రాంతంలో నివసించేవాడిని. ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన నాకు బాగా తెలుసు. ఇది చాలా ఘోరమైన విషాదం. (సరుకుల ఓడ ఢీకొట్టడంతో 2.6 కిలోమీటర్ల పొడవైన వంతెన కూలిన నేపథ్యంలో).

– రాబర్ట్ మెలోనీ, శాస్త్రవేత్త


ఈ కాలంలోనా?



బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ తన భర్త కునాల్ ఖేము, ఆరేళ్ల కూతురితో హోలీ జరుపుకొన్నట్టు పెట్టిన ఫొటోలకు చాలామంది ఇస్లామిస్టులు దూషిస్తూ కామెంట్లు పెట్టారు. ఆమెను ఏకంగా 'ముశ్రిక్' (బహుదేవతారాధకురాలు అని అర్థం) అని నిందించడమే కాకుండా, ఒక హిందువును ఎలా పెళ్లాడావని ప్రశ్నించారు.

– దివాకర్ దత్తా, జర్నలిస్ట్

పోటీగా ఆడాల్సిందే!



నా లెక్కలో ఇప్పటికిప్పుడు టీ20 ప్రపంచ కప్ ఆడే భారత జట్టులో నలుగురే నిశ్చితం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, బుమ్రా. మిగతా అన్ని స్థానాలకూ ఎక్కువమంది పోటీలో ఉన్నారు. అంటే ఈ ఐపీఎల్‌లో పోటీ మరింత తీవ్రంగా ఉండాలి!

– అయాజ్ మెమన్, క్రీడా వ్యాఖ్యాత

కొందరికే మేలు



ఆకర్షించిన కథనం: ఇప్పుడు ఆసియా బిలియనీర్ల రాజధాని ముంబయి. 'హురూన్ రీసెర్చ్ గ్లోబల్ రిచ్ లిస్ట్' ప్రకారం, బీజింగ్(91) కంటే ఎక్కువమంది బిలియనీర్లు ముంబయి(92)లో ఉన్నారు. ఇక్కడ గమనించాల్సింది: 1 శాతం ధనవంతులు 40 శాతం సంపదను నియంత్రిస్తున్నారు. శ్రీమంతుల రాజ్యం అనేది వినడానికి బాగుంటుంది కానీ అది కొందరి దగ్గరే సంపద పోగుపడటం!

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

అరెస్ట్ అయితే చాలా?



దోషిగా తేలకుండానే, కేవలం అరెస్ట్ అయినంత మాత్రానే ఒక ముఖ్యమంత్రి రాజీనామా చేయాల్సివస్తే గనక కేంద్ర ప్రభుత్వం ఏ ముఖ్యమంత్రినైనా కేవలం ఒక్క రోజు కోసం అరెస్ట్ చేసి ఎవరినైనా పదవీచ్యుతుడిని చేయగలదు. అది పిచ్చితనం అవుతుంది. కాబట్టే అరెస్ట్ అయితే రాజీనామా చేయడం అనేది చట్టబద్ధం కాదు (అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ నేపథ్యంలో).

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

ఒక జాగ్రత్త



ప్రియమైన స్కూళ్లకు వెళ్లే అమ్మాయిలూ! బ్యాక్‌ప్యాక్ అనేది మీ బ్యాక్(వీపు) మీదే ఉండాలి కానీ పిరుదుల మీదకు దిగకూడదు. శరీర భాగాలను దాయడం అనేది అబ్బాయిల, పురుషుల నుంచి మంచి ప్రవర్తన అనిపించుకుంటుందేమోగానీ, అది దీర్ఘకాలంలో వెన్ను, మెడ, తల నొప్పులకు కారణం అవుతుంది.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

నాటకం అతి ప్రాచీనం

'కావ్యేషు నాటకం రమ్యం' అని ఆర్యోక్తి. ఇది భారతీయ సాహిత్యపు రమణీయ వాక్యం. ఇది కావ్యాలలో నాటకానికి ఉన్న ప్రాధాన్యతనీ, ప్రాచుర్యాన్నీ వివరిస్తుంది. 1961 మార్చి 27న వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారు 'ప్రపంచ రంగస్థల దినోత్సవా'న్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. ఆ మరుసటి ఏడాదే ఫ్రాన్స్‌లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. నాటకాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం, ప్రజలకు నాటక ప్రాముఖ్యం మీద అవగాహన కలిగించడం, విస్తృత స్థాయిలో నాటక రంగ సంస్థలను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కలిగించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

రంగస్థల దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో విస్తరించి ఐక్యరాజ్య సమితి, యునెస్కో వంటి సంస్థల ఆమోదం పొందింది. ఈ వేడుకలలో భాగంగా వివిధ దేశాలలో ప్రదర్శించే నాటక ప్రదర్శనలు, ప్రక్రియల ప్రమాణాలను గూర్చి పరిశీలకులు, నాటక మేధావులు సమీక్షిస్తారు. ప్రతి సంవత్సరం నాటకరంగంలో నిష్ణాతులైన ఒకరిని సమన్వయకర్తగా ఎంపిక చేసి, నాటక రంగంపై వారి మనోగతాన్ని ఆ సంవత్సరపు సందేశంగా రంగస్థల ప్రపంచానికి అందిస్తారు.

నాటక కళ వివిధ దేశాల్లో ఏ ప్రేరణా, ప్రమేయం లేకుండా విడివిడిగా అభివృద్ధి చెందిన కళా ప్రక్రియ. నాలుగో శతాబ్దంలో 'ది పెర్సియన్స్' అనే నాటికను గ్రీకులు ప్రదర్శించారనీ, ప్రపంచంలో మొట్టమొదటి నాటకాన్ని ఏథెన్స్ నగరంలో 'డైనోసిస్' అనే థియేటర్‌లో ప్రదర్శించారనీ చరిత్రకారులు భావిస్తారు. భారతదేశంలో క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో భరతముని రాసిన నాట్యశాస్త్రమే నాటకానికి స్ఫూర్తి అనే వాదన ఉంది. భారతీయ రంగస్థలం ఋగ్వేద కాలం నాటిదని కొందరి అభిప్రాయం. క్రీ.శ. 80 – 150 కాలానికి చెందిన అశ్వఘోషుడు సంస్కృతంలో రచించిన 'సారిపుత్ర ప్రకరణం' తొలి నాటకంగా భావిస్తున్నారు.

– ర్యాలి ప్రసాద్, కాకినాడ
(నేడు ప్రపంచ రంగస్థల దినోత్సవం)

సీమ ప్రజల కాంక్షలు ఫలించేలా...

అభిప్రాయం



డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి

2024 లోక్ సభ, శాసన సభ ఎన్నికల నేపథ్యంలో రాయలసీమ ప్రాంత సమస్యలను జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు నిర్దిష్టంగా తమ మ్యానిఫెస్టోలలో చేర్చాలని కోరుతున్నాం.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో రాయలసీమ ప్రయోజనాలతో ముడిపడిన అనేక అంశాలు ఉన్నాయి. సాక్షాత్తు భారత పార్లమెంటుచే ఆమోదం పొంది చట్టబద్ధంగా అవకాశం ఉన్న ఆ హక్కుల అమలు జరగాలి. వీటితో పాటు ఇతర అనేక అంశాలను కూడా రాయలసీమ పౌరసమాజం, ప్రజా సంఘాలూ కోరుతున్నాయి. రాజకీయ పార్టీలు ఈ అంశాలకు చోటు కల్పించాలని మనవి చేస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడింట ఒక భాగం జనాభా ఉన్న అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల విషయంలో సీమ వాసుల ఆకాంక్షల మేరకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలి. ఇతర రంగాల అభివృద్ధిలోనూ ప్రాధాన్యత ఇవ్వాలి. కోటి ఎకరాల భూభాగం ఉన్న రాయలసీమకు తుంగభద్ర-కృష్ణా నదీ జలాలలో 133 టీఎంసీల నికరజలాలపై హక్కు ఉంది. ఆ నీటిని అందేలా చూడాలి. పెండింగ్ ప్రాజెక్టులను నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించాలి.

విభజన చట్టం సెక్షన్ 46లో వెనకబడిన ప్రాంతాల కోసం ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి తగిన ఆర్థిక వెసులుబాటులు చేయాలని ఉంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి కోసం ప్యాకేజీ రూపొందించాలని ఉంది. ఈ ప్యాకేజీని కనీసం లక్షకోట్లతో సమగ్రంగా చేపట్టాలి. సెక్షన్ 94 ప్రకారం ఇరు రాష్ట్రాలలో పారిశ్రామిక అభివృద్ధి కోసం పన్ను మినహాయింపుతో సహా తగిన ఆర్థిక చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. కాబట్టి రాయలసీమ ప్రాంతంలో ప్రత్యేక పన్ను మినహాయింపుతో సీమ ఖనిజ



వనరులు వెలికితీతతో పాటు, స్థానికంగా ఉత్పాదక పరిశ్రమలకు తోడ్పాటు ఇవ్వాలి. సీమ యువతకు ఆయా రంగాలలో ప్రత్యేక నైపుణ్యాలు అభివృద్ధి చేసేలా కేంద్రాలు నెలకొల్పాలి. యువతకు నిరుద్యోగ భృతి కల్పించి ఆత్మవిశ్వాసం నింపాలి.

విభజన చట్టం సెక్షన్ 93 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 11 జాతీయ ప్రాధాన్యత ఉన్న విద్యాసంస్థలను కేటాయించింది. ఇందులో రాయలసీమకు సంబంధించినవి కేంద్రీయ విశ్వవిద్యాలయం (అనంతపురము), రెండు ఐఐటీలు (తిరుపతి, కర్నూలు), ఐఐఎస్ఇఆర్ (తిరుపతి) ఉన్నాయి.

విభజన చట్టంలో పేర్కొన్న విధంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లాలో సమగ్ర ఉక్కు కర్మాగారాన్ని విశాఖపట్నం ఉక్కు కర్మాగారం స్థాయిలో ఈ ప్రాంతానికి లబ్ధి చేకూరేలా నిర్మాణం చేయాలి. ముద్దనూరు – పుట్టపర్తి, కడప –రాయచోటి– కదిరి – పుట్టపర్తి– చిక్‌బళ్ళాపురం, రాయచోటి – మదనపల్లె– బెంగుళూరు, కళ్యాణదుర్గం– పావగడ్డ – తుమకూరు, నంద్యాల – కర్నూలు తదితర రైల్వేలైన్లను నిర్మించాలి. కర్నూలు, నంద్యాల జిల్లాలను సీడ్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలి. రైతులకు ఉపయోగపడేలా సీమలో శీతల గిడ్డంగులు నిర్మాణం చేయాలి. సీజనల్ వలస కూలీలకు ఉపాధి కల్పించాలి.

రాయలసీమ పురావస్తు, చరిత్ర అవశేషాలనూ, సంస్కృతి, సాహిత్యం, మాండలికం, జానపదకళల సంరక్షణకు ప్రత్యేక సంస్థను నెలకొల్పాలి. 1800 నాడు బ్రిటిష్ వారిపై పాలేగాళ్ల తిరుగుబాట్లను ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా గుర్తించాలి. రాయలసీమలోని పర్యాటక, చారిత్రక స్థలాలు సంరక్షించి, కనీస వసతులు కల్పించాలి. ప్రసిద్ధ ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్‌లు నెలకొల్పాలి. సీమ వాతావరణం, కరువు నివారణ, నీటి సంరక్షణ, కృత్రిమ వర్షాలు, మైనింగ్, తదితర అంశాల నేపథ్యంగా పరిశోధన సంస్థలు నెలకొల్పాలి. స్వయంప్రతిపత్తితో కూడిన రాయలసీమ బోర్డును నెలకొల్పాలి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత । 99639 17187

సమత్వ సాధన

అహంకారంతో నేను గొప్పవాణ్ణి అని విర్రవీగే వారికి సమాధానంలా గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు 'సమత్వం యోగ ఉచ్యతే' (2–48) – సమత్వమే యోగం అని నిర్వచించాడు. విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణుని యందు, గోవునందు, ఏనుగునందు, కుక్క యందు, కుక్క మాంసం వండుకొని తినేవాని యందు సమదృష్టి కలవాడే పండితుడని ఎలుగెత్తి శ్రీకృష్ణుడు చాటి చెప్పారు.



జ్యోతిర్మయం

సర్వ ప్రాణుల యందు తన (ఆత్మ)ను దర్శించి సమభావంతో చూసినవాడు యోగి శ్రేష్ఠుడు అని పదేపదే గీతలో అంటున్నారు శ్రీకృష్ణ భగవానుడు. ఇంతకన్నా సమతా ప్రబోధము ఇంకేముంటుంది! మానవాళి సంఘజీవనానికి దోహదపడే గీతలోని ఆత్మతత్త్వము అవగతం అయితే మానవ లోకమంతా కుటుంబంలా జీవిస్తుంది. అంతే కాకుండా తోటి మానవాళి పట్ల, కాదు కాదు సకల ప్రాణికోటి పట్ల వ్యవహరించాల్సిన తీరును కృష్ణ పరమాత్మ ఇలా బోధించారు. 'శత్రువు పట్ల, మిత్రుని పట్ల సమభావం కలవాడు తనకు ఇష్టమైన వాడని భగవానుడు గీతలో అంటున్నారు.

యుద్ధరంగంలో సారథిగా రథంతోలే పని చేపట్టినా, యుద్ధం ముగియగానే గుర్రాలను శుభ్రం చేసే పని చేస్తున్నా, ధర్మరాజు రాజసూయ యాగంలో అతిథుల పాదాలు కడిగే పని చేపట్టినా... గర్వం లేని కర్మయోగి శ్రీకృష్ణ పరమాత్మ లోకానికి చేసే సేవలో భాగంగానే ఈ పనులను చూడాలి అంటారు తన ఉపన్యాసాలలో శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామీజీ. చేసే పని చిన్నదా? పెద్దదా? గొప్ప వృత్తా? నీచ వృత్తా? అనే దృష్టి విడిచి సమత్వాన్ని ప్రదర్శించిన శ్రీకృష్ణుని ఆచరణ మానవ జాతి అంతటికీ అనుసరణీయం. పుట్టిన జాతి, కులాలను బట్టి గాక, తన సదాచారం వలన వ్యక్తి వందనీయుడు, పూజనీయుడు అవుతాడని శ్రీకృష్ణుని జీవితం ద్వారా, భగవద్గీత సందేశం ద్వారా గ్రహించవచ్చు.

– సాకి

క్లుప్తంగా...

ప్రధానమంత్రి పథకానికి నున్న జెడ్పీ హైస్కూల్ ఎంపిక



విజయవాడరూరల్ (గన్నవరం): ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలంలోని నున్న గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్జాల భూపాల్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వనరులను సమకూర్చనున్నది. ఐదేళ్లలో వచ్చే రూ.2.25 కోట్ల ఆర్థిక సాయంతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ ల్యాబ్‌లతో పాటు గ్రంథాలయం ఏర్పాటు చేసే అవకాశం ఉందని హెచ్‌ఎం పేర్కొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు కీలకం

- మిజోరం గవర్నర్ హరిబాబు



భీమవరం: ఇంజనీరింగ్ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల 44వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఏదో ఒక అంశంలో నైపుణ్యం సంపాదించి కళాశాల నుంచి బయటకు రావాలని సూచించారు. విద్యాసంస్థలు పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ మార్చుకోవడం, పరిశ్రమలతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యల వల్ల విద్యా ప్రగతికి దోహదపడుతుందన్నారు. గవర్నర్ హరిబాబు చేతుల మీదుగా కళాశాల వ్యవస్థాపకుడు దివంగత సాగి రామకృష్ణంరాజు పేరిట పోస్టల్ కవరు విడుదల చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, కళాశాల గౌరవ చైర్మన్ పి.కృష్ణంరాజు, డైరెక్టర్ ఎం.జగపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను కించపరిచిన పెమ్మసానిపై చర్య తీసుకోండి

- సీఈసీకి ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ముస్లింలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసి సమాజంలో అశాంతిని రేకెత్తించేలా వ్యవహరిస్తున్న గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి మంగళవారం నాగుల్ మీరా ఫిర్యాదు చేశారు. తాడికొండలో సోమవారం ఇఫ్తార్ విందులో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నియంత అనుకున్న సద్దాం హుస్సేన్‌ను బంకర్లోంచి లాక్కొచ్చి కుక్కను కొట్టినట్లు కొట్టి చంపారని, జగన్‌కు కూడా అదే గతి పడుతుందని వ్యాఖ్యలు చేయడాన్ని నాగుల్ మీరా తీవ్రంగా తప్పుబట్టారు. సద్దాం హుస్సేన్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని యావత్ ముస్లిం సమాజానికి పెమ్మసాని చంద్రశేఖర్ క్షమాపణ చెప్పకపోతే వెంటపడి కుక్కను కొట్టినట్లు కొడతామని హెచ్చరించారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న టీడీపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

హుండీ ఆదాయంలో 'అన్నవరం' రికార్డు



అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 20 రోజులకుగాను రికార్డు స్థాయిలో రూ.1.01 కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను మంగళవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.97,15,576 కాగా, చిల్లర నాణేలు రూ.4,39,952 వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. వీటితోపాటు బంగారం 12 గ్రాములు, వెండి 522 గ్రాములు, అమెరికా డాలర్లు 41, సింగపూర్ డాలర్లు 12, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ దీనార్ ఒకటి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీనార్లు 5, యూరోలు 5, ఖతార్ రియల్స్ 2, మలేషియా రింగిట్స్ 11 లభించాయి. రోజుకు సరాసరిన రూ.5,07,776 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

'అందరికీ న్యాయం' మన లక్ష్యం



సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

దేశ న్యాయవ్యవస్థలో 50 శాతం పైగా మహిళలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

తిరుపతి సిటీ/తిరుమల: 'జస్టిస్ ఫర్ ఆల్' అనేది మన లక్ష్యమని.. అందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, యువత కృషి చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి విచ్చేసిన ఆయన శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సు పదో వార్షికోత్సవ సభలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్వీయూను 1982లో మాజీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో తన తండ్రి సందర్శించారని చంద్రచూడ్ గుర్తు చేసుకున్నారు. నాణ్యమైన విద్యకు ఈ యూనివర్సిటీ పెట్టింది పేరని, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ ద్వారా సమాజానికి అత్యున్నతమైన న్యాయవాదులను అందించడం శుభపరిణామమని అన్నారు. లా కోర్సును గతంలో రెండవ డిగ్రీగా చూసేవారని.. డాక్టర్, ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యత ఉండేదన్నారు. ప్రస్తుతం యువత న్యాయశాస్త్ర అభ్యసనానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. న్యాయశాస్త్రం క్రమశిక్షణకు మారుపేరన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆలోచనాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయమూర్తులు ప్రజల సమస్యలను సావధానంగా పూర్తిస్థాయిలో వినడం నేర్చుకోవాలని.. తద్వారా కొత్త విషయాలను తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు.

తిరుమల చేరుకున్న సీజేఐ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. వీరు రాత్రి తిరుమలలో బసచేసి బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. వీరికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు.

సోషల్ ఇంజనీర్లుగా న్యాయవాదులు

సమాజంలో పెద్దఎత్తున మార్పు వచ్చిందని, దేశంలోని అనేక రాష్ట్రాల్లో 50 శాతం పైగా మహిళలు ప్రస్తుతం న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా పనిచేయడం గర్వకారణమని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. సమాజంలో వైద్యులు, ఇంజనీర్ల తరహాలో న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లుగా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించి దేశసేవకు అంకితం కావాలని కోరారు. గురువుల మేధస్సు అసాధారణమైందని.. వారు అందించిన జ్ఞానంతోనే తాను చీఫ్ జస్టిస్ స్థాయికి ఎదిగానని చెప్పారు. ఈ సందర్భంగా ఆరుగురు న్యాయాధికారులను ఎస్వీయూ లా కాలేజీ గౌరవ ప్రొఫెసర్లుగా నియమించారు. అనంతరం ఆయనతోపాటు సీజే సతీమణి కల్పనాదాస్ చంద్రచూడ్‌ను వర్సిటీ అధికారులు జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి యు.దుర్గాప్రసాద్‌రావు, డిజిగ్నేటెడ్ సుప్రీంకోర్టు అడ్వకేట్ మహాలక్ష్మి పావని, వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఒ.మహమ్మద్ హుస్సేన్, ప్రిన్సిపాల్ పద్మనాభం, డీన్ ఆచార్య ఆర్‌సీ కృష్ణయ్య, హైకోర్టు న్యాయవాదులు, జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలయం వెలుపల జస్టిస్ ఎన్వీ రమణ



ఆలయం వెలుపల జస్టిస్ దుప్పల వెంకటరమణ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి తదితరులు ఉన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ హృషికేష్ రాయ్

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హృషికేష్ రాయ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వారికి వేదపండితులు ఆశీర్వచనమిచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈవో సతీష్ మాలిక్, పీఆర్వో నాగభూషణం నాయక్ పాల్గొన్నారు.

విజయవాడ డివిజన్‌లో రైళ్ల రద్దు, దారి మళ్లింపు

విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న రైల్వే ట్రాక్‌ల నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను పూర్తిగా, కొన్నింటిని పాక్షికంగా, మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ మండ్రుపకర్ మంగళవారం ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి 28 వరకు మచిలీపట్నం–విశాఖపట్నం (17219), గుంటూరు–విశాఖపట్నం (22701/22702), ఏప్రిల్ 2 నుంచి 29 వరకు విశాఖపట్నం–మచిలీపట్నం (17220) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. అలాగే ఏప్రిల్ 1 నుంచి 28 వరకు మచిలీపట్నం - విజయవాడ (07896), విజయవాడ - మచిలీపట్నం (07769), నర్సాపూర్ - విజయవాడ (07863), విజయవాడ - నర్సాపూర్ (07866), మచిలీపట్నం - విజయవాడ (07770), విజయవాడ - భీమవరం జంక్షన్ (07283), మచిలీపట్నం - విజయవాడ (07870), విజయవాడ - నర్సాపూర్ (07861) రైళ్లు విజయవాడ - రామవరప్పాడు మధ్య పాక్షికంగా రద్దు అయ్యాయి.

దారి మళ్లింపు..

ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీల్లో ఎర్నాకుళం–పాట్నా (22643), ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో భావ్‌నగర్ - కాకినాడ పోర్టు (12756), ఏప్రిల్ 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీల్లో బెంగళూరు–గౌహతి (12509), ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీల్లో ఛత్రపతి శివాజీ టెర్మినస్ (11019), ఏప్రిల్ 1 నుంచి 28 వరకు ధనాబాద్ – అలప్పుజ (13351), ఏప్రిల్ 4, 11, 18, 25 తేదీల్లో టాటా–యశ్వంత్‌పూర్ (18111), ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీల్లో జసిదిహ్ - తాంబరం (12376), ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీల్లో హతియ - ఎర్నాకుళం (22837), ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో హతియ - బెంగళూరు (18637), ఏప్రిల్ 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీల్లో హతియ - బెంగళూరు (12835), ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీల్లో టాటా - బెంగళూరు (12889) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్లించారు.

నా కుమార్తెను వ్యభిచారంలోకి దించేందుకు నా ఫ్రెండ్ ప్రయత్నిస్తోంది

- నా బిడ్డను నాకు అప్పగించేలా పోలీసులను ఆదేశించండి
- హైకోర్టులో ఓ మహిళ హెబియస్ కార్పస్ పిటిషన్
- బాధ్యులపై కేసు నమోదు చేశాం: ఏజీ
- బాలిక సంరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది
- విటులను నిందితులుగా పేర్కొనాల్సిన అవసరం ఉందన్న హైకోర్టు



సాక్షి, అమరావతి: తన కుమార్తెను తన స్నేహితురాలు డబ్బు కోసం వ్యభిచార వృత్తిలో దించేందుకు ప్రయత్నిస్తోందని, తన కుమార్తెను తనకు అప్పగించేలా ఆదేశించాలని కోరుతూ రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొంతకాలం క్రితం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఆ బాలికను తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. పోలీసులు ఆ బాలికను కోర్టు ముందు హాజరుపరచగా.. మంగళగిరి వద్ద ఉన్న ఉజ్వలా హోంలో ఉంచాలని పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. ఆ బాలిక వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి, బాధ్యులపై కేసు నమోదు చేయాలంది. అంతేకాక ఈ కేసులో సదరు జిల్లా ఎస్పీని ప్రతివాదిగా చేర్చింది. అలాగే పిటిషనర్ తన స్నేహితురాలిగా పేర్కొన్న మహిళ కూడా కోర్టు ముందు హాజరయ్యారు. తాను కుట్టుపని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటానని, ఆ బాలికను తాను అక్రమంగా నిర్బంధించలేదని ఆ మహిళ తెలిపారు. ఆ బాలిక తన వద్దకు వచ్చి మూడు నెలలు ఉందని, ఆ సమయంలో ఆ బాలికకు టైలరింగ్ నేర్పించానని తెలిపారు. అనంతరం హైకోర్టు ఈ వ్యవహారంలో ప్రభుత్వ వాదన వినాలని నిర్ణయించి అప్పుడు విచారణను వాయిదా వేసింది.

విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి..

ఇటీవల ఈ వ్యాజ్యం విచారణకు రాగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హాజరయ్యారు. ఆ బాలికను వ్యభిచార వృత్తిలోకి దించేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారని కోర్టుకు వివరించారు. బాధిత బాలిక సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, నిస్సహాయ బాలికలు, మహిళలను మానవ అక్రమ రవాణాదారుల నుంచి కాపాడాలని, ఈ విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అలాగే మానవ అక్రమ రవాణాదారుల ఉచ్చులో నుంచి బయటపడిన బాలికలు, మహిళల పునరావాసం కోసం కూడా చర్యలు తీసుకోవాలంది. ప్రస్తుతం చట్టంలో విటులను బాధితులుగా పేర్కొన్నారని, వాస్తవానికి వారిని నిందితులుగా పేర్కొనాల్సిన అవసరం ఉందని తెలిపింది. దీనిపై ఏజీ ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ, మానవ అక్రమ రవాణాదారుల నుంచి బాలికలు, మహిళలను కాపాడే విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అలాగే పునరావాసం విషయంలో అన్ని చర్యలు తీసుకుంటామని నివేదించారు. సమగ్ర వివరాలతో విధానపరమైన నివేదిక సమర్పిస్తామన్నారు. దీంతో హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ

తిహార్ జైలుకు ఎమ్మెల్సీ కవిత

- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపిన ప్రత్యేక కోర్టు
- ఢిల్లీ మద్యం పాలసీ స్కాంలో కవితది కీలకపాత్ర: ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ప్రమేయమున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. దీంతో కవితను ఈడీ అధికారులు తిహార్ జైలుకు తరలించారు. ఏప్రిల్ 9 వరకూ జ్యూడీషియల్ కస్టడీ కొనసాగనుంది. రెండోసారి ఈడీ కస్టడీ ముగియడంతో మంగళవారం ఉదయం కవితను ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరు పరిచారు. ఈడీ తరఫున న్యాయవాది జొహెబ్ హుస్సేన్ ఆన్‌లైన్ ద్వారా వాదనలు వినిపిస్తూ ఈ కేసులో కవిత కీలక కుట్రదారు, లబ్ధిదారు అని ఆరోపించారు. ఇప్పటివరకు ఈడీ జరిపిన విచారణ ఆధారంగా సౌత్ గ్రూప్ లాబీలో కీలకంగా వ్యవహరించిన ఆమె... ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లోని అగ్రనేతలతో కలసి మద్యం కుంభకోణానికి కుట్రపన్నారని తేలిందన్నారు. రూ. 100 కోట్ల లావాదేవీలు, మద్యం విధానంలో మార్పులు, అమల్లో కవిత కీలకపాత్ర పోషించారన్నారు. కవిత చాలా ప్రభావవంతమైన వ్యక్తి అని.. ఆమెను బెయిల్‌పై విడుదల చేస్తే సాక్ష్యాలు, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని తద్వారా విచారణకు ఆటంకం కలగొచ్చని వాదించారు. కవిత పాత్రపై ఇంకా పరిశోధించాల్సిన అవసరం ఉందని... నేరంలో చేతులు మారిన మిగిలిన సొమ్ము గురించిన ఆధారాలు వెలికి తీస్తున్నట్లు వివరించారు. నేరం ద్వారా వచ్చిన రాబడితో ప్రమేయం ఉన్న లేదా సంబంధం ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించనున్నామని, ఆర్థిక నేరాలపై దర్యాప్తు సాధారణ నేరాల దర్యాప్తు కంటే క్లిష్టంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే కవితకు 15 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరుతున్నామని చెప్పారు.

మధ్యంతర బెయిలివ్వండి: కవిత లాయర్

కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా వాదనలు వినిపిస్తూ బెయిల్ పిటిషన్ త్వరగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. మంగళవారం నుంచి కవిత కుమారుడికి వార్షిక పరీక్షలు మొదలుకానున్నందున మధ్యంతర ఉపశమనం కల్పించాలని కోరారు. వాదనల అనంతరం కవితను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తున్నట్లు న్యాయమూర్తి కావేరి బవేజా ఆదేశాలు ఇచ్చారు. బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 1న విచారిస్తామని, ఈలోగా ఈడీ కౌంటర్ దాఖలు చేయాలన్నారు.

ఇది పొలిటికల్ లాండరింగ్ కేసు: కవిత

'ఇది తప్పుడు కేసు. మనీలాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు. తాత్కాలికంగా నన్ను జైలులో పెట్టొచ్చు కానీ కడిగిన ముత్యంలా బయటకు వస్తా. ఈ కేసు నిందితుల్లో ఒకరు ఇప్పటికే బీజేపీలో చేరితే మరొకరికి బీజేపీ టికెట్ ఇచ్చింది. మరొకరు బీజేపీకి రూ. 50 కోట్లు నిధులు ఇచ్చారు. జై తెలంగాణ' అని కవిత వ్యాఖ్యానించారు.

అసంతృప్తి నేతలకు పార్టీ పదవుల ఎర

సీట్లు దక్కని వారికి బాబు బుజ్జగింపు యత్నాలు

- కేఎస్ జవహర్‌కు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి
- గండి బాబ్జికి విశాఖపట్నం పార్లమెంటు అధ్యక్ష బాధ్యతలు

సాక్షి, అమరావతి: సీట్లు దక్కని నేతలను బుజ్జగించేందుకు చంద్రబాబు పదవులు ఎర వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కని వారికి పార్టీ పదవులు ఇచ్చి ప్రాధాన్యత ఇస్తున్నట్లు నమ్మిస్తున్నారు. తద్వారా వారి అసంతృప్తిని కొద్దిగానైనా చల్లార్చేందుకు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఈ పదవులను ఉదారంగా ఇచ్చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సీటు కోసం చివరివరకు ప్రయత్నించి భంగపడిన మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు ఏకంగా జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. తనకు సీటు ఇవ్వకుండా పక్క నియోజకవర్గం నుంచి ముప్పిడి వెంకటేశ్వరరావును తెచ్చి ఆయనకు సీటు ఇవ్వడాన్ని జవహర్ జీర్ణించుకోలేకపోతున్నారు. దళిత వర్గానికి చెందిన జవహర్‌ను అవసరానికి ఉపయోగించుకుని వదిలేశారనే ప్రచారం జరుగుతుండడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా పార్టీ పదవి ఇచ్చినట్లు తెలిసింది. అయినా జవహర్ అలక వీడలేదని చెబుతున్నారు. విశాఖ దక్షిణం నియోజకవర్గం పొత్తులో జనసేనకు వెళ్లిపోవడంతో అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జికి మొండిచేయి చూపారు. ఆయన తిరుగుబాటుకు సిద్ధమవుతుండడంతో కొంతైనా సంతృప్తి పరిచేందుకు విశాఖపట్నం పార్లమెంటు అధ్యక్ష పదవి ఇచ్చారు. పార్టీలో తనకు ప్రాధాన్యం దక్కడంలేదని అసంతృప్తితో రగిలిపోతున్న తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటకు చెందిన మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యానికి పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించారు. ప్రొద్దుటూరు టికెట్ ఆశించి భంగపడ్డ సీఎం సురేష్‌కు రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పదవి ఇచ్చారు. డోన్, నర్సాపురం నియోజకవర్గ అసంతృప్త నేతలు మన్నె సుబ్బారెడ్డి, కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడులకు రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పదవులు ఇచ్చారు. అమలాపురం, కాకినాడ అసంతృప్త నేతలు ముదునూరి మురళీకృష్ణంరాజు, వాసురెడ్డి ఏసుదాసులకు రాష్ట్ర పార్టీ కార్యదర్శి పదవులు ఇచ్చారు. హిందూపురం పార్లమెంటు అధ్యక్షుడిగా ఉన్న బీకే పార్థసారథికి ఎంపీ సీటు ఇవ్వడంతో ఆయన స్థానంలో బీవీ వెంకటరాముడికి పార్లమెంటు అధ్యక్ష బాధ్యతలు ఇచ్చారు. వారికి ఈ పదవులు ఇస్తున్నట్లు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.

టేబుల్ టెన్నిస్‌లో విశాఖ సత్తా

ఒక బంగారు, 2 వెండి పతకాల్ని సాధించిన విశాఖపట్నం పోర్టు అధికారులు



సాక్షి, విశాఖపట్నం: 45వ అఖిల భారత ప్రధాన పోర్టుల టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీలను కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు అథారిటీ నిర్వహించింది. ఈ పోటీల్లో విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) సత్తా చాటింది. 50 ప్లస్ సింగిల్స్ విభాగంలో విశాఖపోర్టు క్రీడాకారుడు జీవీఎస్ రామారావు, ముంబై పోర్టుకు చెందిన సునీల్ ఖేల్కర్‌పై నెగ్గి బంగారు పతకాన్ని సాధించారు. 50 ప్లస్ డబుల్స్ విభాగంలో పోర్టు క్రీడాకారుడు శ్రీధర్ రాజు వెండి పతకాన్ని సాధించారు. పురుషుల డబుల్స్ విభాగంలో రామారావు, కే రఘురామ్ వెండిపతకాన్ని సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో రామారావు కాంస్య పతకాన్ని సాధించారు. మొత్తంగా విశాఖపట్నం పోర్టు టీం విభాగంలో బ్రాంజ్ పతకాన్ని సాధించింది. చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన పోర్టు క్రీడాకారుల్ని వీపీఏ చైర్మన్ డాక్టర్ అంగముత్తు మంగళవారం సత్కరించారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: గాజువాక మాజీ మహిళా కౌన్సిలర్ హత్య కేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ విశాఖ మహిళా కోర్టు న్యాయమూర్తి(ఇన్‌చార్జ్) శ్రీధర్ మంగళవారం తీర్పు చెప్పారు. యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.12 వేలు చొప్పున జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ అందించిన వివరాల ప్రకారం... గాజువాక మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బి.విజయరెడ్డి తన భర్త భోగిసముద్రం విష్ణునారాయణరెడ్డితో కలిసి నాలుగో పట్టణ నేర పరిశోధన పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవో కాలనీలో ఒక అపార్టుమెంటులో నివసించేవారు. ఈ దంపతులు 2019 ఫిబ్రవరి నెలలో తమ ఫ్లాట్‌ను అమ్మకానికి పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న భీమిలి మండలం గొల్లల తాళ్లవలసకు చెందిన కోలా వెంకట హేమంత్(25), విశాఖ జీవీఎంసీ లే అవుట్‌లో నివాసం ఉంటున్న నల్లి రాధిక(35) కలిసి ఫిబ్రవరి 19వ తేదీన విజయరెడ్డి ఇంటికి వెళ్లారు. ఫ్లాట్‌ను తాము కొనుగోలు చేస్తామని చెప్పారు. రెండు రోజుల్లో వచ్చి ఫ్లాట్ కొనుగోలుకు సంబంధించిన అడ్వాన్స్ ఇస్తామని హేమంత్, రాధిక నమ్మబలికారు. వారు చెప్పిన రోజు కాకుండా ఫిబ్రవరి 25వ తేదీ ఉదయం 7.30 సమయంలో విజయరెడ్డి ఇంట్లో ఒంటరిగా ఉండగా వెళ్లారు. ఆమెను కిరాతకంగా కొట్టి చంపి, ఇంట్లో ఉన్న 70 తులాల బంగారం, ఆమె మెడలోని పుస్తెలతాడు తీసుకుని బయటకు వచ్చి ఇంటికి తాళం వేసి, కారు తీసుకుని పరారయ్యారు. విజయరెడ్డి భర్త నారాయణరెడ్డి నాలుగో పట్టణ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి హేమంత్, రాధికలను అరెస్ట్ చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఇద్దరికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.12 వేలు చొప్పున జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, ఈ కేసులో నిందితుడు హేమంత్ ఇటీవల జరిగిన విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంట్లో కిడ్నాప్ కేసులో ప్రధాన సూత్రధారి కావడం గమనార్హం. రాధిక రియల్ ఎస్టేట్ పేరుతో పలువురిని మోసం చేసింది.

103 మంది సిట్టింగులకు...
ఈసారి నో టికెట్

అభ్యర్థుల ఎంపికలో బీజేపీ కఠిన నిర్ణయాలు
- మూడో వంతు ఎంపీలకు ఈసారి మొండిచేయి
- ప్రభుత్వ వ్యతిరేకతకు చెక్ పెట్టేందుకే
- 2019లోనూ 119 మంది ఎంపీలకు టికెటివ్వని బీజేపీ

లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయంపై కన్నేసిన అధికార బీజేపీ అందుకోసం తీవ్రస్థాయి కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా టికెట్ల కేటాయింపులో నిర్మొహమాటంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించడమే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటోంది. గెలుపు అవకాశాలు లేవనుకుంటే ఎవరినైనా పక్కన పెట్టేస్తోంది. ఎంతటి సీనియర్లయినా, ఎంత జనాదరణ ఉన్నా పట్టించుకోవడం లేదు. ఆ క్రమంలో మొత్తం 290 మంది సిట్టింగ్ ఎంపీల్లో ఇప్పటికే ఏకంగా 103 మందికి బీజేపీ టికెట్ నిరాకరించింది...! బీజేపీ ఇప్పటిదాకా ఆరు విడతల్లో 405 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు కూడా రాకముందే మార్చి 2న ఏకంగా 195 మందితో తొలి జాబితాను ప్రకటించడం తెలిసిందే. విపక్ష ఇండియా కూటమి పొత్తులపై, పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఓవైపు మల్లగుల్లాలు సాగుతుండగానే భారీ జాబితా వెలువరించి దూకుడు కనబరిచింది. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా తదితర కేంద్ర మంత్రులు అందులో చోటుచేసుకున్నారు. తొలి జాబితాలో 33 మంది సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ మొండిచేయి చూపింది. ఇక 72 మందితో ప్రకటించిన రెండో జాబితాలో ఏకంగా 30 మంది సిట్టింగులపై వేటు పడింది! మూడో జాబితాలో 9 మంది, నాలుగో జాబితాలో 15 మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. తర్వాత మార్చి 24న 111 మందితో ప్రకటించిన ఐదో జాబితాలోనైతే 37 మంది సిట్టింగులకు టికెట్లు గల్లంతయ్యాయి! తాజాగా మంగళవారం ప్రకటించిన మూడు స్థానాల్లోనూ సిట్టింగులను పక్కన పెట్టి ఇతరులకు టికెట్లిచ్చింది. వీరిలో కేంద్ర మంత్రి రాజ్ కుమార్ రంజన్ సింగ్ కూడా ఉండటం విశేషం. ఈ లెక్కన ఇప్పటికే మూడో వంతుకు పైగా, అంటే 34 శాతం మంది బీజేపీ సిట్టింగులను టికెట్లు దక్కలేదు. మరో 30 నుంచి 40 స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దించేలా కన్పిస్తోంది. వాటిలోనూ మరింతమంది సిట్టింగులను మార్చడం ఖాయమంటున్నారు! 2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా 282 మంది బీజేపీ సిట్టింగుల్లో 119 మందికి టికెట్లివ్వలేదు. అంటే ఏకంగా 42 శాతం మందిని మార్చేసింది! తద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను విజయవంతంగా అధిగమించగలిగామన్నది బీజేపీ అగ్ర నాయకత్వం అభిప్రాయం. అందుకే ఇప్పుడూ అదే వ్యూహాన్ని అనుసరిస్తోంది.

టికెట్లు దక్కని ప్రముఖులు

హర్షవర్ధన్, వరుణ్‌గాంధీ, ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, వీకే సింగ్, అనంత్‌కుమార్ హెగ్డే, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్, అశ్వినీ చౌబే, ప్రతాప్ సింహ... ఇలా ఈసారి టికెట్లు దక్కని బీజేపీ సిట్టింగుల్లో పలువురు సీనియర్లు, ప్రముఖులున్నారు. వీరిలో కేంద్ర మంత్రి హర్షవర్ధన్ అయితే పార్టీ నిర్ణయంతో తీవ్ర నిరాశకు గురై ఏకంగా రాజకీయాలకే గుడ్‌బై చెప్పేశారు. ఇక ప్రజ్ఞాసింగ్, రమేశ్ బిదురి, అనంత్‌కుమార్ హెగ్డే, పర్వేష్ సాహిబ్‌సింగ్ వంటి ఎంపీలపై వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా వేటు పడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



అమెరికాలోని బాల్టిమోర్‌లో పటాప్‌స్కో నదిలో నౌక ఢీకొనడంతో పాక్షికంగా కూలిపోయిన వంతెన (ఇన్‌సెట్లో క్లోజప్)

బ్రిడ్జిని ఢీకొట్టిన భారీ నౌక

కుప్పకూలిన వంతెన ● నదిలో పడిపోయిన వాహనాలు ● కనీసం ఆరుగురు దుర్మరణం!

అమెరికాలోని బాల్టిమోర్‌లో ఘటన
నౌక సిబ్బంది అంతా భారతీయులే
వారి హెచ్చరికలతో తప్పిన పెను ప్రమాదం

బాల్టిమోర్: అమెరికాలో మేరీలాండ్ రాష్ట్రంలోని బాల్టిమోర్ నగరంలో ఘోర ప్రమాదం సంభవించింది. పటాప్‌స్కో నదిలో వాహన కంటైనర్లతో వెళ్తున్న ఓ భారీ నౌక పవర్ ఫెయిల్యూర్‌కు గురైంది. అదుపు తప్పి నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జిని శరవేగంగా ఢీకొంది. దాంతో వంతెన కుప్పకూలింది. దానిపై ప్రయాణిస్తున్న వాహనాలు నీటిలో పడి మునిగిపోయాయి. వాటిలో ప్రయాణిస్తున్నవారు గల్లంతయ్యారు. ప్రమాద సమయంలో బ్రిడ్జిపై గుంతలు పూడుస్తున్న ఆరుగురు సిబ్బంది కూడా నదిలో పడిపోయారు. అధికారులు ఇద్దరిని రక్షించారు. కనీసం ఆరుగురి దాకా గల్లంతైనట్టు తెలుస్తోంది. ప్రమాద స్థలంలో నది 15 మీటర్ల లోతుంది. నీళ్లు కూడా బాగా చల్లగా ఉండటంతో వారంతా దుర్మరణం పాలై ఉంటారని భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి 1.30 దాటాక ఈ దుర్ఘటన జరిగింది. నౌకలోని సిబ్బంది మొత్తం భారతీయులే. నౌక అదుపు తప్పిన వెంటనే వారు హుటాహుటిన ప్రమాద హెచ్చరికలు (మేడే) జారీ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు అప్రమత్తమై వాహనాలేవీ బ్రిడ్జిపైకి వెళ్లకుండా నియంత్రించారు. దానికి తోడు ప్రమాదం జరిగింది అర్ధరాత్రి వేళ కావడంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ కూడా భారీగా లేదు.

ఇలా జరిగింది...

ప్రమాద సమయంలో నౌక గంటకు 15 కి.మీ. వేగంతో వెళ్తోంది. పవర్ ఫెయిల్యూర్‌తో అదుపు తప్పి శరవేగంగా బ్రిడ్జికేసి దూసుకొచ్చి దాని తాలూకు పిల్లర్‌ను ఢీకొట్టింది. పిల్లర్ విరగడంతో 2.6 కిలోమీటర్ల పొడవున్న వంతెన ఒక్కసారిగా కుంగిపోయింది. సెకండ్ల వ్యవధిలో పాక్షికంగా కుప్పకూలింది. ఆ వెంటనే నౌకలో మంటలు చెలరేగి దట్టమైన పొగ వెలువడింది. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రమాద వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇది కనీవినీ ఎరగని ప్రమాదమని మేరీలాండ్ గవర్నర్ వెస్ మూర్ అన్నారు. ప్రమాద హెచ్చరికకు అధికారులు శరవేగంగా స్పందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారంటూ కొనియాడారు. ప్రమాదం జరిగిన తీరు యాక్షన్ సినిమా సీన్‌ను తలపించిందని బాల్టిమోర్ మేయర్ బ్రాండన్ స్కాట్ అన్నారు. నగరంలో అత్యవసర పరిస్థితి విధించి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పవర్ ఫెయిల్యూరే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తేలినా మరింత లోతుగా దర్యాప్తు సాగుతోంది.

భారత సిబ్బంది క్షేమం

ప్రమాదానికి గురైన నౌక పేరు డాలీ. గ్రేస్ ఓషియన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఈ నౌక ప్రస్తుతతం సినర్జీ మెరైన్ గ్రూప్ నిర్వహణలో ఉంది. ప్రఖ్యాత డెన్మార్క్ షిప్పింగ్ కంపెనీ 'మెర్స్క్'కు చెందిన సరుకుతో బాల్టిమోర్ రేవు నుంచి శ్రీలంక రాజధాని కొలంబోకు వెళ్తుండగా దుర్ఘటన జరిగింది. 985 అడుగుల పొడవు, 157 అడుగుల వెడల్పున్న ఈ నౌకలో ఇద్దరు పైలట్లు సహా మొత్తం 22 మంది సిబ్బందీ భారతీయులేనని సినర్జీ మెరైన్ గ్రూప్ వెల్లడించింది. వారంతా క్షేమంగానే ఉన్నారని పేర్కొంది. ప్రమాదం నేపథ్యంలో అమెరికా తూర్పు తీరంలో అత్యంత బిజీ ఓడరేవుల్లో ఒకటైన బాల్టిమోర్‌కు నౌకల రాకపోకలు కనీసం కొద్ది నెలల పాటు స్తంభించనున్నాయి. గతేడాది బాల్టిమోర్ రేవు గుండా ఏకంగా 5.2 కోట్ల టన్నుల మేరకు సరుకు, దాదాపు 5 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలు జరిగాయి! పోర్టుకు నౌకల రాకపోకలను వీలైనంత త్వరగా పునరుద్ధరిస్తామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. దుర్ఘటన ఉగ్రవాద చర్య కాదని స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ అరెస్టును నిశితంగా గమనిస్తున్నాం

అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వ్యాఖ్య

వాషింగ్టన్: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరెస్టుపై అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి స్పందించారు. కేజ్రీవాల్ అరెస్టు అంశాన్ని నిశితంగా గమనిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన పట్ల వచ్చిన ఆరోపణపై నిష్పక్షపాతమైన, పారదర్శకమైన, చట్టపరమైన దర్యాప్తును కోరుకుంటున్నామని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై గతవారం జర్మనీ సరిగ్గా ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పుడు, భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే.

ఆ హామీ ఇస్తే తప్ప అసాంజేను అప్పగించలేం

అమెరికాకు తేల్చిచెప్పిన బ్రిటిష్ కోర్టు



లండన్: అమెరికా రహస్య పత్రాలను ప్రచురించిన కేసులో వికీ లీక్స్ వ్యవస్థాపకుడు, సామాజిక ఉద్యమకారుడు, ఆస్ట్రేలియా పౌరుడు జూలియన్ అసాంజేకు ఊరట లభించింది. అమెరికాకు ఆయన అప్పగింతపై లండన్‌లోని బ్రిటిష్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసాంజేకు మరణశిక్ష విధించబోమంటూ హామీ ఇస్తే తప్ప గూఢచర్యం కేసులో ఆయనను అమెరికాకు అప్పగించడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. దీనిపై మూడు వారాల్లోగా స్పందించాలని అమెరికాకు సూచించింది. లేకపోతే కొత్తగా అప్పీల్ చేసుకొనే అవకాశం అసాంజేకు కల్పిస్తామని వెల్లడించింది. అయితే, బ్రిటిష్ కోర్టు ఉత్తర్వుపై అమెరికా ఇంకా స్పందించలేదు. అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్‌లోని కంప్యూటర్‌ను హ్యాక్ చేసి, రహస్య పత్రాలను తస్కరించినట్లు అసాంజేపై అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే. ఇరాక్, అఫ్గానిస్తాన్‌లో అమెరికా సైన్యం అరాచకాలకు పాల్పడిందంటూ ఆయన బయటపెట్టిన పత్రాలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. గూఢచర్యం చట్టం కింద అమెరికాలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. అభియోగాలు నిరూపితమైతే అసాంజేకు 175 ఏళ్ల వరకు జైలుశిక్ష పడే ఆస్కారముంది. మరణశిక్ష కూడా విధించవచ్చని అమెరికా అధికారులు చెబుతున్నారు. అసాంజే ఐదేళ్లుగా బెల్‌మార్ష్ జైలులో ఉంటున్నారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. ఐదుగురు చైనీయులు మృతి

ఇస్లామాబాద్/కరాచీ: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌లో మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో అయిదుగురు చైనీయులు సహా మొత్తం ఆరుగురు మృతి చెందారు. ఇస్లామాబాద్ నుంచి కొహిస్తాన్ వైపు వెళ్తున్న బస్సును ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో నింపిన ఓ ట్రక్కుతో ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. షాంగ్లా జిల్లా బిషమ్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో పాక్ పౌరుడైన బస్సు డ్రైవర్‌తోపాటు అందులోని అయిదుగురు చైనీయులు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయాలపాలయ్యారు. మృతులందరూ దాసు జల విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న వారే. కాగా, ఈ దాడికి కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా పాక్ వ్యాప్తంగా కొనసాగుతున్న పలు ప్రాజెక్టుల్లో వేలాది మంది చైనా దేశస్తులు పనిచేస్తున్నారు.

ఎయిర్‌బేస్‌పై ఉగ్రదాడిని తిప్పికొట్టిన పాక్ ఆర్మీ

బలోచిస్తాన్ ప్రావిన్స్‌లోని తుర్బాట్‌లో ఉన్న నావల్ ఎయిర్‌బేస్ 'పీఎన్ఎస్ సిద్దిఖి'పై దాడికి ఉగ్రవాదులు విఫలయత్నం చేశారు. సోమవారం రాత్రి ఉగ్రవాదులు ఎయిర్‌బేస్‌లోకి మూడు వైపుల నుంచి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఆర్మీ వారిని దీటుగా ఎదుర్కొంది. ఈ సందర్భంగా జరిగిన కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు హతం కాగా, ఒక జవాను ప్రాణాలు కోల్పోయాడని అధికారులు చెప్పారు. బేస్‌లోని విమానాలకు, ఇతర సున్నిత వ్యవస్థలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఈ దాడికి పాల్పడింది తమ మజీద్ బ్రిగేడ్ అని బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ప్రకటించుకుంది.

ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ రెండో ఉత్తర్వు

మొహల్లా క్లినిక్‌లలో ఉచితంగా ఔషధాలు అందజేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు. ఢిల్లీలో మొహల్లా క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వు జారీ చేశారు. ఔషధాల కొరత లేకుండా చూడాలని, ఉచితంగా డయాగ్నోస్టిక్ టెస్టులు నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మంగళవారం తెలియజేశారు. మొహల్లా క్లినిక్‌లు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని, ఔషధాలు కొరత ఉందంటూ కేజ్రీవాల్‌కు సమాచారం అందిందని తెలిపారు. అందుకే వెంటనే స్పందించి, ఈ అంశంపై అధికారులకు ఆదేశాలిచ్చారని వెల్లడించారు. ఆరోగ్య రంగానికి కేజ్రీవాల్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. అరెస్టై కస్టడీలో ఉన్నప్పటికీ ఢిల్లీ ప్రజలకు వైద్య సేవలు నిరాటంకంగా అందించాలని ఆయన ఆరాటపడుతున్నారని వివరించారు. ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ ఉత్తర్వు జారీ చేయడం ఇది రెండోసారి. ఢిల్లీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచిస్తూ గతవారం మొదటిసారిగా ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే.

మిస్ యూనివర్స్ పోటీలో
తొలిసారి సౌదీ సుందరి



రియాద్: ఇస్లాం సంప్రదాయవాదానికి చిరునామాగా నిలిచే సౌదీ అరేబియా నుంచి ఒక ముద్దుగుమ్మ మిస్ యూనివర్స్ పోటీలకు సిద్ధమైంది. సౌదీ నుంచి ఇలా ఒక అమ్మాయి అంతర్జాతీయ అందాల పోటీలకు ప్రాతినిధ్యం వహించడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. త్వరలో మలేసియాలో జరగబోయే విశ్వసుందరి పోటీల్లో తాను సౌదీ తరఫున పాల్గొనబోతున్నట్లు 27 ఏళ్ల మోడల్ రూబీ అల్కాతానీ సోమవారం ప్రకటించారు. సౌదీలోని రియాద్ నగరం ఈమె స్వస్థలం. ఇప్పటికే పలు అందాల పోటీల్లో పాల్గొన్నారు. కొద్ది వారాల క్రితం మలేసియాలో జరిగిన మిస్ అండ్ మిసెస్ గ్లోబల్ ఏషియన్‌లోనూ పాలుపంచుకున్నారు. 'ప్రపంచ సంస్కృతులపై అవగాహన పెంచుకుంటూనే మా సౌదీ సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని విశ్వ వేదికలపై వివరిస్తా' అని అరబ్ న్యూస్‌తో రూబీ అన్నారు. ఇప్పటికే మిస్ సౌదీ అరేబియా కిరీటాన్ని దక్కించుకున్న ఈమె మిస్ మిడిల్ ఈస్ట్(సౌదీ అరేబియా), మిస్ అరబ్ వరల్డ్ పీస్–2021, మిస్ ఉమెన్(సౌదీ అరేబియా) టైటిళ్లను గెలుపొందారు. ఈమెకు ఇన్‌స్టా గ్రామ్‌లో లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈమె మోడల్‌గానే కాదు కంటెంట్ క్రియేటర్ గానూ రాణిస్తున్నారు. కఠిన ఆంక్షలతో ఛాందస సంప్రదాయవాదిగా పేరుమోసిన 38 ఏళ్ల సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్ ఇటీవలి కాలంలో సౌదీని సంస్కరణల బాటలో పయనింపజేస్తున్నారు. మహిళల డ్రైవింగ్‌కు, పురుషుల పార్టీలకు వెళ్లేందుకు, పురుష సంరక్షులు లేకున్నా పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించారు. పూర్తి మద్యనిషేధం అమల్లో ఉండే సౌదీలో తొలిసారిగా దౌత్యకార్యాలయాలుండే ప్రాంతంలో మద్యం అమ్మకాలకు అనుమతి మంజూరు చేశారు.




ఎవరెస్ట్ అంతటి సంకల్పం!

ఈ పాప పేరు సిద్ధి మిశ్రా. వయసు కేవలం రెండున్నరేళ్లు. సముద్రమట్టం నుంచి 17,598 అడుగుల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్ వద్దకు విజయవంతంగా చేరుకుంది. తల్లితండ్రులతో కలిసి మార్చి 12న ట్రెక్కింగ్ మొదలెట్టి పది రోజుల్లోనే బేస్ క్యాంప్‌కు చేరింది. ఈ ఘనత సాధించిన అత్యంత పిన్నవయస్కుల్లో ఒకరిగా సిద్ధి రికార్డు సృష్టించింది. అనంతరం తల్లితో కలిసి ఇలా సగర్వంగా ఫొటోకు పోజిచ్చింది.

మమతపై ఘోష్ అసభ్య వ్యాఖ్యలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కుటుంబ నేపథ్యాన్ని ప్రశ్నిస్తూ బీజేపీ సీనియర్ నాయకుడు, మేదినీపూర్ ఎంపీ దిలీప్ ఘోష్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సంబంధిత వివాదాస్పద వ్యాఖ్యల వీడియోను అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. 'బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గోవాకు వెళ్తారు. అక్కడ 'నేను గోవా రాష్ట్ర బిడ్డను' అంటారు. మళ్లీ త్రిపురకు వెళ్తారు. అక్కడా 'నేను త్రిపుర బిడ్డను' అంటారు. అసలు తన తండ్రి ఎవరు అనేది ఆమె స్పష్టం చేయాలి'' అని దిలీప్ అన్నట్లుగా వీడియోలో ఉంది. ఈ వీడియో చూస్తే.. 2021లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీఎంసీ ఇచ్చిన 'బెంగాల్ తన సొంత కుమార్తెను కోరుకుంటోంది' అన్న నినాదాన్ని దిలీప్ వెక్కిరించినట్లుగా ఉంది. దీంతో దిలీప్‌పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ టీఎంసీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేశారు. 'దిలీప్ రాజకీయ నాయకుల పరువు తీస్తున్నారు. గతంలో దుర్గామాత పుట్టుపూర్వోత్తరాలపై వ్యాఖ్యలు చేసిన ఈయన తాజాగా మమతా బెనర్జీ కుటుంబ నేపథ్యంపై అసభ్యంగా మాట్లాడారు. బెంగాల్ మహిళ అంటే కనీస మర్యాద కూడా ఈయనకు లేదు. కమలదళం డీఎన్ఏలోనే ఇది ఉంది'' అంటూ టీఎంసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'బెంగాల్‌లో బీజేపీ నాయకత్వం ఎంత స్త్రీ ద్వేషంతో రగిలిపోతోందో ఇట్టే అర్థమవుతోంది. భారత్‌లో ప్రస్తుత ఏకైక మహిళా ముఖ్యమంత్రిని కించపరిచారు. ఇలాంటి వారికి బెంగాల్ ప్రజలు ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతారు' అని టీఎంసీ నేత కీర్తి ఆజాద్ అన్నారు. ఈసారి బర్ధమాన్ దుర్గాపూర్ ఎంపీ స్థానంలో దిలీప్‌కు పోటీగా ఈయనే టీఎంసీ తరఫున బరిలో నిలిచారు. దిలీప్ ఘోష్ గతంలో బెంగాల్ బీజేపీ చీఫ్‌గా ఉన్నారు.

రామకృష్ణ మిషన్ ప్రెసిడెంట్ కన్నుమూత



కోల్‌కతా: రామకృష్ణ మిషన్ ప్రెసిడెంట్ స్వామి స్మరణానంద(95) మంగళవారం రాత్రి కన్నుమూశారు. వయో సంబంధ రుగ్మతలతో ఆయన మంగళవారం రాత్రి 8.14 గంటలకు పరమపదించారని రామకృష్ణ మిషన్ తెలిపింది. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మిషన్ 16వ అధ్యక్షుడిగా 2017 నుంచి ఆయన కొనసాగుతున్నారు. మూత్ర సంబంధ సమస్య తలెత్తడంతో స్మరణానందను జనవరి 29వ తేదీన రామకృష్ణ మిషన్ సేవా ప్రతిష్ఠాన్ ఆస్పత్రిలో చేర్పారు. అనంతరం శ్వాసకోశ సమస్య ఏర్పడటంతో మార్చి 3వ తేదీ నుంచి వెంటిలేటర్‌పైనే ఉన్నారు.

ఎలక్షన్ బీట్

వడగాడ్పులతో జాగ్రత్త

- పోలింగ్ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయండి
- ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రాలకు ఈసీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి– జూన్ మధ్య వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండనుందంటూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) జారీ చేసిన హెచ్చరిక నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) అప్రమత్తమయింది. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఈసీ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు మంగళవారం లేఖలు రాసింది. పోలింగ్ స్టేషన్లలో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు, ఇతర వసతులకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సీఈసీ కోరింది. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, సరైన నీడ, మెడికల్ కిట్ వంటివి తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలంది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు వీలుగా భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక ప్రవేశాలు, నిష్క్రమణలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. పోలింగ్ స్టేషన్లలో తాగునీటి కోసం కుళాయిని ఏర్పాటు చేయాలని, 'పర్యావరణ అనుకూల'డిస్పోజబుల్ గ్లాసులను అందుబాటులో ఉంచాలని కోరింది. పోలింగ్ సిబ్బందితోపాటు ఓటర్లకు అవసరమైన పక్షంలో వాడుకునేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం ఉంచాలని తెలిపింది. పోలింగ్ ఏజెంట్లు, సీనియర్ సిటిజన్లు, గర్భిణీలకు సరైన ఫర్నిచర్ ఉండేలా చూసుకోవాలని పేర్కొంది. పోలింగ్ స్టేషన్లలో స్త్రీ, పురుష ఓటర్లకు తగిన సంఖ్యలో ప్రత్యేక టాయిలెట్‌లు ఉండాలని ఈసీ ఆదేశించింది. రోజంతా టాయిలెట్లలో పరిశుభ్రత కోసం ఒక ఉద్యోగిని నియమించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మీరొక శక్తి స్వరూపిణి

సందేశ్‌ఖాలీ బాధితురాలు, బీజేపీ అభ్యర్థి రేఖా పాత్రాను ప్రశంసించిన మోదీ



న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత షాజహాన్ షేక్ అరాచకాలకు గురైన సందేశ్‌ఖాలీ గ్రామస్తురాలు, షాజహాన్ అకృత్యాలపై పోరాడి నిలిచిన బాధితురాలు రేఖా పాత్రాను ప్రధాని మోదీ పొగిడారు. సందేశ్‌ఖాలీలో షాజహాన్ ఆగడాలకు ఎదురునిలిచి పోలీసులకు ఫిర్యాదుచేయడంతోపాటు షాజహాన్ వ్యతిరేక ఉద్యమంలో రేఖ కీలక పాత్ర పోషించారు. పేదింటి మహిళ తెగువ చూసి ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బసిర్‌హట్ నియోజకవర్గ టికెట్‌ను బీజేపీ ఈమెకే ఇచ్చింది. ఈ సందర్భంగా రేఖతో ప్రధాని మోదీ మాట్లాడి, ఆమెను ప్రశంసించారని బీజేపీ నేతలు మంగళవారం వెల్లడించారు.



రాముడే అండగా ఉన్నట్లుంది: 'నాకు మద్దతుగా మోదీ నిల్చున్నందుకు చాలా ఆనందంగా ఉంది. స్వయంగా రాముడే మాకు తోడుగా నిలబడినట్లు ఉంది. ధైర్యం పెరిగింది. ఇక్కడ దారుణ పరిస్థితుల కారణంగా మేం 2011 నుంచి ఓటు హక్కు కూడా వినియోగించుకోలేకపోయాం. పోటీకి దిగుతున్నానని తెల్సి మొదట్లో టీఎంసీ మద్దతుదారులను నన్ను తప్పుబట్టారు. కానీ ఇప్పుడు అందరూ మద్దతుగా నిలబడ్డారు. మాది నిరుపేద కుటుంబం. పని కోసం నా భర్త కేరళ, తమిళనాడుకు వెళ్తారు. ఎన్నికల్లో గెలిస్తే పని కోసం పేదలు వేరే రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉపాధి పొందేలా ఏదైనా చేయాలని ఉంది' అని రేఖ అన్నారు. దీంతో 'నిజంగా మీరు శక్తి స్వరూపిణి' అని మోదీ ఆమెను పొగిడారు. 'టీఎంసీ సర్కార్ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు తెలియజెప్పండి. ప్రజలకు అనుగుణంగా పనిచేయండి. ప్రజల్ని మమతా బెనర్జీ సర్కార్ ఏ విధంగా ఇబ్బంది పెడుతుందో ప్రచారం చేయండి. బెంగాల్‌లో కేంద్రప్రభుత్వ పథకాలు అమలుకాకుండా అడ్డుకుంటున్న వైనాన్ని వివరించండి. పథకాల పేర్లను మార్చేసి అవినీతిలో కూరుకుపోయిన విధానాన్ని విడమర్చి చెప్పండి. ఈసారి ఈ ప్రాంతంలో స్వేచ్ఛా, పారదర్శక వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూస్తాం' అని రేఖకు మోదీ భరోసా ఇచ్చారు. ''ఇంతగా ప్రోత్సహిస్తున్న ప్రధానికి, నామినేట్ చేసిన బీజేపీకి కృతజ్ఞతలు. సందేశ్‌ఖాలీలో మా కష్టాలు ఈ ప్రాంత మహిళలందరికీ తెలుసు. మహిళలు, స్థానికుల మద్దతు నాకు ఉంది' అని కోల్‌కతాలో రేఖ చెప్పారు.

పంజాబ్‌లో పొత్తుల్లేవ్: బీజేపీ

చండీగఢ్: పంజాబ్‌లో సార్వత్రిక ఎన్నికల సమరంలో ఒంటరిగానే పోటీచేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. దీంతో గత వారంరోజులుగా శిరోమణి అకాలీదళ్‌తో జరుపుతున్న పొత్తు చర్చలు విఫలమైనట్లు స్పష్టమవుతోంది. మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన వివాదాస్పద మూడు సాగు చట్టాలపై విభేదించిన శిరోమణి అకాలీదళ్ పార్టీ 2020 సెప్టెంబర్‌లో ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలగింది. తాజాగా పంజాబ్‌లో 13 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల నేపథ్యంలో మళ్లీ పొత్తుకు బీజేపీ, అకాలీదళ్ ప్రయత్నించినా చర్చలు సఫలం కాలేదు. 13 స్థానాలకుగాను కనీసం ఆరు స్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధపడగా అందుకు అకాలీదళ్ ససేమిరా అంది. దాంతో తమది ఒంటరి పోరేనంటూ పంజాబ్ బీజేపీ చీఫ్ సునీల్ జాఖడ్ ప్రకటించారు.

కాంగ్రెస్ రెబల్స్‌కు బీజేపీ టికెట్లు

సిమ్లా: అనర్హత వేటుపడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయనున్నారు. బీజేపీ మంగళవారం ఈ మేరకు ప్రకటించింది. దాంతో ఆ పార్టీలో అసమ్మతి భగ్గుమంది. బీజేపీకి చెందిన మాజీ మంత్రి రామ్ లాల్ మర్కండ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే చేతిలో ఓడిన బీజేపీ మాజీ మంత్రి వీరేంద్ర కన్వర్ కూడా అసంతృప్తితో ఉన్నారు.

బీజేపీలో చేరిన రవ్‌నీత్ బిట్టూ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ టికెట్‌పై మూడు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన రవ్‌నీత్ సింగ్ బిట్టూ బీజేపీలో చేరారు. పంజాబ్ మాజీ సీఎం బియాంత్ సింగ్ మనవడే బిట్టూ. పంజాబ్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో హీరోగా పేరు తెచ్చుకున్న బియాంత్ సింగ్ పదవిలో ఉండగానే హత్యకు గురైన విషయం తెలిసిందే. బిట్టూ లూధియానా లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంగళవారం ఢిల్లీలో ఆయన బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు.


పన్నీర్‌సెల్వం వర్సెస్ పన్నీర్‌సెల్వం

చెన్నై: తమిళనాడు మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం రామనాథపురం లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అచ్చంగా అదే పేరున్న మరో వ్యక్తి కూడా అక్కడ స్వతంత్రునిగా పోటీ చేస్తున్నారు! మాజీ సీఎం పన్నీర్ సెల్వం (72) పూర్తి పేరు ఒట్టకార తేవర్ పన్నీర్‌సెల్వం కాగా, స్వతంత్ర అభ్యర్థి పూర్తిపేరు ఒచప్పన్ పన్నీర్‌సెల్వం (42). ఆయన సొంతూరు మదురై జిల్లా ఉసిలంపట్టి. అభ్యర్థుల జాబితాలో ఇద్దరి పేర్లు ఒ.పన్నీర్‌సెల్వంగానే అధికారులు పొందుపరిచారు. దాంతో ఓటర్లు వీరిని ఫొటోలు, కేటాయించిన గుర్తుల ఆధారంగా గుర్తుపట్టాల్సిందే. అన్నాడీఎంకే నుంచి తనను బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ కోర్టుకెక్కిన పన్నీర్‌సెల్వం ఈసారి బీజేపీ మద్దతుతో లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నారు.

ఉద్యోగాలపై బీజేపీ తప్పుదోవ: రాహుల్


న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరుద్యోగ సమస్యను, బీజేపీ సర్కార్ గత ఎన్నికల హామీని ప్రధానంగా ప్రస్తావిస్తూ మోదీపై విమర్శలు ఎక్కుపెట్టారు. ''మోదీ జీ! నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మీ దగ్గర ప్రణాళిక ఉందా? ఇది ప్రతి నిరుద్యోగ యువత ప్రశ్న. వారికి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎందుకు అబద్ధం చెప్పారని బీజేపీ వాళ్లను ఊరూరా అందరూ ప్రశ్నిస్తున్నారు'' అంటూ 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ చేశారు.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం । 27 । మార్చి । 2024



భారీ అగ్ని ప్రమాదం

కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులో ఉన్న న్యూ ఆటోనగర్‌లోఓ ఆయిల్ కంపెనీలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. -8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం 513.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మంగళవారం విజయవాడ, సికింద్రాబాద్‌లకు చెందిన భక్తులు విరాళాలు సమర్పించారు. -8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహారి (గురు)
విజయవాడ	6.25	4.49
జగ్గయ్యపేట	6.27	4.53
మచిలీపట్నం	6.23	4.46
గుడివాడ	6.25	4.49

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో కేఎస్ రామరావు మంగళవారం పరిశీలించారు. కనకదుర్గనగర్, గోశాల వద్ద అన్నదానం పోటు, ప్రసాదాల పోటుతో పాటు మహా మండపం వద్ద జరుగుతున్న పనులను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఈఈ ఎల్.రమాదేవిని ఆదేశించారు. కొండపై పాత అన్నదాన భవనం స్థానంలో నిర్మిస్తున్న యాగశాలకు అవసరమైన మెటీరియల్ షిఫ్టింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. దసరా నాటికి ఒక రూపానికి తీసుకురావాలని సూచించారు. మహా మండపం వద్ద భక్తులను కలిసిన ఈవో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ అధికారులు, ఏఈవో ఎస్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో రైల్వే ఉద్యోగుల సత్తా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్స్ చాంపియన్‌షిప్ డబుల్స్ విభాగంలో విజయవాడ డివిజన్‌లో సీనియర్ టెక్నీషియన్ ఏ.శ్రీనివాసరావు, టెక్నీషియన్ కె. సంపత్‌కుమార్ విజేతలుగా నిలిచారు. ఈ నెల 20 నుంచి 24 వరకు భీమవరంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో 45–54 వయస్సు విభాగంలో వారు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో తమిళనాడుకు చెందిన మణికందన్, తెలంగాణకుచెందిన కేవీఎస్ మూర్తిలపై విజయం సాధించి టైటిల్ కైవసం చేసుకున్నారు. మంగళవారం డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏడీఆర్‌ఎంలు పీఈ ఎడ్విన్, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీఎస్‌సీ, స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర్ విజేతలకు అభినందనలు తెలిపారు.

జలతరంగం

'జలకళ'తో మెట్టకు జీవం

- వర్షాధారిత ప్రాంతాల రైతులకు వరంగా వైఎస్సార్ జలకళ
- పథకంలో ఉచితంగానే బోరు, మోటార్
- ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకూ రైతులకు 2,548 బోర్లు, 110 మోటార్లు



వైఎస్సార్ జలకళ పథకంలో బోరు వేస్తున్న సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రాణికైనా, పంటకైనా నీరే ఆధారం. నీరు లేకపోతే ఎంత సారవంతమైన భూమిలో అయినా పంటలు పండించలేం. నీరు సమృద్ధిగా ఉంటే నిస్సారమైన భూముల్లోనూ సిరులు పండించవచ్చు. ఎన్టీఆర్(పశ్చిమ కృష్ణా) జిల్లా పూర్తిగా మెట్ట ప్రాంతం. రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. నాగార్జున సాగర్ కాలువలు ఉన్నప్పటికీ థర్డ్ జోన్ చివరి భూములు కావడంతో సాగునీరు అరకొరగా అందుతుంది. రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాంత రైతులు సాగర్ జలాలు చూసిన పాపాన పోలేదు. వాతావరణ అనుకూల పరిస్థితులు ఏర్పడితే పంటలు పండటం కష్టమే. ఈ ప్రాంత రైతులు సాగునీటి కోసం భగీరథ ప్రయత్నమే చేయాలి. ప్రత్యామ్నాయంగా సుబాబుల్ సాగు చేయాల్సిన పరిస్థితి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ జలకళ పథకం అమల్లోకి వచ్చింది. ఈ పథకంతో పశ్చిమ కృష్ణాలో మెట్ట భూములకు జలకళ సంతరించుకుంది.

పాతాళ గంగ పొంగుతోంది..

రైతులకు సాగునీటి వసతులు కల్పించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వైఎస్సార్ జలకళ పథకంతో జలధారలు పొంగుతున్నాయి. రెండున్నర ఎకరాల సొంత భూమి ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. లేదా ఒకే ప్రాంతంలో ఇద్దరు, ముగ్గురు రైతులకు చెందిన భూములు 2.50 పైబడి ఉంటే జాయింట్‌గా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకంలో ప్రభుత్వమే ఉచితంగా బోరు వేస్తుంది. మోటారు ఉచితంగా అందజేస్తోంది. విద్యుత్ సౌకర్యం అవసరమైన వారికి వ్యవసాయ కనెక్షన్ అందజేస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ ఎన్టీఆర్ జిల్లాలోని 16 మండలాల్లో 2,548 బోర్లు వేశారు. బోర్లు వేయడంతో పాటు రైతులకు మోటార్లు ప్రభుతం ఉచితంగా అందిస్తోంది. జిల్లాలో 110 వరకు మోటార్లు మంజూరయ్యాయి.

తడిసిన నేలతో తబ్బిబ్బవుతున్న రైతులు

నీటి జాడలు లేక నెర్రెలిచ్చిన నేలలు.. వైఎస్సార్ జలకళతో తడిసి ముద్దవుతున్నాయి. ఇన్నాళ్లు సాగునీరు లేక వర్షం కోసం ఆకాశం వైపు చూసిన రైతులు తమ పొలాలకు జలకళ సంతరించుకోవడంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. పెట్టుబడులకే అప్పులు చేసే రైతుల పొలాల్లో ఉచితంగా బోరువేసి మోటారు అమర్చడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లిన రైతులు తమ భూముల్లో కమర్షియల్ పంటలు సాగు చేస్తున్నారు.

నయా పైసా ఖర్చు లేకుండా..

ఈ పథకానికి ఎంపికైన రైతు భూమిలో ముందుగా సాంకేతిక నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారు. భూ గర్భ జలం అధికంగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి 300 అడుగుల వరకు బోరు డ్రిల్ వేస్తారు. దీనికి అవసరమైన మేరకు కేసింగ్ ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం రూ.70 వేల నుంచి రూ. లక్ష వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దీనికి తోడు 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్‌ను రైతుకు ఉచితంగా అందజేస్తోంది. దీని ఖరీదు బహిరంగ మార్కెట్‌లో రూ. లక్ష వరకు ఉంటుంది. 200 అడుగుల పీవీసీ పైపు, 200 అడుగుల సర్వీస్ వైర్ కూడా ప్రభుత్వమే సమకూర్చుతోంది. విద్యుత్ షాక్‌కు గురికాకుండా, విద్యుత్ హెచ్చుతగ్గులు నియంత్రించేందుకు ఎంసీబీ, కండక్టర్‌తో కూడిన స్టార్టర్ బాక్స్ అందజేస్తోంది. మోటార్ ఇన్‌స్టాలేషన్ కూడా ఉచితమే. బోరు వేసే దగ్గర నుంచి మోటారు అమర్చేంత వరకు ప్రభుత్వమే ఖర్చులన్నీ భరిస్తోంది.



పొలంలో మోటార్ ద్వారా వస్తున్న నీరు

పావలా ఖర్చు లేదు..



నాకు పన్నెండకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగునీటి సౌకర్యం లేదు. పూర్తిగా వర్షాధారం. కాల్వలు ఉన్నా ప్రయోజనం లేదు. వైఎస్సార్ జలకళ పథకం గురించి తెలిసి దరఖాస్తు చేశా. ఎవరి వద్దకు వెళ్లలేదు. పావలా బిళ్ల ఖర్చు చేయలేదు. పథకం కింద నా పొలంలో 300 అడుగుల బోరు వేశారు. ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించారు. 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల మోటారు మంజూరైంది. ప్రభుత్వమే మోటార్ కూడా బిగించింది. సుబాబుల్ పంట తొలగించి మిర్చి సాగు చేశా. మంచి దిగుబడి వచ్చింది. ఈ పథకం ద్వారా నాకు రూ. 7లక్షల నుంచి 10లక్షల వరకు లబ్ధి చేకూరింది.

– ఎస్. తిరుమలరావు, రైతు, జమ్మవరం

అన్నీ ప్రభుత్వమే..



మూడు ఎకరాల పొలం ఉంది. పత్తి సాగు చేస్తాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జలకళ పథకం వర్తించింది. ఈ పథకంలో బోరు డ్రిల్ చేయడం, మోటార్ మంజూరు అయ్యాయి. మోటారు అమర్చేందుకు అవసరమైన అన్ని వస్తువులు ప్రభుత్వం సమకూర్చింది. పొలంలో ప్రభుత్వం వారే మోటార్ అమర్చి అప్పగించి వెళ్లారు.

– కొణకంచి శ్రీనివాసరావు, రైతు, అనిగండ్ల పాడు

రమణీయం.. రథోత్సవం



ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను తీసుకువస్తున్న అర్చకులు

పూలతో అలంకరించిన రథంపై ఊరేగిన తిరుపతమ్మ

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లలో భాగంగా మంగళవారం రాత్రి గోపయ్య సమేత తిరుపతమ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను అందంగా పచ్చి పూలతో అలంకరించిన రథంపై ఉంచారు. రథం ముందు రజకులు, శాలివాహనులు కుంభం పోసిన అనంతరం డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, అధికారులు కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. రథానికి గ్రామంలోని రైతులు తమ ఎడ్ల జతలను కట్టి అమ్మవారిని ఊరేగించారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథం గుడి చుట్టూ తిరిగి అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, ఎస్‌ఐ పి. రాంబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు దివ్య ప్రభోత్సవం..

తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లలో భాగంగా బుధవారం రాత్రి 8.34 గంటలకు 90 అడుగుల దివ్య ప్రభోత్సవం జరుగుతుందని ఈవో తెలిపారు.

ముగిసిన నాట్యోత్సవాలు



ప్రదర్శన చేస్తున్న ముళ్లపూడి విజయలక్ష్మి శిష్య బృందం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని వారం రోజులుగా నాట్యక్షేత్రం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదిక పై జరుగుతున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు నాట్య ప్రదర్శనలను కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, దేవాలయ పాలక మండలి అధ్యక్షులు కావూరి భానుమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొత్తగూడెంకు చెందిన శ్రీ దుర్గా సాయి నృత్యనికేతన్ నాట్యాచారిణి సీతాలక్ష్మి ప్రసాద్ బృందం శ్రీనివాస కల్యాణం నృత్య నాటిక ప్రదర్శన కమనీయంగా సాగింది. వరంగల్‌కు చెందిన మయూరి నాట్యకళాక్షేత్రం నాట్యాచార్యులు కుండే అరుణ్ రాజ్ శిష్య బృందం, కాకినాడకు చెందిన సీతారత్న లలిత కళా నృత్య నికేతన్, విజయవాడకు చెందిన నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయం త్రినాథాచారి శిష్య బృందం ప్రదర్శనలు ఇచ్చారు.

సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె రాణా, ఇతర అధికారులు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- అంతర్రాష్ట్ర సరిహద్దు అధికారుల సమన్వయ సమావేశం

జగ్గయ్యపేట: ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. అంతర్రాష్ట సరిహద్దు వెంబడి ప్రత్యేక చెక్‌పోస్టులతో నిఘాను కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు. మండలంలోని చిల్లకల్లు టోల్‌వేస్ సమీపంలోని రామ్‌కో కర్మాగారంలోని సమావేశ మందిరంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని ఎన్టీఆర్, సూర్యాపేట జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా రెండు జిల్లాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తీసుకోవాల్సిన చర్యలను చర్చించామని తెలిపారు. ముఖ్యంగా నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువుల వంటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘాను పటిష్టం చేశామని చెప్పారు. రెండు జిల్లాల అధికారుల మధ్య సమన్వయంతో మంచి ఫలితాలుంటాయన్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో ముక్త్యాల, గరికపాడు, వత్సవాయి చెక్‌పోస్టులు చాలా కీలకమని, అత్యంత కీలకమైన గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టును మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.

పటిష్టంగా కోడ్ అమలు..

విజయవాడ సీపీ టి.కె. రాణా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలైన నాటి నుంచి రూ. 1.5 కోట్ల నగదుతో పాటు రూ. 3.60 కోట్ల విలువ చేసే వస్తువులను సీజ్ చేశామని తెలిపారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో అధికారులు సమన్వయంతో పని చేయటంతో పాటు ఎన్నికలు, పోలీస్ కంట్రోల్ రూంలను అనుసంధానం చేస్తామని చెప్పారు. అనంతరం గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టును, తెలంగాణలోని రామాపురం చెక్‌పోస్టును ఇరు రాష్ట్రాల అధికారులు పరిశీలించి సూచనలు చేశారు. ముందుగా తెలంగాణ ఉన్నతాధికారులను ఏపీ అధికారులు సత్కరించారు. జేసీ డాక్టర్ పి. సంపత్ కుమార్, సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే, నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్వో వెంకటేశ్వర్లు, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, ఏపీ ఏడీపీసీ నోడల్ అధికారి కృష్ణమూర్తి నాయుడు, ఎల్‌డీఎం ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షకు 1,449 మంది గైర్హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షకు సంబంధించి మంగళవారం 1,449 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 178 పరీక్ష కేంద్రాల్లో 31,137 మంది పరీక్ష రాయాల్సి ఉంది. అయితే అందులో 29,688 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థుల హాజరు శాతం 95.35గా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలో ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పరీక్షల పర్యవేక్షణాధికారి శ్రీనివాసులరెడ్డి నగరంలోని జిల్లా పరిషత్ పాఠశాలను, ప్రసాదంపాడులోని వివేకానంద ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సీవీఆర్‌జీ మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్లు సుమారు 35 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.

తప్పుడు ప్రచారాలు, ట్రోలింగ్‌లకు పాల్పడితే చర్యలు

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్‌లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి హెచ్చరించారు . సామాజిక మాధ్యమాలు వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా ఇతరులకు ఎలాంటి సమాచారం షేర్ చేస్తున్నాం అనేది కచ్చితంగా గమనించాలన్నారు. వాట్సాప్ గ్రూపులు నిర్వహిస్తున్న అడ్మిన్లు వారి గ్రూపుల్లో ఎవరైనా తప్పుడు సమాచారంతో పాటు బెదిరింపులకు పాల్పడే విధంగా పోస్టులు చేస్తే అందుకు అడ్మినే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి గ్రూప్‌లలో ప్రతి పోస్టుకి అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో గ్రూపుల్లో యాడ్ చేసే ప్రతి సభ్యుడు అడ్మిన్‌కి కచ్చితంగా తెలిసి ఉండాలన్నారు. వివాదాస్పద పోస్టింగ్‌కు సంబంధించి అడ్మిన్ గ్రూప్ సభ్యునిపై ఎటువంటి చర్యలు తీసుకోని పక్షంలో అడ్మిన్‌పై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రసార మాధ్యమాల ద్వారా ఇతరులకు ఇబ్బంది కలిగించే పోస్టింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ షేరింగ్ చేయకూడదన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసభ్యకర, అభ్యంతరకర పోస్టింగులకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే కృష్ణా జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 17672 కు సమాచారం అందజేయాలని కోరారు. అందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం అడిషనల్ ఎస్పీతో కలిసి ఆవిష్కరించారు.

దుర్గమ్మ తలనీలాల టెండర్ ఖరారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే టెండర్‌ను తణుకుకు చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ దక్కించుకుంది. రూ. 5.61 కోట్లకు ఇండియన్ హెయిర్ ఇండ్రస్టీస్ ఈ టెండర్‌ను కైవసం చేసుకుంది. గత ఏడాది రూ. 7.88 కోట్లకు టెండర్ పలుకగా ఈ టెండర్ జనవరి నెలాఖరు నాటితో పూర్తయింది. దేవస్థానం టెండర్ నిమిత్తం ఆరు పర్యాయాలు బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహించింది. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో తలనీలాలను దేవస్థానమే భద్రపరిచింది. ఆరో సారి టెండర్‌ను ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ రూ. 5.61 కోట్లకు వేలంలో దక్కించుకుంది. రెండో ఏడాది పది శాతం పెంపుతో కాంట్రాక్ట్‌ను పొడిగిస్తారు. అంతర్జాతీయ మార్కెట్‌లో తలనీలాలకు డిమాండ్ తగ్గడం వల్లే వేలం ప్రక్రియలో ముందుకు రావడం లేదని కాంట్రాక్టర్లు పేర్కొనడంతో దేవస్థానం ఇదే విషయాన్ని దేవదాయ శాఖ కమిషనర్‌కు తెలియజేసింది. ఎట్టకేలకు ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్‌కు టెండర్‌ను అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి రావడంతో సోమవారం నుంచి టెండర్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించారు.

12,13 తేదీల్లో జాతీయ ఫార్మసీ క్రీడోత్సవాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఏప్రిల్ 12, 13 తేదీల్లో జాతీయ స్థాయి విద్యార్థుల క్రీడోత్సవాలు 'అలియంజా 2కే24' పేరుతో నిర్వహించనున్నారు. ఆ క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావుతో కలిసి ప్రిన్సిపాల్ ఎ. సునీత ఆవిష్కరించారు. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్, క్యారమ్స్, క్రికెట్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, త్రోబాల్‌లు బాలుర, బాలికల విభాగాల్లో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల పీడీ ఎల్. వినయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి మంగళవారం విజయవాడ, సికింద్రాబాద్‌లకు చెందిన ఇద్దరు భక్తులు తలో లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. విజయవాడ సమీపంలోని గొల్లపూడికి చెందిన బూర్లే వెంకట్రావు ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. సికింద్రాబాద్ బ్రాహ్మణ బస్తీకి చెందిన ఎం.సూర్యనారాయణ దంపతులు మంగళవారంఅమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ పర్యవేక్షకుడు బాబూరావు, అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



ఉంగుటూరు: చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై చిన్నఅవుటపల్లి వద్ద స్కూటీని లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం నులకపేట గ్రామానికి చెందిన తల్లీ కూతుళ్లు బెజవాడ తులసి, అలేఖ్య బాపులపాడు మండలం వీరవల్లిలోని బంధువుల ఇంటికి సోమవారం ఉదయం వెళ్లారు. అదే రోజు రాత్రి స్కూటీపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లి శ్రీనివాస హేచరీస్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ వారిని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తల్లికి స్వల్ప గాయాలు కాగా కూతురు అలేఖ్య(18) ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతి వేగం ఆ ఇంటి దీపాల్ని ఆర్పింది

- ఆటో బోల్తాపడి ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం
- మరో 13మంది కూలీలకు తీవ్ర గాయాలు

ఉంగుటూరు: కుటుంబపోషణలో భాగంగా భర్తకు చేదోడుగా ఉండేందుకు కూలీ నాలీ చేసుకునేందుకు వెళుతున్న ఇరువురు మహిళా కూలీలు మార్గమధ్యంలోనే తిరిగి రాని లోకాలకు చేరుకోవడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గొల్లగూడెం నుంచి వ్యవసాయ కూలీలు పనులకు గన్నవరం మండలం తెంపల్లికి వెళుతుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 22 మంది కూలీలు ఆటోలో తెంపల్లి బయలుదేరారు. వీరపనేని గూడెం వైన్ షాప్ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వీర్ల కృష్ణకుమారి(43) అక్కడికక్కడే మృతి చెందగా వీర్ల సుజాత(33) ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. గాయపడిన 13మందిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బడుగు శివ, జువ్వనబోయిన లక్ష్మి, జువ్వనబోయిన నిర్మల, గుంట్రు ధనలక్ష్మి, జువ్వనబోయిన ప్రభావతి, చెన్ను వీరమ్మ, ఢిల్లీ నవ్య, వీర్ల సుజాత, జువ్వనబోయిన వాణిశ్రీలను చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సాకిరి నాగమణి, గుంద్రు పద్మావతిలను మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరొకరు గన్నవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో



మృతి చెందిన వ్యవసాయ కూలీలు

అతి వేగమే ప్రమాదకారణమా...

మంగళవారం వీరపనేని గూడెంలో ఆటో బోల్తా ఘటనకు అతి వేగమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఆటోలో కూలీలు పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ పరామర్శ

గన్నవరం: మండలంలోని వీరపనేనిగూడెం వద్ద మంగళవారం ఆటో బోల్తా కొట్టిన సంఘటనలో మృతి చెందిన కుటుంబాలను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఆగిరిపల్లి మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన వీర్ల కృష్ణకుమారి, వీర్ల సుజాత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో వారి రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం మార్మోగింది. ఈ దుర్ఘటన గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. ఘటన వివరాలను బంధువులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తప్పనిసరిగా ఆదుకుంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ సారథి కూడా పరామర్శించారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

టీడీపీ ప్రచారంలో కేశఖండన శాల సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశఖండనశాలలో విధులు నిర్వహించే టికెట్ రెమ్యూనరేషన్ సిబ్బంది (బార్బర్లు) టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. అయితే దుర్గగుడి కేశఖండనశాలలో పని చేసే జిడుగు అశోక్‌కుమార్ మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా ఆ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా పాల్గొంటూ ఆ పార్టీ నేతలను కలిసి పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు. అశోక్‌కుమార్‌తో పాటు ఇంటూరి శ్రీనివాసరావు, జి.లెనిన్‌బాబు కూడా టీడీపీ నాయకుడు బుద్దా వెంకన్నను కలిసి ఫొటోలు దిగి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా..

రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులు ఆర్థికంగా నిలదొక్కునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గత ఏడాది కమీషన్‌ను రూ.40కు పెంచుతూ జీఓ ఇచ్చింది. దుర్గగుడిలో విధులు నిర్వహించే కొంత మంది సిబ్బంది ఆ జీఓను సైతం ధిక్కరించడమే కాకుండా తమకు గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.25 కమీషన్ ఇవ్వాలని లేఖ రాశారు. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్ దుర్గగుడి అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. తాజాగా వారు తమకు కూడా రూ.40 కమీషన్ ఇవ్వాలని కమిషనర్‌కు లేఖ రాశారు. ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని పొందుతున్న కేశఖండనశాల సిబ్బంది ప్రభుత్వానికే వ్యతిరేకంగా పనిచేయడంపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. ఇటీవల దుర్గగుడికి చెందిన కేశఖండనశాల సిబ్బంది ద్వారకా తిరుమలలో కరపత్రాలను పంపిణీ చేశారనే కారణంతో ముగ్గురిపై చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కొందరు ఉద్యోగులు టీడీపీ తరఫున ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేస్తున్నారు.



ఇటీవల చంద్రబాబుని కలిసి అశోక్‌కుమార్, ఇతర సిబ్బంది

టీ–10 క్రికెట్‌లో కృష్ణా క్రీడాకారుల రాణింపు

కంకిపాడు: జాతీయ స్థాయి టీ–10 క్రికెట్ ఓవరాల్ చాంపియన్‌షిప్ జూనియర్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకూ జరిగిన జాతీయ స్థాయి టీ–10 క్రికెట్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ జట్టులో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వి.జయసూర్య, పి.మోహిత్ సతీష్, పి.ప్రణీత్, కె.వర్షంనాయుడు, జె. కౌశిక్ చంద్ర పాల్గొని విశేష ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా వారిని, కోచ్ వి.గణేష్‌ను క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేష్ అభినందించినట్టు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా క్రీడాధికారులు

కానూరు ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం



కానూరులో అగ్ని ప్రమాదానికి గురైన ఆయిల్‌కంపెనీ భవనం



గోడౌన్‌లో దగ్ధమైన ఆయిల్ డబ్బాలు

రూ.40 లక్షల ఆస్తి నష్టం

పెనమలూరు: కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులో ఉన్న న్యూ ఆటోనగర్‌లో ఓ ఆయిల్ కంపెనీలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దట్టమైన పొగలతో ఆ ప్రాంతం బీభత్సంగా మారింది. అగ్నిమాపక దళ సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు అదుపులోకి తీసుకురావటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కానూరు ఆటోనగర్ రోడ్ నంబర్ 8లో శ్రీ శివసాయి పెట్రోల్ ప్రొడక్టు కంపెనీ ఉంది. మంగళవారం ఉదయం కంపెనీలో ముగ్గురు వర్కర్లు మిషన్‌పై పనిచేస్తున్న సమయంలో నిప్పురవ్వలు ఎగిసి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు కంపెనీ గోడౌన్‌కు వ్యాపించి అక్కడే ఉన్న ఆయిల్ డబ్బాలకు అంటుకున్నాయి. దీంతో మంటలు భారీగా ఎగసి దట్టమైన పొగ ఆటోనగర్ అంతా వ్యాపించింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఆటోనగర్, కొత్తపేట, సింగ్‌నగర్, గన్నవరం, ఉయ్యూరుల నుంచి అగ్నిమాపక దళాలు వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాదం ఘటనలో రూ.40 లక్షల విలువ చేసే ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక దళ సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వించిపేటలో అర్ధరాత్రి కత్తులతో వీరంగం

పరస్పరం దాడులపై కేసులు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాత గొడవల నేపథ్యంలో ఇరు వర్గాలు పరస్పరం కత్తులతో దాడులకు దిగబడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి వించిపేటలో జరిగింది. ఈ ఘటనలో ఇరు వర్గాలకు చెందిన ముగ్గురికి గాయాలు కాగా వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట రామాలయం వీధి ప్రాంతంలో వడ్డారి చరణ్ తన కుటుంబంతో ఓ భవనంలో నివాసం ఉంటున్నాడు. అదే భవనంలో కింది పోర్షన్‌లో చరణ్ మేనమామ దుర్గారావు తన కుటుంబంతో ఉంటున్నాడు. ఇరు వర్గాల మధ్య కొంత కాలంగా ఇంటి విషయంలో గొడవలు జరుగుతూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి చరణ్ తమ్ముడైన కిరణ్‌ను దుర్గారావు కుటుంబం దూషించింది. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ పెరిగి పెద్దదైంది. ఇంతలో దుర్గారావు కుమారుడు ప్రశాంత్ కూరగాయలు కోసే కత్తి తెచ్చి కిరణ్ పొట్ట మీద, చరణ్ తలపైన పొడిచాడు. దీంతో గాయాలైన అన్నదమ్ములిద్దరూ కోపంతో కత్తితో ప్రశాంత్‌పై దాడి చేయబోయారు. దుర్గారావు భార్య లక్ష్మి, కోడలు సోని వచ్చి అడ్డుకోవడంతో వారి చేతికి గాయాలయ్యాయి. ఇరు కుటుంబాలు కత్తులతో దాడులు చేసుకోవడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. వెంటనే విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఘటనలో గాయాల పాలైన అన్నదమ్ములిద్దరితో పాటు లక్ష్మి, సోనిలను వైద్యం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

పెడన: పట్టణంలోని 15వ వార్డుకు చెందిన ఒక యువతి మచిలీపట్నంలో ఎంఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమెను అదే వార్డుకు చెందిన షేక్ ఫరీద్ నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం యువతి ఫరీద్ తండ్రి హబీబ్‌కు చెప్పినా ఎటువంటి మార్పు రాలేదు. దీంతో మంగళవారం యువతి పోలీసులకు ఫిర్యాదుచేయడంతో యువకుడు ఫరిద్, అతని తండ్రి హబీబ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

కంకిపాడు: అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...త్రిపుర రాష్ట్రానికి చెందిన విద్యార్థిని (17) గోసాల ఒక ప్రైవేటు కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. ఈమె తండ్రి దీపక్ రాయ్ తాడేపల్లిగూడెంలోని జీఎస్‌పీఎల్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థిని (17) సోమవారం రాత్రి హాస్టల్ గది నుంచి క్లాస్ రూంకి స్నేహితులతో కలిసి వెళ్తుండగా అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. కళాశాల సిబ్బంది హుటాహుటిన ఆమెను పోరంకిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థిని తండ్రి దీపక్ రాయ్‌కి సమాచారం ఇవ్వటంతో తన కుమార్తె మృతికి గల కారణాలపై విచారించాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కైలే జ్ఞానమణి



పమిడిముక్కల: మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. అన్నింటా మహిళలకు అగ్రస్థానం కల్పించి సమాజంలో గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తాడంకిలో మంగళవారం జరిగిన చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణ మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం మూడోసారి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీలు కూచిపూడి శ్రీలక్ష్మి, మేరుగ లక్ష్మి, జుఝవరపు శృతి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జంపాన పూర్ణిమ జ్ఞానమణిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, రాష్ట్ర రెడ్డిక, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌లు కంభపు రాంబాబు, శొంఠి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుర్విందపల్లి వంశీ పాల్గొన్నారు.

రూ.5 లక్షలు సీజ్

నందిగామ: సరైన పత్రాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్ చేస్తామని నందిగామ టౌన్ సీఐ హనీష్ తెలిపారు. పట్టణ సమీపంలోని అంబారుపేట వై.జంక్షన్ వద్ద 65 వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఓ వ్యాపారి హైదరాబాదు నుంచి విజయవాడకు కారులో రూ.5 లక్షల నగదు తరలిస్తున్నాడు. సదరు వ్యాపారి వద్ద నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు. తనిఖీలలో ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పులో వైఎస్సార్‌ సీపీ జోష్‌

- చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్న వైనం
- నవరత్నాల ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి
- నలుదిక్కులా గడప గడపకు అవినాష్‌ అన్న హామీ కార్యక్రమం
- మంచి చేసిన వారినే ఆదరిస్తామంటున్న తూర్పు ప్రజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మంచి పనులు చేస్తే ప్రజలు ఎంతగా ఆదరిస్తారో తూర్పులో గడప గడపకు వెళ్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులకు లభిస్తున్న ఆదరణే నిదర్శనంగా నిలుస్తోంది. మా ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చేశారని కొందరు, మా కుటుంబానికి నవరత్నాల ద్వారా మేలు జరిగిందని మరికొందరూ చెబుతూ, వారు చూపుతున్న ప్రేమ అభిమానాలు వెలకట్టలేనివిగా నిలుస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఐదేళ్లకోసారి ప్రజల వద్దకు వచ్చిన నాయకులను గతంలో చూశామని, కానీ నాలుగున్నరేళ్లుగా ప్రజల మధ్యనే, ప్రజలతోనే మమేకమై నాయకుడు దేవినేని అవినాష్‌ అని తూర్పు ప్రజలు అందరినోట అదే ఆయన పేరే వినిపిస్తోంది. మరి అంతగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందడంతో నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీ జోష్‌ నెలకొంది.

నలుదిక్కులా పర్యటనలు..

నియోజకవర్గంలో గడప గడపకు మీ అవినాష్‌ అన్న హామీ కార్యక్రమం ద్వారా దేవినేని అవినాష్‌ కుటుంబ సభ్యులు నలు దిక్కులా జోరుగా పర్యటిస్తున్నారు. అందులో భాగంగా దేవినేని అవినాష్‌ 15, 16 డివిజన్లలో పర్యటిస్తుండగా, ఆయన సోదరి దేవినేని క్రాంతి 10వ డివిజన్‌లో, అవినాష్‌ సతీమణి దేవినేని సుధీర 4, 8 డివిజన్‌లలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా వారు ఏ గడపకు వెళ్లినా ప్రజలు ఎదురొచ్చి స్వాగతం పలకడమే కాకుండా, అవినాష్‌ మా ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని కొందరు, మా ఇంట్లో నాలుగైదు ప్రభుత్వ పథకాలు అందాయని ఇంకొందరు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధిని దేవినేని అవినాష్‌ చేసి చూపించారంటున్నారు.



10వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని క్రాంతి



4వ డివిజన్‌లో దేవినేని సుధీరను సత్కరిస్తున్న ప్రజలు

తూర్పులో పర్యటిస్తున్న దేవినేని అవినాష్‌, ఆయన కుటుంబ సభ్యులు నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశాం, ఎన్ని సంక్షేమ పథకాలు అందించాం అన్నదే ప్రజలకు వివరిస్తున్నారు. మేము చేసిన మంచిని చూసే మమ్మల్ని ఆదరించండి కోరుతున్నారు. రాజకీయ విమర్శలు కంటే, చేసిన మంచి చెబుతూ, మళ్లీ గెలిపిస్తే ఆ ప్రాంతానికి ఏమి చేస్తారో కరపత్రాల ద్వారా ముద్రించి పంపిణీ చేస్తున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు అవినాష్‌కు జై కొడుతున్నారు.



చేసిన మంచినే చెబుతున్నారు..

నియోజకవర్గంలో పర్యటిస్తున్న దేవినేని అవినాష్‌, ఆయన కుటుంబ సభ్యులు నాలుగున్నరేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేసిన మంచినే వివరిస్తున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశాం. రానున్న రోజుల్లో ఏమి చేస్తాం అనే విషయాలనే ప్రజలకు చెబుతున్నారు. నిబద్ధత కలిగిన నాయకుడిగా అవినాష్‌ పేరొందారు. – గల్లా పద్మావతి, డైరెక్టర్‌, కమ్మ కార్పొరేషన్‌



కోట్లాది రూపాయలతో అభివృద్ధి..

ఇప్పటి వరకూ ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, అనంతరం వాటిని విస్మరించిన నాయకులను చూశాం. కానీ దేవినేని అవినాష్‌ ఎలాంటి హామీలు ఇవ్వకుండానే నియోజకవర్గంలో రూ.650 కోట్లు అభివృద్ధి పనులు చేశారు. ఏదో అంకెలు చెప్పడం కాకుండా, ఏమి పనులు చేశారో చెబుతున్నారు. అంతేకాదు అర్హతే ప్రామాణికంగా రూ.వెయ్యికోట్లు సంక్షేమ పథకాలు పంపిణీ చేశారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేయడంతోనే తూర్పు ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారు. – మునీర్‌ అహ్మద్‌, వ్యాపారవేత్త, లబ్బీపేట

క్లుప్తంగా

ల్యాబ్‌లో మంటల నివారణ చర్యలపై శిక్షణ



మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్‌ అండ్‌ సీవీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మగళవారం ఏపీ స్టేట్‌ బోర్డ్‌ ఆఫ్‌ టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ట్రైనింగ్‌ ఆధ్వర్యాన రసాయన శాస్త్ర ల్యాబొరేటరీలో మంటలు రావటానికి గల కారణాలు, నివారణ, నియంత్రణ చర్యలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సేఫ్టీ ఆఫీసర్‌ జి.నారాయణ రసాయన శాస్త్ర ల్యాబొరేటరీలో మంటలు రావటానికి గల కారణాలు వాటిని రాకుండా ఎలా నివారించే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే ఒక వేళ ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపిస్తే వాటిని ఏ విధంగా నియంత్రించాలో తెలియజేశారు. అందుబాటులో ఉన్న అగ్ని మాపక పరికరాలు వాటిని వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఏపీ స్టేట్‌ బోర్డ్‌ ఆఫ్‌ టెక్నికల్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ట్రైనింగ్‌ ద్వారా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.భాగ్యలక్ష్మి సర్టిఫికెట్లు అందజేశారు.

పోలీస్‌ శాఖకు బారికేడ్స్‌ అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా పోలీస్‌శాఖకు మంగళవారం 10 బారికేడ్‌లు, 40 ట్రాఫిక్‌ లైట్స్‌ స్టిక్స్‌ను అందజేసింది. ఈ మేరకు బెంజిసర్కిల్‌ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ బ్యాంకు రీజినల్‌ హెడ్‌ పి.సతీష్‌బాబు ట్రాఫిక్‌ డీసీపీ చక్రవర్తికి సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్‌ హెడ్‌ రాజేంద్ర ప్రసాద్‌, జీవీ రవీంద్ర, జనార్దన్‌ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



చిట్టినగర్‌(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌ సొరంగం కొండ ప్రాంతంలోని స్వయంభూ శ్రీ వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామివారి సుప్రభాత సేవ, అనంతరం గోపూజ, నవగ్రహ మండపారాధన జరిగాయి. ఉదయం 9 గంటలకు స్వామి, అమ్మవార్లకు మంగళస్నానాలు, నూతన వధూవరులుగా అలంకరించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అనంతరం స్వామివారి అన్న ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయగా, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు దంపతులు పర్యవేక్షించగా, ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

క్రైమ్‌, కామెడీ చిత్రం భరతనాట్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రైమ్‌, కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందించిన భరతనాట్యం సినిమా ఏప్రిల్‌ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుందని ఆ చిత్ర కథానాయకుడు సూర్యతేజ అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం ఆ చిత్ర యూనిట్‌ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హీరో సూర్యతేజ మాట్లాడుతూ ఈ చిత్రానికి తానే కథ రాశానని, ఆ సమయంలో తాను హీరోగా నటిస్తానని అనుకోలేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నటించాల్సి వచ్చిందన్నారు. సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకుడిని ఉత్కంఠపరిచేలా ఉంటుందన్నారు. నిర్మాత పాయల్‌ సరఫ్‌ మాట్లాడుతూ ఇది నిర్మాతగా తనకు తొలి చిత్రం అని, ప్రమోషన్‌ కార్యక్రమం విజయవాడ నుంచి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. డైరెక్టర్‌ కేఆర్‌ మహేంద్ర మాట్లాడుతూ తన తొలి సినిమా దొరసాని హిట్‌ అయిందని, రెండో సినిమా భరతనాట్యంను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేద కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి



సురేష్‌ కుటుంబానికి నగదు అందజేస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్‌: పేద కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని సీనియర్‌ పోలీస్‌ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. హ్యాపీ మూమెంట్స్‌ ఎంటర్‌ప్రైజెస్‌ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం ప్రముఖ సినీ ప్యాడ్‌ కళాకారుడు నేరెళ్ల సురేష్‌ జయంతి సభ, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ చాలామంది కళాకారుల జీవితాలు వ్యథాభరితాలన్నారు. వారికి కళాపోషణ తప్ప మరేమీ మిగుల్చుకోరన్నారు. సావిత్రి కళా పీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్యాడ్‌ కళాకారుడు సురేష్‌ చిన్నతనంలోని విధి దూరం చేసిందన్నారు కాని సురేష్‌ వందల కార్యక్రమాలకు, సినిమాలకు వాద్య సహకారం అందించారని తెలిపారు. కళాకారులకు ప్రభుత్వం గ్రూప్‌ ఇన్సూరెన్స్‌ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు కారుమంచిరాజు, గాయని చందన, బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్‌, శ్రీనివాసరావు, ఎం.రమణ, జోషి తదితరులు సురేష్‌తో అనుబంధం పంచుకున్నారు. స్వరాంజలి కార్యక్రమంలో భాగంగా పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు సంయుక్తంగా సురేష్‌ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

టీడీపీ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదు

వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌

ఆటోనగర్‌(విజయవాడతూర్పు): కరోనా సమయంలో హైదరాబాద్‌లో కూర్చున్న టీడీపీ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదని వైఎస్సార్‌ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌ అన్నారు. రామలింగేశ్వర నగర్‌ 15వ డివిజన్‌లోని పుట్టరోడ్డు, ఈనాడు కాలనీలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ డివిజన్‌ను అభివృద్ధి చేసి చూపించామని.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని స్థానికులను కోరారు. దేవినేని అవినాష్‌తో పాటు డెప్యూటీ మేయర్‌ బెల్లం దుర్గ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్‌ మాట్లాడుతూ.. ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన వలంటీర్లను టీడీపీ నాయకులు టెర్రరిస్ట్‌తో పోల్చడం సిగ్గుచేటన్నారు. మోసం చేసేందుకు టీడీపీ నాయకులు వస్తారని... ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌ సీపీ పాటు పడిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌ సీపీకే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. 10 ఏళ్లు ఎమ్మెల్యే ఉన్న గద్దె అభివృద్ధి చేయలేకపోయారన్నారు. ఈ నియోజకవర్గంలో కుట్ర రాజకీయాలకు టీడీపీ తెరలేపుతోందని ఆరోపించారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. డెప్యూటీ మేయర్‌ బెల్లం దుర్గ మాట్లాడుతూ.. 15వ డివిజన్‌లో జరిగిన అభివృద్ధికి రూ.కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. ప్రజలంతా వైఎస్సార్‌ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు వెంకటరెడ్డి, బాలాజీ, సత్యనారాయణరావు, డాక్టర్‌ రాజు, భుజంగరావు, శ్రీను, మోహనరావు, పోతురాజు, రామలక్ష్మణ్‌, నాని, కన్నా, కనకదుర్గ పాల్గొన్నారు.



15వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని అవినాష్‌, డెప్యూటీ మేయర్‌ బెల్లం దుర్గ

వైభవంగా వేణుగోపాలుని నగరోత్సవం



వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా జరిగింది. కొత్తపేట వేణుగోపాలస్వామి చౌక్‌(నెహ్రూబొమ్మ సెంటర్‌)లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా రెండు రోజులుగా స్వామి సన్నిధిలో పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి అర్ధరాత్రి ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత కల్యాణవేదికపై సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలుని ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించి మంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలతో కల్యాణోత్సవాన్ని ముగించారు.

నగర వీధుల్లో..

మంగళవారం స్వామి వారికి నగరోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం జరగగా మంగళవారం ఉభయదేవేరులతో కలిసి నగర వీధుల్లో విహరించారు. తొలుత రమణీయంగా అలంకరించిన వాహనంపై రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. అనంతరం స్వామి వారి నగరోత్సవాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు నిర్వహించారు. ఈ నగరోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై బ్రాహ్మణ వీధి, కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్‌ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది.

పాలిసెట్‌ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్‌ కోర్సులో ప్రవేశానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే పాలిసెట్‌–2024లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి తమ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌–2024 ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించిన రశీదును చూపించి ఈ నెల 31వ తేదీలోగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏప్రిల్‌ 1వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రతి రోజు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు 94926 85021 మొబైల్‌ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్‌

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్‌ అండ్‌ సీవీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పాలిసెట్‌ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్‌ కళాశాలలో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిసెట్‌ కోచింగ్‌ పోస్టర్‌ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. ప్రతి ఏటా విద్యార్థులకు ఉపయోగపడేలా ఉచిత కోచింగ్‌ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్‌.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సీనియర్‌ ఉపాధ్యాయులచే క్లాసులు నిర్వహించడంతో పాటు ఉచితంగా మెటీరియల్స్‌ అందజేస్తామని తెలిపారు. గత 10 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులు ఉచిత కోచింగ్‌ తీసుకొని మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర నాయకులు ఎస్కే.జాహిదా, భార్గవ, బి.మాధవ్‌, టి.ప్రణీత మణికంఠ, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.



పాలిసెట్‌ ఉచిత కోచింగ్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ భాగ్యలక్ష్మి, నాయకులు

నగరంలో 30న 'రన్‌ ఫర్‌ జీసస్‌'

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): నగరంలో ఈ నెల 30వ తేదీ ఏర్పాటు చేసిన రన్‌ఫర్‌ జీసస్‌ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని ఎన్టీఆర్‌ జిల్లా క్రిస్టియన్‌ విభాగం చైర్మన్‌ రెవరెండ్‌ డాక్టర్‌ బందెల దయానందం కోరారు. స్థానిక మధురానగర్‌ జీసస్‌ ప్రేయర్‌ ఫెలోషిప్‌ చర్చిలో మంగళవారం రన్‌ఫర్‌ జీసస్‌ కార్యక్రమం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా రన్‌ఫర్‌ జీసస్‌ కార్యక్రమం నిర్విరామంగా జరుగుతుందన్నారు. యావత్‌ క్రైస్తవ సమాజం ఎటువంటి డినామినేషన్‌ లేకుండా రన్‌ఫర్‌ జీసస్‌ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొని ఏసుక్రీస్తు త్యాగాన్ని చాటాలని పిలుపునిచ్చారు. 30వ తేదీ శనివారం ఉదయం 5.30 గంటలకు నిర్మలా కాన్వెంట్‌ సమీపంలోని సెయింట్‌ కెథడ్రల్‌ చర్చి నుంచి రన్‌ఫర్‌ జీసస్‌ ర్యాలీ బయలుదేరి స్టేట్‌ గెస్ట్‌ హౌస్‌ సమీపంలోని సెయింట్‌ పాల్స్‌ బసిలిక చర్చి దగ్గర ముగుస్తుందని తెలిపారు. రోమన్‌ క్యాథలిక్స్‌ ప్రతినిధి రెవరెండ్‌ ఫాదర్‌ మువ్వల ప్రసాద్‌, సీఎస్‌ఐ సౌత్‌ ఇండియా ప్రతినిధి రెవరెండ్‌ కరుణానిధి, మరనాత సమాజం ప్రతినిధి రెవరెండ్‌ విశ్వ ప్రసాద్‌ మాట్లాడుతూ.. రన్‌ఫర్‌ జీసస్‌ ఐక్యత, శాంతికి నిదర్శనంగా పేర్కొన్నారు. నగరంలోని క్రైస్తవులందరూ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాస్టర్స్‌ ఫెలోషిప్‌ అధ్యక్షులు, నగరంలోని పాస్టర్లు, సేవకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫాదర్‌ మువ్వల ప్రసాద్‌, దయానందం, కరుణానిధి, ప్రసాద్‌ తదితరులు

భక్తిశ్రద్ధలతో మహా సిలువ యాత్ర



విజయవాడ నగరంలో ఆర్సీఎం సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మహా సిలువ యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు విశ్వాసులు ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తూ యాత్రలో ముందుకుసాగారు. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయవాడ

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ ఆచార్య శోభన్‌బాబు
- సందడిగా కేబీఎన్‌ కళాశాల గ్రాడ్యుయేషన్‌ డే

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ ఆచార్య కే శోభన్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రాడ్యుయేషన్‌ డే (డిగ్రీ పట్టాల ప్రదానోత్సవం) కార్యక్రమం ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం అత్యంత సందడిగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభన్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు తమతమ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులను గమనిస్తూ ఆయా అంశాలపై పట్టు సాధించాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. కేబీఎన్‌ కళాశాల విద్యార్థులుగా సమాజంలో ప్రత్యేకతను చాటే విధంగా తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

1,024 మందికి పట్టాలు

కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వి.నారాయణరావు మాట్లాడుతూ.. 2022–2023 విద్యా సంవత్సరంలో కళాశాల పలు విజయాలను సొంతం చేసుకుందన్నారు. కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సులతో పాటుగా పలు యూజీసీ స్పాన్సర్స్‌ కోర్సులను అందిస్తున్నామని చెప్పారు. 2022–2023 సంవత్సరం డిగ్రీ, పీజీలు పూర్తి చేసిన 1,024 మంది విద్యార్థులకు పట్టాలను అందించారు. కళాశాల విద్యాబోధనతో పాటు అనుబంధ విభాగాలుగా ఉన్న క్రీడలు, ఎన్‌ఎస్‌ఎస్‌, ఎన్‌సీసీ, డ్రమెటిక్‌ అసోసియేషన్‌ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని, భావ వ్యక్తీకరణ వంటి అంశాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ తూనుగుంట్ల శ్రీనివాసు తొలుత సభకు స్వాగతం పలికారు. తొలుత ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శోభన్‌బాబు విద్యార్థులు గౌరవవందనంతో సభ వేదిక వద్దకు తీసుకెళ్లారు. అలాగే పోలీస్‌శాఖ వారి ప్రత్యేక బ్యాండ్‌ అతిథులకు స్వాగతం పలికింది. వందలాది మంది విద్యార్థులు ప్రత్యేక గౌను వేసుకొని ముఖ్యఅతిథి చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను అందుకున్నారు. అధ్యక్షుడు టి.శేషయ్య, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌ రమేష్‌, వైస్‌ ప్రిన్సిపాల్స్‌ పీఎల్‌ రమేష్‌, డాక్టర్‌ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్‌ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ పట్టా అందజేస్తున్న శోభన్‌బాబు తదితరులు

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ లయోలా గార్డెన్స్‌ ఫీడర్‌ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్‌ గుణదల డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీరు పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా వెంకటేశ్వరానగర్‌లోని 1,2,3 అంతర్గత రహదారులు, సెంట్రల్‌ ఎక్సైజ్‌ కాలనీ, స్పెన్సర్‌ సైడ్‌ రోడ్డు, సెంటినీ హాస్పిటల్‌ ఏరియా, వినాయక సినిమా హాల్‌ ఏరియా, ఒయాసిస్‌ హాస్పిటల్‌ రోడ్డులో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

గురుకుల కళాశాలలో శ్రీశ్రీ కవిత్వంపై వెబినార్‌

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వల్లూరి నీరజ ఆధ్వర్యాన యుగకవి శ్రీశ్రీ కవిత్వంపై వెబినార్‌ నిర్వహించారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్‌ కాకుమాని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని 'శ్రీశ్రీ కవిత్వం – నేటి ప్రాసంగికత' అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం చేశారు. 'తన పేరు కొంచెమైనా తన ఊరు మాత్రం ప్రపంచం' అని ప్రసిద్ధి పొందిన శ్రీశ్రీ '1930 దాకా కవిత్వం నన్ను నడిపించింది, తర్వాత కవిత్వాన్ని నేను నడిపించాను' అంటూ ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించిన మహాకవి అని వివరించారు. శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం', 'జయభేరి' అనే ప్రసిద్ధ కవితల ద్వారా శ్రీశ్రీ ఆశించిన సమసమాజాన్ని, అందు కోసం కర్తవ్యబోధనను ఆలోచనాత్మకంగా విశ్లేషించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్‌ నీరజ మాట్లాడుతూ.. సగటు మనిషి సమస్యలను ప్రతిభావంతంగా, ఆలోచనాత్మకంగా చిత్రించి తెలుగు కవిత్వాన్ని భూమార్గం పట్టించిన శ్రీశ్రీ యుగకవి అని కొనియాడారు. విద్యార్థులందరూ శ్రీశ్రీ కవిత్వంపై అధ్యయనం చేయాలని కోరారు. నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కాకాని సుధాకర్‌ శ్రీశ్రీ ప్రసిద్ధ కవితలను ఆలపించారు. కంచికచర్ల కళాశాల విద్యార్థులు నవ్య, సుసన్న, మాధురి, భీమవరం కళాశాల విద్యార్థులు మంజు, సౌమ్య తాము ఇష్టపడే శ్రీశ్రీ కవితలను ఆలపించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ బాలకృష్ణ, అధ్యాపకులు అరుణ, ధనలక్ష్మి, సుధారాణి, ప్రసాదరావు, కంచికచర్ల – భీమవరం కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న త్రిశక్తి పీఠంలో అమ్మవారికి గాజుల అలంకరణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఏప్రిల్‌ 9వ తేదీన బస్టాండ్‌ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారికి గాజులతో విశేషాలంకరణ జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తమ శక్తి కొద్ది గాజులను ఏప్రిల్‌ 3వ తేదీ లోగా దేవస్థానంలో అందజేయాలని కోరారు. సాయంత్రం 6.20 గంటలకు బ్రహ్మశ్రీ పుచ్చా సూర్యప్రకాశ్‌ శాస్త్రిచే ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. అలాగే 9 నుంచి 17వ తేదీ వరకు వసంత నవరాత్రుల సందర్భంగా మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఉదయం 7.30 గంటలకు అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారామస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయండి

పెనమలూరు: ఆస్తి పన్ను బకాయిలు సకాలంలో వసూలు చేయాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. యనమలకుదురు సచివాలయం–1ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ ఈ నెలాఖరు కల్లా పన్ను బకాయి ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందని తెలిపారు.

ఏపీ బీజేపీలో 'కోట్లకు సీట్లు'

క్లుప్తంగా...

శెట్టిబలిజలను విస్మరించిన పవన్

ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ



ముమ్మిడివరం: టికెట్ల కేటాయింపులో శెట్టిబలిజలను పవన్‌కళ్యాణ్ విస్మరించారని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ ఆరోపించారు. ముమ్మిడివరంలోని జనసేన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో ముమ్మిడివరం జనసేన పార్టీ టికెట్ ఇస్తే అనివార్య కారణాల వల్ల ఓడిపోయానని, అయినా ఎంతో కష్టపడి పార్టీకి పని చేశానన్నారు. ప్రస్తుతం పొత్తు ధర్మమంటూ ఏ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను సంప్రదించకుండా టికెట్లు ఇచ్చారని విమర్శించారు. గత ఎన్నికల్లో శెట్టిబలిజ వర్గానికి చెందిన తనకు మొదటి టికెట్ ఇస్తే ఎంతో గర్వపడ్డానని, అయితే ఇప్పుడు అంతే సిగ్గు పడుతున్నానన్నారు. జనసేన పార్టీని పవన్ కళ్యాణ్ కోటరీలు సర్వనాశనం చేశాయని, భవిష్యత్‌లో ఈ పార్టీకి మనుగడ ఉంటుందో లేదో చెప్పలేనన్నారు. పవన్ కళ్యాణ్ యాదవులకు, మత్స్యకారులు, తక్కువ సామాజికవర్గం ఉన్న క్షత్రియలకు టికెట్ ఇచ్చి శెట్టిబలిజ సామాజికవర్గాన్ని మాత్రం హీనాతిహీనంగా చూశారని, ఇది చాలా అవమానకరమైన విషయమని బాలకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. సోషల్ ఇంజనీరింగ్ అని ఎంతో గొప్పగా చెప్పిన పవన్ కళ్యాణ్‌కు శెట్టిబలిజ సామాజికవర్గానికి టికెట్ ఇవ్వాలని తెలియదా.. అని ప్రశ్నించారు. రెండు, మూడు రోజుల్లో పార్టీ శ్రేణులు, సామాజికవర్గం నాయకులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటానని పితాని తెలిపారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో అరుణ్‌సింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీజేపీ పోటీచేస్తున్న ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అరుణ్‌సింగ్ పిలుపునిచ్చారు. విజయవాడలో మంగళవారం జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడు పార్టీల కూటమి రాష్ట్రంలో పోటీ చేస్తున్న 175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకోవాలని.. అయితే, ప్రత్యేకించి బీజేపీ పోటీ చేసే స్థానాల్లో నేతలంతా రెండు నెలలపాటు పూర్తి సమయం వెచ్చించి పనిచేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ కూటమిగా పోటీ చేస్తు న్న మూడు పార్టీల జెండాలు వేరైనా, అజెండా మాత్రం ఒక్కటేనని, మూడు పార్టీల కూటమి ప్రభుత్వంలోకి వస్తేనే ఏపీలో రామరాజ్యం వస్తుందన్నారు. రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షణ సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ వేర్వేరుగా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధులతో భేటీ అయి మీడియా మాధ్యమాలద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రక్రియపై సమగ్రంగా వివరించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మరికొంత మంది ము ఖ్య నేతలు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఆడియో

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, కర్నూలు: టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర శాఖలో 'కోట్లకు సీట్లు' వ్యవహారం పెను సంచలనంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య ఫోను సంభాషణతో కూడా ఓ ఆడియో టేపు మంగళవారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకొచ్చింది. పొత్తులో బీజేపీకి కేటాయించినట్టు చెబుతున్న ఆదోని నియోజకవర్గాన్ని వదిలేసి, దానికి బదులు ఆలూరు సీటు కోరతామని, అందుకు రూ.3 కోట్లు అవుతుందంటూ ఆదోని నియోజకవర్గానికి చెందని బీజేపీ నాయకుడొకరు ఆ స్థానం టికెట్ ఆశిస్తున్న టీడీపీ నాయకునికి చెందిన ఓ నాయకుడితో అనడం కమలం పార్టీలో కలకలం రేపుతోంది. ఈ ఆడియోను ఆ ఇద్దరు నాయకుల్లో ఒకరు రికార్డు చేసి సోషల్ మీడియాలో ఉంచినట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదీ జరిగింది

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీజేపీ, జనసేనకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. బీజేపీ పట్టుబట్టడంతో చంద్రబాబు ఆదోని అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించినట్లు తెలిసింది. దీంతో ఈ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఇంటి వద్ద టీడీపీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు కూడా తొలగించారు. ఈ టికెట్ తనకు లేదా తన కుమారుడు భూపాల్ చౌదరికి ఇవ్వాలని మీనాక్షినాయుడు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ నుంచి మీనాక్షినాయుడు మేనల్లుడు మారుతి నాయుడుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ ఆర్థిక వ్యవహారాలు చూసే అతని సోదరుడు నాగరాజు ఫోన్ చేసి.. 'రూ. 3 కోట్లు ఇస్తే ఆదోని సీటు వదిలేసి ఆలూరు సీటు కోరతామని, అంతా మన ఇష్ట ప్రకారమే జరుగుతుందంటూ' ఆఫర్ ఇచ్చినట్లు ఆ ఆడియోటేపులో ఉంది. 'మీరు రూ.3 కోట్లు ఇస్తే మాకు ఆలూరు కావాలని చెప్పేస్తాం. మీకు హార్ట్‌ఫుల్‌గా టీడీపీ కోసం పని చేస్తాం. ఒక గంటలో మేం ఆలూరు నుంచి రిపోర్ట్ పంపిస్తాం. మాకు అన్ని చానల్స్ ఉన్నాయి. ఈ ఒక్క రోజు చెడుపుకుంటే నష్టపోతారు. రేపు టికెట్ ప్రకటిస్తున్నారు. బోర్డులో లక్ష్మణ్ జీ ఉన్నారు. మేం ఏది చెబితే అది మాట్లాడతారు. మేం పురందేశ్వరి మేడమ్‌కు కూడా అప్పజెప్పాలి' అని మారుతీ నాయుడుతో నాగరాజు అన్నట్లుగా చెబుతున్న ఈ ఆడియో టేపులో ఉంది. మంగళవారం ఉదయం 11గంటలకు బయటకు వచ్చిన ఈ ఆడియో టేప్ బీజేపీతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలాన్ని రేపింది.



పార్టీకి కేటాయించిన పది అసెంబ్లీ సీట్లలోనూ...

పొత్తులో పార్టీకి కేటాయించిందే పది అసెంబ్లీ సీట్లు. వాటినీ రాష్ట్రంలో బీజేపీకి కొద్దో గొప్పో బలం ఉన్న నియోజకవర్గాలు కోరకుండా, కనీసం పార్టీకి సరైన అభ్యర్థి కూడా లేని వాటిని ఏరికోరి జాతీయ నాయకత్వానికి సూచించడం వెనుకా రాష్ట్ర నాయకత్వం ముడుపుల దందా ఉండి ఉండొచ్చని కొందరు పార్టీ నాయకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోనే ఏకంగా రెండు నియోజకవర్గాలను బీజేపీ కోరడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. అందులోనూ సరైన నాయకుడు కూడా లేని బద్వేలు సీటు తీసుకోవడమే ఇందుకు ఒక ఉదాహరణగా చెబుతున్నారు. ఆ స్థానాన్ని బీజేపీ తీసుకున్నా, పార్టీ కార్యకర్తగా గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన పనతల సురేష్‌కు అవకాశం ఇవ్వలేదు. బలమైన నాయకుడు లేడన్న కారణంతో ఆ నియోజకవర్గ టీడీపీ నాయకుడినే అప్పటికప్పుడు బీజేపీలో చేర్చుకొని. అతనికే బీజేపీ టికెట్ ఖరారు చేసినట్లు చెబుతున్నారు. టీడీపీ నుంచి వచ్చిన వ్యక్తికి బీజేపీలో పరిచయాలు ఉండవని, అక్కడ ఖర్చు కోసం పార్టీ ఇచ్చే సొమ్ములో భారీగా నొక్కేయాలన్న ఆలోచన కూడా మరో కారణమని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. పార్టీ కార్యకర్తకు టికెట్ ఇస్తే.. పార్టీ ఇచ్చిన సొమ్ము మొత్తం ఖర్చు చేయాల్సి ఉంటుందని, నొక్కేయడానికి అవకాశం ఉండదనే సురేష్‌కు రాకుండా అడ్డుకుంటున్నారని వారు చెబుతున్నారు. రాష్ట్రంలో మరో రెండు చోట్లా రాష్ట్ర నాయకత్వం ఇదే రకమైన ముడుపుల వ్యవహారం నడిపించినట్టు రాష్ట్ర బీజేపీ నాయకులు చెబుతున్నారు.

బీజేపీ వారు రూ.3 కోట్లు అడిగింది వాస్తవమే: మీనాక్షినాయుడు

ఆదోని సీటు వదులుకోవడానికి బీజేపీ నేతలు తన బంధువులతో మాట్లాడి రూ. రూ.3 కోట్లు అడిగిన మాట వాస్తవమే అని టీడీపీ నేత మీనాక్షి నాయుడు చెప్పారు. అయితే సీటు కోసం అంత డబ్బులు ఇచ్చే స్తోమత తనకు లేదన్నారు. రూ.3 కోట్లు బీజేపీకి ఇచ్చి తిరిగి ఎన్నికల్లో పార్టీ కోసం ఖర్చు పెట్టాలాంటే తమతో కాదని తెలిపారు.

రూ.3 కోట్లు ఇస్తే టికెట్ ఇస్తామని నేను అనలేదు: నాగరాజు

మీనాక్షినాయుడు రూ.3 కోట్లు ఇస్తే టికెట్ ఇస్తామని తాను అనలేదని, తన వాయిస్ మార్చి వైరల్ చేశారని నాగరాజు చెప్పారు. 'టీడీపీ టికెట్ కోసం వారు తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు ఇలా వాయిస్ మార్చి వైరల్ చేస్తే బీజేపీకి టికెట్ రాదని ఈ ప్రయత్నం చేశారు. బీసీ వర్గం ఎదగకూడదని, బీజేపీకి టికెట్ రాకూడదనే ఇలా చేశారు. ఇందులో నా వాయిస్ లేదు. దీనిపై పరువునష్టం దావా వేస్తా' అని అన్నారు.

సోషల్ మీడియా ఆడియో టేపులో బీజేపీ ప్రతినిధి నాగరాజు, టీడీపీ నేత మీనాక్షి నాయుడి మేనల్లుడు మారుతి నాయుడు మధ్య జరిగినట్లుగా చెబుతున్న సంభాషణలో ప్రధానాంశాలు..

మారుతినాయుడు: అన్నా

నాగరాజు: రెండు విషయాలు ఓపెన్. ఒకటి.. మనకి నిన్న నైట్ కూడా ఫోను వచ్చింది. మనం ఆదోనిని అడిగినాం. దానికి ఆదోని వినపడింది.

మారుతినాయుడు: అవును లే అన్నా

నాగరాజు: మీ వాళ్లు కూడా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆలూరు వినపడింది. ఇప్పుడు ఆదోని లేదా ఆలూరు అని పడతది.

మారుతినాయుడు: అవును లే అన్నా

నాగరాజు: మేం ఏమి అంటున్నామంటే, ఒక మ్యూచువల్ అండర్‌స్టాండింగ్‌గా.. ఈరోజు ఆలూరులో మీటింగ్ ఉంది అదే పనిమీద. మీరు మాతో ఒకే అంటే.. మేం ఆలూరు కూడా మాకు ఒకే, ఏం ప్రాబ్లమ్ లేదు అని పంపించేదానికి రెడీగా ఉన్నాం. మీరు ఆదోని తెచ్చుకోండి. మేం ఆలూరుకి రెడీగా ఉన్నామని చెప్పేస్తామని అనుకుంటున్నాం.

మారుతినాయుడు: అవును లే అన్నా

నాగరాజు: దీనిపై అన్న వాళ్లతో మాట్లాడగలవా... మనకు ఏమైనా...

మారుతినాయుడు: నేను మాట్లాడతానులే అన్నా. కచ్చితంగా మాట్లాడతాను. (కొంచెం సేపు మౌనం).. మీరు ఏదైనా ప్రపోజల్ చెప్పండి

నాగరాజు: ఏదన్నది నువ్వు మాట్లాడు. ఒక గంటలో మేం ఆలూరు నుంచి రిపోర్టు పంపిస్తాం. ఇంకా ప్రకటించలేదు కాబట్టి, మేం దేనికైనా రెడీగా ఉన్నామని పంపిస్తాం. మనకి పైన హయ్యర్ ఛానల్‌లోనే మనకున్నాయి. మేం చూసుకుంటాం.

మారుతినాయుడు: మా పార్టీలో మాకు ఎలా ఉన్నాయో, మీ పార్టీలో మీకు అలా ఉంటాయిగా...

నాగరాజు: దయచేసి నీకు, మీనాక్షీనాయుడికి, ఉమాపతికి తప్ప ఎవరికీ తెలియకూడదు ఈ విషయాలు.

మారుతినాయుడు: సరే సరే అన్నా

నాగరాజు: చిన్నచిన్న వాళ్లకు గానీ, ఎవరికీ...

మారుతినాయుడు: లేదు లేదు. ఎట్ల చెబుతామన్నా, కాన్ఫిడెన్షియల్‌వి..

నాగరాజు: ..అంటే ఫైనల్ వచ్చి, ఈ ఒక్క రోజుకి చెరుపుకోకుంటే.., మేం కూడా ఆదోనిలో కూడా హార్ట్‌ఫుల్‌గా చేస్తాం. దానికేమీ ఇబ్బంది లేదు.

మారుతినాయుడు: అదేలే.. అదేలే అన్నా.

నాగరాజు: ఇంక ఒక్క రోజే మిగిలింది. ఎందుకంటే, రేపు మాకు అనౌన్స్‌మెంట్ అవుతది. ఆడ మా లక్ష్మణ్ జీ ఉంటాడు బోర్డు మీటింగ్‌లో.. మనం ఏది చెబితే అది మాట్లాడతడు అతను. అతనికీ మాకు లింక్స్ బాగా ఉన్నాయి.

మారుతినాయుడు: అదేలే అన్నా.. అదే మీరు ఏమని చెబితే..

నాగరాజు: సీక్రెట్. దయచేసి ఎవరికీ లీక్ చేయవద్దు. కలిసి చేసుకుందాం. పొజిషన్ బాగా ఉంది. మేం త్రీ సీఆర్ (మూడు కోట్లు)అడుగుతున్నాం అని చెప్పేసేయ్. చెప్పి ఓపెన్ టూ ఓపెన్ ఏదైనా ఉండనీ. మేం రిపోర్టు పంపిస్తాం. మళ్లీ తర్వాత.. ఎందుకంటే మేం కచ్చితంగా మా పురందేశ్వరి మేడమ్‌కి కూడా ముట్టజెప్పాల్సిందే.

మారుతినాయుడు: అదేలే అన్నా..

నాగరాజు: అది మేమే చూసుకుంటాం. సాధకబాధకాలు ఉంటాయి. మీ పార్టీ వాళ్లకు కూడా తెలుసు. అందరికీ తెలుసు. ఏదో అడ్జస్ట్ చేసుకుందాం.

రాష్ట్ర బీజేపీలో పరిణామాలు చూసినా..

పొత్తుల ఖరారు తర్వాత రాష్ట్ర బీజేపీలో జరుగుతున్న పరిణామాలు కూడా కమలం పార్టీలో గుడుపుఠాణీలు జరుగుతున్న అనుమానాలను బలపరుస్తున్నాయి. పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వచ్చిన తర్వాత ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని దాని కోసమే అహరహం శ్రమిస్తున్న అసలు సిసలైన బీజేపీ నేతల మాటకు విలువ లేకుండా పోయింది. ఆమెతో పాటు నాలుగైదేళ్ల క్రితం చంద్రబాబు ఆదేశానుసారం టీడీపీ నుంచి బీజేపీలో చేరిన మరికొందరు నాయకుల మాటే అధినాయకత్వం దగ్గర చెల్లుబాటయ్యేలా చూసుకుంటున్నారు. సీట్లు, టికెట్ల ప్రతిపాదనలకు కూడా వారికి నచ్చిన తీరులోనే జాతీయ పార్టీ పెద్దలకు పంపారన్న చర్చ పార్టీలో సాగుతోంది. దీనికి తగ్గట్టుగానే.. పొత్తులో బీజేపీకి కేటాయించిన ఆరు లోక్‌సభ సీట్లలో నరసాపురం మినహా మిగిలిన అరకు, అనకాపల్లి, రాజమహేంద్రవరం, రాజంపేట, తిరుపతి స్థానాలు వలస పక్షులకే దక్కాయి. పైపెచ్చు తిరుపతి లోక్‌సభ టికెట్ పొందిన గూడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వరప్రసాద్‌కు బీజేపీ సభ్యత్వం కూడా లేదు. ఆయన్ని అధికారికంగా ప్రకటించే కొన్ని గంటల ముందు ఆయన బీజేపీలో చేరారు. పురందేశ్వరి ఐదారు రోజులపాటు ఢిల్లీలో వరప్రసాద్‌ను వెంటబెట్టుకుని కొందరు జాతీయ పెద్దల వద్ద లాబీయింగ్ చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆమె ప్రతిపాదన మేరకే బీజేపీ జాతీయ నాయకత్వం వరప్రసాద్‌కు బీజేపీలో చేరక మునుపే తిరుపతి లోక్‌సభ సీటు కేటాయించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ముడుపులు బాగానే పనిచేసి ఉంటాయని బీజేపీ అసలు నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ టికెట్ కావాలంటే భూములు తాకట్టు పెట్టాల్సిందే!

సాక్షి ప్రతినిధి, కర్నూలు: కర్నూలు జిల్లా టీడీపీలో మరో విషయం వెలుగు చూసింది. పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులు తాకట్టు పెట్టి బరిలోకి దిగుతున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా అభ్యర్థులతోపాటు ఆ పార్టీ కీలక నేతలు కూడా నిర్ధారిస్తున్నారు. కర్నూలు ఎంపీ అభ్యర్థిగా పంచలింగాల నాగరాజు పోటీ చేస్తున్నారు. అంతకుముందు టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ నాగరాజును పిలిపించారు. 'ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టుకోగలవు?' అని లోకేశ్ ప్రశ్నిస్తే రూ.20 కోట్ల వరకూ ఖర్చు పెడతానని నాగరాజు చెప్పినట్లు తెలిసింది. ఇది సరిపోదని, కనీసం రూ.35 కోట్లు డిపాజిట్ చేయాలని లోకేశ్ చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో 'నగదు లేదని, భూములపై పెట్టుబడి పెట్టాను'అని నాగరాజు చెప్పారు. అందుకు లోకేశ్ కర్నూలు జిల్లాలో ఓ వ్యక్తి పేరు చెప్పి అతని వద్ద భూములు తాకట్టు పెడితే తక్కిన డబ్బులు ఇస్తారని చెప్పినట్లు సమాచారం. దీంతో తప్పని పరిస్థితుల్లో నాగరాజు భూములు తాకట్టుపెట్టి డబ్బు మకూర్చుకున్నట్లు చర్చ నడుస్తోంది. ఈ విషయాన్ని చందాల కోసం వెళ్లినప్పుడు నాగరాజు కూడా పలువురితో చర్చించినట్లు తెలిసింది. ఇలాగే కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి కూడా డబ్బుల కోసం లోకేశ్ చెప్పిన వ్యక్తుల వద్దే తాకట్టు పెట్టినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. డబ్బు లోకేశ్ పంపుతున్నారని, భూములను పార్టీలోని ముఖ్యుల వద్ద తాకట్టు పెట్టించుకున్నారని టీడీపీలోని ఓ కీలక వ్యక్తి 'సాక్షి'తో చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ముత్యాలనాయుడు

మాడుగుల అసెంబ్లీ అభ్యర్థిగా ఈర్లి అనూరాధ



ముత్యాలనాయుడు



ఈర్లి అనూరాధ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లి అనూరాధను ఎంపిక చేశారు. పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ముత్యాలనాయుడు బీసీ అయిన కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందినవారు కాగా, అదే స్థానం నుంచి కూటమి తరఫున పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ ఓసీలోని వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు. వైఎస్సార్ జిల్లా నుంచి ఆయన అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సీఎం జగన్ ఇప్పటికే రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేకున్నా బలహీన వర్గాలకు 48 శాసనసభ, 11 ఎంపీ సీట్లు కేటాయించారు. బూడి ముత్యాలనాయుడును కలుపుకుంటే మొత్తం 12 ఎంపీ సీట్లు కేటాయించినట్లు అవుతుంది. కొన్ని జనరల్ స్థానాలను కూడా సీఎం జగన్ బీసీలకు కేటాయించడం విశేషం. అసెంబ్లీ, ఎంపీ కలిపి మొత్తం 200 స్థానాల్లో 100 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే కేటాయించారు. విద్యావంతులు, సామాన్యులకు పట్టంకట్టారు. రాజకీయ సాధికారతతో సీఎం జగన్ బలంగా అడుగులు వేస్తూ దేశ చరిత్రలో రికార్డుగా నెలకొల్పారు. ఇక కూటమి విషయానికి వస్తే 156 శాసనసభ, 20 ఎంపీ అభ్యర్థులను ఖరారు చేయగా, అందులో 33 శాసనసభ, 4 లోక్‌సభ స్థానాల్లోనే బీసీలకు అవకాశం ఇచ్చారు. బడుగులకు ఇచ్చింది కేవలం 23 శాతమే.

సీఎం జగన్ ఒక సంఘ సంస్కర్త

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కృష్ణయ్య, ఆసిఫ్, భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ నాయకుడు కాదని, ఆయన ఒక సంఘ సంస్కర్త అని బీసీ సంఘ జాతీయ నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అభివర్ణించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంతో పాలన చేస్తూ వెనుకబడిన తరగతుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ విద్యాధరపురంలోని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బీసీలను గత ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిందని చెప్పారు. జగన్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలను చేయడం లేదని స్పష్టంచేశారు. బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా వెనుకబడిన వర్గాలకు చేయని సామాజికన్యాయాన్ని ఏపీలో సీఎం జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. దేశం మొత్తం ఆశ్చర్యపడేలా 11 ఎంపీ, 58 ఎమ్మెల్యే సీట్లను బీసీలకు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సామాన్య కార్యకర్త ఆసిఫ్‌ను పోటీలో నిలబెట్టడం సామాన్యమైన విషయం కాదన్నారు.ఎన్నికల ముందు చంద్రబాబు ఆడని అబద్ధం లేదన్నారు. ఆయనకు ఇప్పుడు పవన్ కళ్యాణ్ తోడయ్యాడని, చంద్రబాబు స్క్రిప్ట్‌నే ఆయన అనుసరిస్తున్నాడని ఎద్దేవాచేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వక్ఫ్‌బోర్డ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, నాయకులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో పార్టీలో చేరిన వారితో శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



నరసాపురం మండలం పెదమైనవానిలంకలో ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన శ్రేణులు



ఉండిలోని కూర్మావారి వీధిలో వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింరాజు



తణుకులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

వైఎస్సార్‌సీపీలో చేరికల వెల్లువ

- టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీగా వలసలు
- సీపీఎం నుంచి సైతం వైఎస్సార్‌సీపీలో చేరిక
- సీఎం జగన్ పాలనను మెచ్చి చేరినట్టు వెల్లడి

గుమ్మలక్ష్మీపురం/పెదవేగి/ఉండి/నరసాపురం రూరల్/తణుకు అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన టీడీపీ, జనసేన, సీపీఎం నుంచి నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో అందించిన సంక్షేమ పాలనను మెచ్చి తామంతా కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీలో చేరినట్టు ప్రకటించారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, లక్ష్మణరావు ఆధ్వర్యంలో కేదారిపురం, దుమ్మంగి, పెదఖర్జ, తోలుఖర్జ, ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం, లక్కగూడ, చాపరాయి బిన్నిడి గ్రామాలకు చెందిన 200 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లక్కగూడ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బోగపురపు నాగు, కురుపాం మండలం పి.లేవిడికి చెందిన పత్తిక మోహన్‌దాసు, జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి కీలకపాత్ర పోషించిన వై.తారకేశ్వరరావుతోపాటు విశ్రాంత ఉద్యోగులు పార్టీలో చేరారు.



భానుప్రకాష్‌కు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరులో టీడీపీకి షాక్

ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రవర్తనతో విసుగు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పాలడుగు భానుప్రకాష్ మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భానుప్రకాష్‌తోపాటు టీడీపీ నాయకులు కమ్మ రాజారావు, కండేపు బాబూరావు, పిట్టా రవి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా.. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని కూర్మారావుపేటలో 30 మంది మహిళలు, గొడపేటలో 25 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

తణుకులో భారీగా చేరికలు

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని 25, 27, 30 వార్డులకు చెందిన 200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ మంత్రి కారుమూరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

పశ్చిమ గోదావరి జిల్లా పెదమైనవానిలంకలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు ఆధ్వర్యంలో జనసేన నుంచి నాయకులు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సంకరపు పాండురంగారావు, వాతాడి హరిచంద్ర, బొడ్డు సోమరాజు, మైలా శాంతారావు, మైలా లక్ష్మీనరసింహ (నాని), సంకరపు విష్ణు, ఒడుగు సురేష్ తదితరులు జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు.

తమ్ముళ్ల తిరుగుబాటు

అవనిగడ్డ సీటు మండలి బుద్ధప్రసాద్‌కు ఇవ్వకపోవడంతో నిరసన

- పార్టీ పదవులకు 30 మంది నియోజకవర్గ టీడీపీ నేతల రాజీనామా
- మంగళగిరి పార్టీ కార్యాలయానికి రాజీనామా లేఖలు
- పెందుర్తిలో పంచకర్లకు బండారు అనుచరుల సహాయ నిరాకరణ
- టీడీపీ తీరుపై జనసేన నేతల ఆగ్రహం


అవనిగడ్డలో మూకుమ్మడి రాజీనామా పత్రాలు చూపుతున్న టీడీపీ నాయకులు

అవనిగడ్డ/పెందుర్తి/పెద్దతిప్పసముద్రం/ఒంగోలు: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు తెలుగుదేశం పార్టీ నాయకులనుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. ఎన్నో ఏళ్లుగా సీటుపై ఆశలు పెంచుకుని పార్టీ కార్యక్రమాలకోసం డబ్బు తగలేసుకుని, కష్టకాలంలో జెండా మోస్తే తీరా ఎన్నికలు వచ్చేసరికి పొత్తులో భాగంగా వేరొకరికి ఇస్తామంటే ఎందుకు సహకరించాలని వారు నిలదీస్తున్నారు. అక్కడ టికెట్ దక్కించుకున్నవారికి సహకరించేది లేదని తేల్చిచెబుతున్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలోనైతే ఒక అడుగు ముందుకేసి 30మంది నాయకులు తమ పార్టీ పదవులకు ఏకంగా రాజీనామా చేస్తూ ఆ లేఖలను పార్టీ అధిష్టానానికి పంపించారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు అధిష్టానంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. శాసన సభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు అక్కడి టికెట్ కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ 30 మంది పార్టీ నాయకులు తమ పదవులకు మంగళవారం రాజీనామా చేసి, ఆ లేఖలను మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి పంపించారు. నియోజకవర్గంలో గెలిచే సత్తా బుద్ధప్రసాద్‌కే ఉందని, పొత్తుని పక్కన పెట్టి ఆయనకే ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. పొత్తులో భాగంగా ఈ సీటును జనసేనకు కేటాయించారనీ, కనీసం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయనకు కనీసం టికెట్ గురించి సమాచారం కూడా ఇవ్వకపోవడంపై వారు మండిపడుతున్నారు. రాజీనామా చేసిన వారిలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి కర్రా సుధాకర్, అశ్వరావు పాలెం సర్పంచ్ పంప్రాజు లంకమ్మ ప్రసాద్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, క్లస్టర్ ఇన్‌చార్జి బండే రాఘవ, మాజీ ఉపసర్పంచ్‌లు ఘంటసాల కన్నయ్య, అడపా శ్రీనివాసరావు తదితరులున్నారు.కాగా పొత్తు ధర్మం పాటిస్తామంటూనే టీడీపీ నాయకులు రాజీనామాలు చేస్తూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడటంపై జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బండారుకు అన్యాయంపై రగులుతున్న కేడర్

40 ఏళ్లుగా టీడీపీ జెండాను మోస్తూ పార్టీ మనుగడ కోసం పాటుపడిన బండారు సత్యనారాయణమూర్తిని కాదని ఎక్కడి నుంచో పార్టీలు మారుతూ వచ్చిన వ్యక్తికి పెందుర్తి టికెట్ ఇస్తారా అంటూ అనకాపల్లి జిల్లా పెందుర్తి టీడీపీ కేడర్ మండిపడుతోంది. టీడీపీ నుంచి జనసేనకు ఓట్లు ట్రాన్స్‌ఫర్ అవ్వాలంటే అక్కడి జనసేన అభ్యర్థి పంచకర్ల తలకిందులుగా తపస్సు చేయాలంటూ వ్యాఖ్యానిస్తున్నారు. అయితే దానికి ప్రతిగా జనసేన నాయకులు పొత్తు ధర్మం ప్రకారం జనసేనకు సహకరించడం న్యాయమని భావిస్తున్నాం. తామేమీ టీడీపీ నాయకుల ఓట్ల మీద ఆధారపడి పోటీ చేయడం లేదని సమాధానమిస్తున్నారు. మొత్తమ్మీద పెందుర్తిలో కూటమి వికటిస్తున్నట్టే కనిపిస్తోంది. రాజకీయంగా చిరకాల ప్రత్యర్థులైన బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్‌బాబు కలసి పనిచేయడం ఇక కల్లే అని అక్కడి నాయకులు అభిప్రాయపడుతున్నారు. పొత్తు ధర్మంలో జనసేనకే టికెట్ ఇవ్వవలసి వస్తే టి.శివశంకర్‌కు టికెట్ ఇవ్వాలని, పంచకర్లకు వద్దని మొదటినుంచీ చెబుతున్నారు. కానీ వారి డిమాండ్‌ను జనసేన అధినేత పట్టించుకోకపోవడాన్ని వారు అవమానంగా భావిస్తున్నారు.

తంబళ్లపల్లిలో జయచంద్రారెడ్డికి చుక్కెదురు

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గ జనసేన, టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డికి ఎన్నికల ప్రచారంలో చుక్కెదురైంది. సోమవారం రాత్రి ఆయన మండలంలోని బూర్లపల్లి పంచాయతీ కొత్తపల్లిలో ఇంటింటా తిరిగి ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంలో ఇదే గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు జయచంద్రారెడ్డిని వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌కు మద్దతుగా జై శంకర్ అంటూ నినాదాలు చేశారు. దీంతో జయచంద్రరెడ్డి తీవ్ర అసహనానికి లోనై వెను తిరిగారు.

గిద్దలూరు జనసేనకు ఇవ్వాల్సిందే

ఒంగోలు జిల్లా గిద్దలూరు సీటు జనసేనకు కేటాయించాల్సిందేనని ఆ పార్టీ నాయకుడు, కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆమంచి స్వాములు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కాపు కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 శాతం కాపు జనాభా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ 31 సీట్లు ఇస్తే కనీసం అన్ని సీట్లు కూడా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రకటించకపోవడం బాధ కలిగిస్తుందన్నారు. తెనాలిలో జనసేనకు కేటాయించినా అది కాపు సామాజిక వర్గం కాదన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కాపులకు కూటమి టికెట్ కేటాయించలేదని, ఈ నేపథ్యంలో గిద్దలూరు సీటును జనసేనకు కేటాయించాల్సిందేనన్నారు. ఈ విషయంలో చంద్రబాబు పునరాలోచన చేయాల్సిందే అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ కాపు సంఘం నాయకులు కొండపల్లి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ కూటమి మనసు మార్చుకుని గిద్దలూరు టికెట్‌ను జనసేనకు కేటాయించకపోతే కాపులు బలంగా ఉన్న ప్రతి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో జి.వెంకటేశ్వర్లు (కొండపి), బి.బ్రహ్మయ్య(అద్దంకి), ఆర్.శ్రీనివాసరావు(పర్చూరు) తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఓటర్లకు టీడీపీ ప్రలోభాలు
ఆధార్ వివరాలు సేకరణ


శ్రీనివాసరావు


దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తక్కెళ్లపాడులో టీడీపీ నేతలు, కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి 3 రోజులుగా తిరుగుతున్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఓటర్ల నుంచి సేకరిస్తున్నారు. జిరాక్స్‌లు, ఫొటోలు తమకు ఇస్తే ఎన్నికల కంటే ముందుగానే ఇంటింటికీ గ్యాస్ సిలిండర్, స్టావ్ ఇస్తామని ప్రలోభపెడుతున్నారు. తక్కెళ్లపాడులోని ఓ ఇంటికి వెళ్లి ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటోలు ఇవ్వాలని టీడీపీ నేతలు కోరితే ఇంటి యజమాని తిరస్కరించారు. వారిని ప్రశ్నించాడు. టీడీపీ, జనసేన కార్యకర్తలను గ్రామస్తులు నిలదీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీనిపై ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెప్పారు. తక్కెళ్లపాడు, కేసానుపల్లి, పెదగార్లపాడు, దాచేపల్లితో పాటుగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్యాస్ సిలిండర్లు, స్టౌవ్‌లు ఇస్తామని టీడీపీ, జనసేన నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

మంద కృష్ణ.. మాదిగలను ఇంకెంత కాలం మోసగిస్తావ్?
ఎన్టీఆర్ జిల్లా మాదిగ నాయకులు


మాట్లాడుతున్న మేరీ కుమారి తదితరులు

మైలవరం: మాదిగలను ఇంకెంత కాలం మోసగిస్తావంటూ మంద కృష్ణమాదిగపై ఎన్టీఆర్ జిల్లా మాదిగ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జిల్లా, మైలవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆ పార్టీ మాదిగ విభాగం మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరీ కుమారి మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్లను అడ్డుపెట్టుకుని మంద కృష్ణ మాదిగ ఎస్సీలను మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. బాబుకు తొత్తుగా మారి, టీడీపీకి ఓటు వేయాలని చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. మాదిగలు మంద కృష్ణను నమ్మే స్థితిలో లేరని, వైఎస్సార్ సీపీతోనే ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీలు అంతా సమైక్యంగా కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో మాదిగ నాయకులు మందా నోవా, తొమ్మండ్రు యేసు, మేరీ ప్రశాంతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి చంద్రబాబు ఎన్నికల ప్రచారం
పలమనేరు నుంచి ప్రారంభం



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం నుంచి 'ప్రజాగళం' పేరుతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. దీనికి ముందే ఆయన 2 రోజులుగా తన సొంత నియోజకవర్గం కుప్పంలో ప్రచారం చేశారు. ముందు తన నియోజకవర్గాన్ని చూసుకుని ఆ తర్వాత రాష్ట్రవ్యాప్త ప్రచారానికి సిద్ధమవుతుండటం విశేషం. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. అనంతరం అదే రోజు నగరి, మదనపల్లి నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నాయి. తొలిరోజు 3 నియోజకవర్గాల్లో పర్యటించే ఆయన రోజుకు 3, 4 నియోజకవర్గాల్లో సభలు, రోడ్‌షోలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నాయి.

ఇండియా కూటమితో సీట్ల సర్దుబాటు: సీపీఎం

భీమవరం: రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉన్న పార్టీలతో రాష్ట్రంలో సీపీఎం, సీపీఐ కొన్ని సీట్లు సర్దుబాటు చేసుకున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కొనే శక్తి ఒక్క ఇండియా కూటమి పార్టీలకు మాత్రమే ఉందన్నారు.

పార్టీ కోసం పనిచేయకపోతే నరుకుతా
నరసరావుపేట టీడీపీ అభ్యర్థి చిందులు

నరసరావుపేట: 'టీడీపీ కోసం కార్యకర్తలు పని చేయకపోతే చంపేస్తా.. పిచ్చిపిచ్చి వేషాలు వేయవద్దు..' అంటూ కార్యకర్తలపై ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విరుచుకుపడిన ఘటన సోమవారం రాత్రి మూడోవార్డు నిమ్మతోటలో జరిగింది. అసెంబ్లీ సీటు రానంత వరకు కార్యకర్తలను ప్రేమతో బుజ్జగింపుగా మాట్లాడిన అరవిందబాబు సీటు ప్రకటించిన 48 గంటల్లోనే వారిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన వీడియో వైరల్ అయింది. మూడో వార్డులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అరవిందబాబు హాజరయ్యారు. కొందరు కార్యకర్తలు సమస్యలను అతని దృష్టికి తీసుకురాగా వారిపై అరవింద బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఫ్లెక్సీ వేస్తే తీసేస్తున్నారు. వారిని కొట్టే దమ్ము లేదు. నోరు ఎత్తితే ఒక్కొక్కడిని నరుకుతా.. మీరు నన్ను ఏమనుకుంటున్నారు..నేను చేతగాడివాడిని కాదు.. అందరూ కష్టపడి పనిచేస్తే గెలుస్తాం.. అధికారంలోకి వస్తాం. అప్పుడు చూసుకుందాం'..అంటూ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొత్తు కోసం నేను వెళ్లలేదు

వాళ్లు వస్తేనే పొత్తు పెట్టుకున్నా.. బీజేపీతో పొత్తుపై ముస్లింలతో చంద్రబాబు

సాక్షి, తిరుపతి: బీజేపీ కోరితేనే ఆ పార్టీతో పొత్తు పెట్టుకొన్నానని, పొత్తును తాను కోరలేదని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మంగళవారం కుప్పంలో ముస్లింలు, యువత, ఆ తర్వాత హంద్రీ నీవా వద్ద జరిగిన సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ముస్లింలతో సమావేశం సందర్భంగా బీజేపీ కోరితేనే పొత్తు పెట్టుకున్నట్లు మాట్లాడారు. 'పొత్తు కావాలని నేను వెళ్లలేదు. వాళ్లు వస్తేనే పొత్తు పెట్టుకోవాల్సి వచ్చింది' అంటూ ఆ సమావేశానికి వచ్చిన వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఎన్డీయే ఉన్నప్పుడు, లేనప్పుడు మైనార్టీలకు అండగా నిలిచింది తామేనని చెప్పారు. పొత్తు సీట్ల కోసం కాదని అన్నారు. ఎన్నికల కోసం ప్రత్యేకంగా బెంగళూరు నుంచి కొంతమంది ప్రొఫెషనల్స్‌ను తీసుకువస్తున్నట్లు చెప్పారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా చెరువులకు నీళ్ళు నింపుతానని, కుప్పాన్ని బెస్ట్ టౌన్‌గా చేస్తానని అన్నారు. వైఎస్సార్‌సీపీ వాళ్లు ఒక ట్యాంకర్‌లో నీళ్ల తెచ్చి సినిమా సెట్టింగులు వేసి కుప్పానికి నీళ్ళిచ్చేశానంటూ ప్రజలను ఏమార్చారని ఆరోపించారు. తెచ్చిపోసిన నీళ్ళు తెల్లారేసరికి ఇంకిపోయాయని, అద్దె గేట్లు సాయంత్రం ఎత్తుకెళ్ళారని విమర్శలు చేశారు. త్వరలో డ్రామా కంపెనీ మూసేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థ పూర్తిగా రాజీనామా చేసి ఎన్నికల్లో పాల్గొంటున్నారని, దాని మీద ఈసీకి కంప్లైంట్ చేస్తామన్నారు. వారి వద్ద ఉన్న డేటాను ఈసీ కలెక్ట్ చేసుకోవాలని కోరతామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమరావతి రాజధాని నిర్మాణం త్వరగా పూర్తి చేయలేనని అన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హంద్రీ–నీవా కాలువకు నీటిని తీసుకువస్తామన్నారు. ఇప్పటి వరకు కుప్పంను అభివృద్ధి చేసింది తానేనని గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేశారు. కుప్పం భూమిపై నడిస్తే అరిగిపోతారని రెండు హెలిక్యాప్టర్లలో తిరిగారని సీఎం జగన్‌పై విమర్శలు చేశారు. రాష్ట్రంలో రికార్డులు తారుమారు చేస్తున్నారని, పట్టాదారు పాసుపుస్తకాలు, సర్టిఫికెట్లపై సీఎం జగన్ ఫోటో పెట్టుకున్నారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు ఇజ్రాయిల్ టెక్నాలజీ నిలిపివేశారని, ఇప్పుడు వైఎస్ జగన్ వచ్చాక మొత్తం నాశనం చేశారని విమర్శించారు. గుండిశెట్టిపల్లి వద్ద మన్యం భూములు కొట్టేయాలని చూస్తున్నారని అన్నారు. నేర సామ్రాజ్యానికి విజయసాయిరెడ్డి వరల్డ్ ఫిగర్ అని, తప్పులు చేసి ఎదుటి వారిని నిందిస్తుంటారని అన్నారు.

కుప్పానికి ఎయిర్‌పోర్ట్ ఎప్పుడు వస్తుంది సార్

యువతతో జరిగిన సమావేశంలో బాబు గొప్పలను యువకులు నిలదీశారు. కుప్పంలో ఎయిర్‌పోర్టు కడతానని చంద్రబాబు దశాబ్దాలుగా హామీ ఇస్తున్నారు. ఇప్పటికీ ఇటుకరాయి ముక్క వేయలేదు. పైగా, 'కుప్పం ఎయిర్‌పోర్ట్ ద్వారా పండ్లు, కూరగాయలను విదేశాలకు ఎగుమతి చేస్తా' అంటూ మరోసారి అదే హామీ ఇచ్చారు. దీంతో ఓ యువకుడు లేచి 'కుప్పం నుంచి కూరగాయలు ఇతర దిగుబడులను విదేశాలకు ఎగుమతులు చేస్తానని చెబుతున్నారు. మీరు గతంలోనూ పలుసందర్భాల్లో కుప్పంలో విమానాశ్రయం నిర్మిస్తానని చెప్పారు. కుప్పానికి ఎయిర్‌పోర్ట్ ఎప్పుడు వస్తుంది సార్' అని చంద్రబాబును ప్రశ్నించారు. దీంతో ఓ క్షణం నివ్వెరపోయిన చంద్రబాబు.. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే విమానాశ్రయాన్ని నిర్మిస్తానని అని ఆ అంశాన్ని ముగించారు.

బాబును నిలదీసిన వృద్ధురాలు


మీ ప్రభుత్వ హయాంలో నా ఇల్లు పోయింది.. ఎప్పుడు కట్టిస్తారని చంద్రబాబును నిలదీస్తున్న వృద్ధురాలు వెంకటమ్మ

కుప్పం పట్టణం బాబునగర్‌లో ఇంటింటా ప్రచారానికి వెళ్లిన చంద్రబాబు ఓ వృద్ధురాలి నుంచి ఎదురైన ప్రశ్నతో షాక్ తిన్నారు. టీడీపీ హయాంలో రోడ్డు విస్తరణలో తన ఇల్లు కొట్టేశారని, ఇల్లు ఎప్పుడు కట్టిస్తారంటూ వెంకటమ్మ అనే వృద్ధురాలు బాబును నిలదీసింది. ఈ ప్రచారాన్ని ఇలాగే కొనసాగిస్తే ఇంకా ఎన్ని ప్రశ్నలు ఎదురవుతాయోనని ఆరు ఇళ్లు మాత్రమే తిరిగి 20 నిమిషాల్లోనే ఆ కార్యక్రమాన్ని ముగించి రామకుప్పం మండలం రాజుపేటకు వెళ్లిపోయారు.

ఓరి 'బాబో'య్.. ఇంత అబద్ధమా!

- పొత్తు కోసం బీజేపీని తాను కోరలేదన్న చంద్రబాబు
- బీజేపీనే తన వద్దకు వచ్చిందని కుప్పంలో వ్యాఖ్యలు
- పొత్తు కోసం ఢిల్లీలో బాబు పాట్లు అందరికీ తెలిసినవేనంటున్న విశ్లేషకులు
- అమిత్ షా వ్యాఖ్యలూ బాబు పొత్తు పాట్లకు నిదర్శనమే

సాక్షి, అమరావతి: అబద్ధాలాడటంలో టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధహస్తుడని అందరికీ తెలుసు. బీజేపీతో పొత్తు కోసం ఆయన పడిన తాపత్రయం, ఆ పార్టీలోని తన కోవర్టుల ద్వారా జరిపిన రాయబారాలు, మూడు రోజులు అమిత్ షా ఇంటి ముందు పడిగాపులు గాచిన తీరు, అన్ని విధాలుగా విధేయత చూపుతానంటూ ఆ పార్టీ అగ్రనేతల ముందు సాగిలపడిన వైనం ప్రపంచమంతా చూసింది. నానా తంటాలు పడి ఎలాగైతేనేం పొత్తు కుదుర్చుకున్నారు. అయినా.. 'పొత్తు కోసం నేను బీజేపీని అడగలేదు.. వాళ్లే నా దగ్గరకు వచ్చేశారు' అంటూ పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతూ తననెవరూ చూడలేదని అనుకొన్నంత ఈజీగా మాట మార్చేశారు. మంగళవారం సొంత నియోజకవర్గమైన కుప్పంలో ముస్లింలతో జరిగిన సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు బాబు చిత్తశుద్ధి లేని రాజకీయాలకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అమిత్‌షా కుండ బద్దలు కొట్టాక కూడా!

2014 ఎన్నికల్లో కూడా చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకొన్నారు. ఆ తర్వాత విడిపోయి, కాంగ్రెస్ వెంట తిరిగారు. ఇప్పుడు మళ్లీ రాజకీయ అవసరాల కోసం బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడారు. ఈ విషయం కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన అమిత్ షానే స్వయంగా చెప్పారు. 'చంద్రబాబు మమ్మల్ని వదిలేసి ఆయన అంతకు ఆయనే వెళ్లిపోయారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. మళ్లీ ఇప్పుడు మా దగ్గరకు ఆయనంతకు ఆయనే వచ్చారు' అని అమిత్‌షా విస్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ నిస్సిగ్గుగా బాబు పొత్తులపై కొత్త వాదనను లేవనెత్తడంపై విమర్శలు వస్తున్నాయి.


మాటలు మార్చడంలో బాబు దిట్ట

ఎప్పటికప్పుడు మాటలు మార్చడంలో చంద్రబాబు దిట్ట. ఇందుకు ఆయన ఏమాత్రం సిగ్గు పడరని రాజకీయ విశ్లేషకులు అంటుంటారు. ఇంతకు ముందు కూడా బాబు ఇదే విధంగా పలుమార్లు మాట్లాడారని చెబుతున్నారు. 2019కి ముందు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చినప్పుడు బీజేపీ, మోదీలపై మాట్లాడిన మాటలను, వ్యవహరించిన తీరును మరోసారి గుర్తు చేస్తున్నారు. 2014లో పొత్తులు పెట్టుకున్న తర్వాత ప్రధాని మోదీ, అమిత్‌షాలను బాబు బాహాటంగానే పొగిడేవారు. 2016 ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ నోట్ల రద్దు నిర్ణయాన్ని స్వాగతించారు. ఆ సలహా తానే ఇచ్చానని గొప్పలు కూడా చెప్పుకొన్నారు. ఆ తర్వాత ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి పెద్ద నోట్ల రద్దుతో దేశానికి ఏ ప్రయోజనం చేకూరలేదని విమర్శించి నవ్వులపాలయ్యారు. ప్రధానిపై విమర్శలు మొదలెట్టారు. అదృష్టం కలిసొచ్చి మోదీ ప్రధాని అయ్యారని బాబు వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చి వ్యవస్థలను నాశనం చేస్తున్నారని, ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందంటూ ఆరోపణలు గుప్పించారు. అక్కడితో ఆగకుండా మోదీపై వ్యక్తిగత విమర్శలకూ దిగారు. తిరుపతిలో అమిత్‌షాపైన దాడికి కూడా టీడీపీ నేతలు వెరవలేదు. ఇప్పుడు మళ్లీ తన స్వార్థం కోసం ఓ పక్క పొత్తు పెట్టుకొని, మరోపక్క వారే కోరారంటూ అనడం పట్ల రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

దిక్కుతోచని 'కూటమి'!

పొత్తులో భాగంగా టీడీపీకి దక్కిన ఒంగోలు పార్లమెంట్ స్థానం

- అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు.. బీసీ నేతకు బాబు హ్యాండ్
- మాగుంట కుటుంబాన్ని వెంటాడుతున్న ఢిల్లీ లిక్కర్ స్కాం
- వారికిస్తే మోదీ ఆగ్రహిస్తారన్న సందిగ్ధంలో టీడీపీ అధినేత
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మల్లగుల్లాలు పడుతోంది. పొత్తులో భాగంగా ఈ స్థానం తెలుగుదేశం పార్టీకి దక్కింది. రోజులు గడుస్తున్నా అభ్యర్థి ఎవరో తేల్చకుండా నాన్చుతోంది. ప్రస్తుతం మాగుంట కుటుంబానికి సీటు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే దేశాన్ని కుదిపేస్తున్న ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈ కుటుంబం పాత్ర ఉండటంతో ఏం చేయాలో తెలియక సందిగ్ధ పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారని తెలిసింది. ఈ ఎన్నికల్లో తప్పకుండా బీసీ నేతకు ఎంపీగా టికెట్ ఇస్తానని ఇచ్చిన హామీని బాబు గాలికొదిలేశారు. ఎన్నికలు వేడెక్కుతున్నా అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో మూడు పార్టీల నేతలు, కేడర్ అయోమయంలో పడ్డారు. వాస్తవంగా రెండు నెలల ముందు వరకూ ఈ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థి కరువయ్యారు. పార్టీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడిగా ఉన్న నూకసాని బాలాజీ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించారు. ఈ విషయాన్ని ఆయన చంద్రబాబు ముందుంచారు. అయితే ఈ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తానని యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు హామీ ఇచ్చారు. తీరా ఎన్నికల వేడి మొదలయ్యే నాటికి బాలాజీ పేరు మరుగున పడిపోయింది. బీసీలకు ఎప్పటిలాగే మొండిచేయి చూపారు.

తొలుత రాఘవరెడ్డి పేరు..

టీడీపీలో చేరిన మాగుంట ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా తన కుమారుడు రాఘవరెడ్డిని నిలబెట్టాలని జోరుగా ప్రచారం చేసుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ అడ్డం పడింది. దాంతో రాఘవరెడ్డి స్థానంలో ఎంపీ శ్రీనివాసులు రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఎన్నికల్లో తన తండ్రి శ్రీనివాసులురెడ్డి పోటీ చేస్తారని రాఘవరెడ్డి ఒక ప్రకటన కూడా విడుదలచేశారు. అయితే ఇప్పటివరకు చంద్రబాబు మాత్రం ఏ ఒక్కరి పేరూ ప్రకటించకపోవటం గమనార్హం. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే పలువురు అరెస్టయ్యారు. మాగుంట రాఘవరెడ్డిని కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గతంలో అరెస్ట్ చేయగా తీహార్ జైలులో కొంత కాలం రిమాండ్‌లో ఉండి ప్రస్తుతం బెయిల్‌పై వచ్చారు. తాజాగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేశారు. కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితను కూడా తిహార్ జైలుకు పంపారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు.. మాగుంట కుటుంబం విషయంలో డోలాయమానంలో పడ్డాడన్న ప్రచారం సాగుతోంది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, రాఘవరెడ్డి ఇరువురూ ఈడీ ముందు అప్రూవర్లుగా మారిన సంగతి తెలిసిందే.

ప్రచారంలో దూసుకుపోతున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

టీడీపీ, ఎన్‌డీఏ కూటమి పరిస్థితి కుడితో పడిన ఎలుకల చందంగా ఉంటే వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్న ఆయనను సీఎం జగన్ ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత జిల్లా వ్యాప్తంగా జోరుగా ప్రచారం చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి గ్రామ గ్రామాన ఆయన ప్రచారం చేసుకుంటూ ప్రజలతో మమేకమవుతున్నారు.

మాగుంట కుటుంబాన్ని వెంటాడుతున్న లిక్కర్ స్కాం

ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆర్థికంగా దన్ను ఉన్న వ్యక్తి కోసం టీడీపీ గాలింపు మొదలెట్టింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి పేరు బయటకు రావడంతో అప్పటినుంచే వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారిని పక్కనపెట్టిన విషయం విధితమే. ఒంగోలు ఎంపీ సీటు ఆ కుటుంబానికి ఇచ్చేదిలేదని కూడా ముఖ్యమంత్రి తెగేసి చెప్పారు. దీంతో మాగుంట టీడీపీ తీర్థం పుచ్చుకున్నా ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిత్వంపై నేటికీ చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఉన్న మాగుంట కుటుంబానికి టికెట్ ఇస్తే ప్రధాని మోదీ ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందేమోనన్న సందిగ్ధంలో బాబు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

భువనేశ్వరిని అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు

- 'నల్లమిల్లి'కి సీటు కేటాయించాలని డిమాండ్
- ఏలూరు జిల్లాలో కార్యకర్తలకు పరామర్శ


భువనేశ్వరి కారును అడ్డగించిన టీడీపీ కార్యకర్తలు

మధురపూడి/ కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం రూరల్: రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద మంగళవారం చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి చేదు అనుభవం ఎదురైంది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే సీటును నల్లమిల్లి రామకృష్ణారెడ్డికే కేటాయించాలంటూ టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేశారు. రాజమహేంద్రవరం ఎంపీగా దగ్గుపాటి పురందేశ్వరి గెలవాలంటే అనపర్తి సీటు రామకృష్ణారెడ్డికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజం గెలవాలి కార్యక్రమానికి హాజరవ్వడానికి భువనేశ్వరి హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ నేపథ్యంలో అనపర్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. పసుపు రంగు బ్యానర్లు, జెండాలు చేతబట్టి, భువనేశ్వరి కారును అడ్డగించారు. రామకృష్ణారెడ్డికే సీటు ఇవ్వాలి, టీడీపీ భవిష్యత్తు కాపాడాలి అని నినాదాలు చేశారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని చేపట్టిన చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలంలోని పేరంపేటలో ఉన్న భీమడోలు వెంకన్న కుటుంబాన్ని, అనంతరం వేలేరుపాడుకు చెందిన నల్లజాడ కృష్ణ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. అలాగే యర్రంపేట, కన్నాయిగూడెం, బయ్యనగూడెం గ్రామాలకు చెందిన చంద్ర చిన్న కన్నయ్య, దిర్శిపాము వెంకటలక్ష్మి, మార్గాని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి హామీ పత్రాన్ని అందజేశారు.

ఎన్నికల తాయిలాలపై వాణిజ్య పన్నులశాఖ నిఘా

రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం అప్పగించిన బాధ్యతను రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సమర్థంగా నిర్వహిస్తోంది. ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు అందించే ఎన్నికల తాయిలాలపై గట్టి నిఘా పెట్టింది. వాహనాలను తనిఖీ చేయడం ద్వారా విలువైన లోహాలపై రూ.73 లక్షలు, ఇతర వస్తువులపై రూ.470 లక్షలు కలిపి మొత్తం రూ.543 లక్షలు వసూలు చేసినట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ మంగళవారం ప్రకటించారు. 'ఉచితాల' తరలింపును అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ పలు చర్యలు చేపట్టింది. రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖలు నిర్వహించే 61 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులకు సిబ్బందిని కేటాయించింది. 12 ప్రత్యేక ఎలక్షన్ మొబైల్ వాహన తనిఖీ బృందాలను ఏర్పాటు చేసింది. డివిజన్ స్థాయిలో 16 అత్యవసర కార్యాచరణ దళాలు, సర్కిల్ స్థాయిలో 109 అత్యవసర కార్యాచరణ దళాలను సిద్ధం చేసింది. ఓటర్లకు పంపిణీ కోసం ఉద్దేశించిన ఉచిత వస్తువుల తరలింపును సమర్థవంతంగా పర్యవేక్షించడం, నిరోధించడం కోసం రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ కార్యాలయంలో ఎన్నికల సీవీటీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఎన్నికలకు సంబంధించిన ఉచితాల తరలింపుపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి 16 డివిజన్ల జాయింట్ కమిషనర్లకు, ముగ్గురు అదనపు కమిషనర్లకు, ప్రధాన కమిషనర్ కార్యాలయంలో వాట్సాప్ సౌకర్యంతో మొబైల్ సౌకర్యం కల్పించింది. ఈ మొబైల్ నంబర్లు విస్తృతంగా ప్రచారం చేసింది. కమిషనర్ కార్యాలయంలో సేవలందించడానికి మొబైల్ నంబర్లు: 9154970481, 9154997782 కేటాయించారు. దీంతో పాటుగా సరిహద్దు రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల వాణిజ్య పన్నుల కమిషనర్లు, రాష్ట్ర నోడల్ అధికారులతో ఇంటర్ డిపార్ట్‌మెంట్ సమన్వయ సమావేశం నిర్వహించింది.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా కుటుంబానికి సర్కారు అండ



మా ఆయన చేనేత పనులు చేస్తుండేవారు. ఆయన సంపాదనతోనే మా కుటుంబ పోషణ సాగేది. వచ్చే అరకొర ఆదాయం ఇద్దరు పిల్లలను పోషించేందుకు ఎటుకూ సరిపోయేది కాదు. ఏ ప్రభుత్వం మమ్ములను ఆదుకోలేదు. అనుకోకుండా ఆయన 2016లో గుండెపోటుతో కన్నుమూశారు. అప్పటినుంచి కుటుంబ బాధ్యత నాపైనే పడింది. అప్పట్లో కుటుంబ పోషణకోసం బాపట్ల జిల్లా చీరాల పట్టణం పేరాల శృంగార పేటలో ఇంటివద్దనే ఉన్న చిన్నపాటి బడ్డీకొట్టు పెట్టుకున్నాను. దాని ద్వారా వచ్చిన ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో అందినకాడికి అప్పులు చేయాల్సి వచ్చింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక మా కష్టాలన్నీ తీరిపోయాయి. నాకు వితంతు పింఛన్ మంజూరైంది. బడ్డీకొట్టు అభివృద్ధి చేసుకునేందుకు జగనన్న తోడు పథకం ద్వారా బ్యాంకులో రూ.10 వేల వడ్డీలేని రుణం తీసుకున్నాను. వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.28 వేలు, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750లు వంతున వచ్చింది. అంతేకాక మనవరాలు రెండో తరగతి చదువుతుండటంతో అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు వంతున వచ్చింది. గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి కారంచేడు రోడ్డులో అర ఎకరం పొలానికి సంబంధించి పట్టా అందజేశారు. అయితే ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి ఆ భూమిపై నాకు శాశ్వతహక్కు కల్పిస్తూ నాపేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఇప్పుడు మా కుటుంబానికి ఎలాంటి చింతా లేదు. ఇన్ని విధాలుగా సాయపడిన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– మన్ని ప్రేమకుమారి, చీరాల
(కొప్పుల వాసుబాబు, విలేకరి, చీరాల రూరల్)

మా బతుకులు మారాయి



మా నాన్న ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్. మా అమ్మ సునీత అంగన్‌వాడీ టీచర్. వారిద్దరి రెక్కల కష్టంతో గత ప్రభుత్వం ఎలాంటి సాయం అందివ్వకపోయినా ముగ్గురు అక్కచెల్లెళ్లను చదివించారు. అక్క మౌనిక ఇప్పుడు వీఏఏగా మెట్ట ఉప్పరగూడెం రైతుభరోసా కేంద్రంలో పనిచేస్తున్నారు. మరో సోదరి మనీష డిప్లమో చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామానికి చెందిన మాది పేద కుటుంబం అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన విద్యాదీవెన ద్వారా నేను బీటెక్ పూర్తిచేశాను. గ్రూప్–1కు శిక్షణ తీసుకుంటున్నాను. ప్రస్తుతం ప్రిలిమ్స్ పరీక్షలు కూడా పూర్తిచేశాను. మెయిన్స్ పరీక్ష రాయాల్సి ఉంది. నా శిక్షణకు అవసరమైన ఆర్థిక సాయాన్నీ ప్రభుత్వం అందిస్తూ వస్తోంది. మెయిన్స్ పరీక్షలో క్వాలిఫై కాగానే సివిల్స్ శిక్షణ కూడా తీసుకుంటాను. విద్యాదీవెన ద్వారా సీఎం జగనన్న ప్రోత్సాహం అందించారు. ఆయనకు ఎంతగానో రుణపడి ఉంటాం. ఐఏఎస్ సాధించి పేదలకు అండగా నిలవాలన్నది నా ఆకాంక్ష. మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం కూడా వచ్చింది. ఇంకా ఇల్లు కట్టుకోవాల్సి ఉంది. మా బతుకులు మార్చిన జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– జాలాది రమ్యశ్రీ, పెదతాడేపల్లి
(కె.ఆశీర్వాదరావు, విలేకరి, తాడేపల్లిగూడెం రూరల్)

ఆయనే లేకుంటే కుటుంబం వీధిన పడాల్సిందే



మాది నిరుపేద కుటుంబం. మా ఆయన ఎనిమిదేళ్ల క్రితం అనుకోకుండా కన్నుమూశారు. దాంతో ఒక కుమార్తె, ఇద్దరు కుమారుల బాధ్యత నాపై పడింది. ఇక బతుకు తెరువుకోసం విజయనగరం జిల్లా కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు కడిగే పని చేస్తూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో పిల్లలను పెంచాను. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతే మా కుటుంబానికి ఆసరా లభించింది. నాకు వితంతు పింఛన్ మంజూరైంది. నా కుమార్తె వైష్ణవికి పదో తరగతి, ఇంటర్ చదువుతున్నపుడు అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు వంతున వచ్చింది. తరువాత భోగాపురం సమీపంలో గల ఒక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు విద్యాదీవెన, వసతి దీవెన కూడా వర్తించింది. మా అబ్బాయి గిరీష్‌కుమార్ ఏడో తరగతి, పవన్‌కుమార్ నాల్గో తరగతి చదువుతున్నారు. ఒక అబ్బాయికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15వేలు వంతున వస్తోంది. నాకు జగనన్న ఇల్లు మంజూరైంది. వైఎస్సార్ చేయూత పథకం వర్తించడంతో ఏడాదికి రూ.18,750 లు వంతున వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటివరకూ రూ 8వేలు వర్తించింది. నా భర్త మరణించాక ఎన్నో ఇబ్బందులు పడుతున్న నాకు దేవుడిలా జగనన్న ఆదుకున్నారు. ఆయన చేసిన మేలు ఎన్నటికీ మరువలేం.

– బాలుడు లత, రెల్లి
(గుల్లిపల్లి ముత్యాలనాయుడు, విలేకరి, కొత్తవలస)

అన్నదాతల్లో ఆనందం

ఒక్క రోజులోనే ధాన్యం రైతుల ఖాతాల్లో రూ.815 కోట్లు జమ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

- ఖరీఫ్‌లో రూ.6,541.23 కోట్ల విలువైన ధాన్యం సేకరణ
- ఇప్పటివరకు రూ.6,514.59 కోట్లు చెల్లింపు పూర్తి
- మిగిలిన స్వల్ప మొత్తానికి డీఎం అప్రూవల్స్ రాగానే చెల్లించేలా షెడ్యూల్
- రాష్ట్ర చరిత్రలోనే సంపూర్ణ మద్దతు ధర అందించిన ప్రభుత్వంగా రికార్డు
- ఒక్క రూపాయి బకాయి లేకుండా రైతులకు చెల్లించడంలో సక్సెస్
- ఈ ఐదేళ్లలో రూ.65,142.29 కోట్ల విలువైన 3.40 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు
- చంద్రబాబు హయాంలో 17.94 లక్షల మంది రైతుల నుంచే ధాన్యం సేకరణ
- వైఎస్ జగన్ పాలనలో ఏకంగా 37.68 లక్షల మందికి మద్దతు ధర



సాక్షి, అమరావతి: ఎంతో శ్రమించి పండించిన పంటకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజులోనే చెల్లింపులు జరపడంతో అన్నదాతల ఇళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. మద్దతు ధరతో కొనుగోలు చేసిన ధాన్యానికి గానూ వైఎస్ జగన్ ప్రభుత్వం మంగళవారం రూ.815 కోట్లు చెల్లించింది. దీంతో ఖరీఫ్‌లో సేకరించిన రూ.6,541.23 కోట్ల విలువైన ధాన్యానికి రూ.6,514.59 కోట్లు చెల్లించినట్లయ్యింది. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైన మిగిలిన స్వల్ప మొత్తాన్ని కూడా పౌరసరఫరాల సంస్థ డీఎం అనుమతి రాగానే రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు వీలుగా ప్రభుత్వం షెడ్యూల్ చేసింది. రైతు సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దళారులు, మిల్లర్ల దోపిడీ నుంచి రైతులను రక్షిస్తూ ఆర్బీకే స్థాయిలోనే సంపూర్ణ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు సకాలంలో చెల్లింపులు చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 29.93 లక్షల టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసి.. 4.96 లక్షల మంది రైతులకు మద్దతు ధరను అందించింది. ఇలా ఈ ఐదేళ్లలో ధాన్యం కొనుగోళ్లలో ఒక్క రూపాయి కూడా బకాయి లేకుండా రైతులకు సంపూర్ణ మద్దతు ధరను అందించిన ప్రభుత్వంగా రికార్డు సృష్టించింది. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో 21 రోజుల్లోనే నగదు చెల్లిస్తోంది.

పెరిగిన ధాన్యం సేకరణ..

గత చంద్రబాబు ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి ఏడాదికి సగటున 56 లక్షల టన్నులు ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. అదే సగటు ప్రస్తుత ప్రభుత్వంలో 77 లక్షల టన్నులుగా ఉంది. దీనికి తోడు ఆర్బీకే పరిధిలోని రైతులు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వారి కల్లాల వద్దనే ధాన్యం సేకరణ చేపట్టింది. ఆర్బీకేల్లో.. ధాన్యం సేకరణకు అవసరమైన శాశ్వత ఏర్పాట్లు చేసింది. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 17.94 లక్షల మంది రైతుల నుంచి రూ.40,236.91 కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించగా.. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు ఏకంగా 37.68 లక్షల మంది రైతుల నుంచి రూ.65,142.29 కోట్ల విలువైన 3.40 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే సీఎం జగన్ ప్రభుత్వంలో అదనంగా దాదాపు 20 లక్షల మంది రైతులకు సంపూర్ణ మద్దతు ధర దక్కింది.

తడిచిన ధాన్యమూ కొనుగోలు..

అలాగే వైఎస్ జగన్ ప్రభుత్వం ఏపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా జయ రకం(బొండాలు/దుడ్డు బియ్యం) ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసింది. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లో జయ రకం పండించే రైతులు చాలా లాభపడ్డారు. ప్రకృతి విపత్తులు, అకాల వర్షాల వల్ల తడిచిన ధాన్యాన్ని తెచ్చిన రైతులకు సైతం అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను సైతం పక్కనపెట్టి తడిచిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో సేకరించి మరీ రైతులకు మద్దతు ధర అందించడంలో రికార్డు నెలకొల్పింది. ఆఫ్‌లైన్‌లో సేకరించిన ధాన్యాన్ని దూరాభారాలు చూడకుండా డ్రయ్యర్ సౌకర్యం, డ్రయ్యర్ ప్లాట్‌ఫాం ఉన్న మిల్లులకు తరలించి ఆరబోసి మరీ కొనుగోలు చేసింది. జగన్ ప్రభుత్వం అదనపు భారాన్నైనా మోసింది గానీ ఒక్క రైతు కూడా నష్టపోకుండా చర్యలు చేపట్టింది.

అదనంగా టన్నుకు రూ.2,523

గత ప్రభుత్వం పేరుకే ధాన్యం సేకరణ చేసేది. కొనేదంతా మిల్లర్లు.. దళారులే. వారంతా రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని 75 కేజీల బస్తాకు మద్దతు ధర కంటే రూ. 200 వరకు తగ్గించి ఇచ్చేవారు. ఇలా ఎకరానికి తక్కువలో తక్కువ 30 నుంచి 33 బస్తాల దిగుబడి వేసుకున్నా.. రూ.6 వేలకు పైగా రైతులు నష్టపోయేవారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ–క్రాప్ డేటా ఆధారంగా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరిస్తోంది. దీంతో మిల్లర్లు, దళారుల దందాకు చెక్‌పడింది. అలాగే రైతులపై ఆర్థిక భారం తగ్గించడంలో భాగంగా ప్రతి టన్ను ధాన్యం కొనుగోలులో రవాణా, హమాలీ, గోనె సంచుల వినియోగం నిమిత్తం రైతులకు రూ.2,523 అందిస్తోంది. గతంలో రైతులే సొంత ఖర్చులతో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే.. వాటిని ప్రభుత్వ వాహనాల్లో తరలించినట్టు రికార్డుల్లో నమోదు చేసి టీడీపీ నాయకులే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అప్పనంగా మింగేశారు.

బాబు హయాంలో బకాయిలు..

చంద్రబాబు హయాంలో రైతులు ధాన్యం డబ్బుల కోసం అహోరాత్రులు ఎదురు చూడాల్సి వచ్చేది. రైతులు తాము కష్టపడి పండించిన పంటను ప్రభుత్వంపై నమ్మకంతో విక్రయిస్తే.. వారికి చెల్లించాల్సిన డబ్బులను సైతం చంద్రబాబు పక్కదారి పట్టించారు. ఇలా 2019 ఎన్నికలకు ముందు పౌరసరఫరాల సంస్థకు చెందిన రూ.4,838.03 కోట్లను వేరే కార్యక్రమాలకు మళ్లించి రైతులను నట్టేట ముంచారు. చివరకు సీఎం పదవి నుంచి దిగిపోతూ రూ.960 కోట్లు చెల్లించకుండా రైతులను మోసం చేశారు. సీఎం జగన్ వచ్చిన తర్వాత టీడీపీ ప్రభుత్వంలోని బకాయిలను కూడా తీర్చి.. పారదర్శక ధాన్యం కొనుగోలు విధానాన్ని తీసుకొచ్చారు.

ధాన్యానికి మద్దతు ధర పెరిగిందిలా (క్వింటాకు.. రూపాయల్లో)

సంవత్సరం	ఏ–గ్రేడ్	సాధారణ రకం
2014–15	1,400	1,360
2015–16	1,450	1,410
2016–17	1,510	1,470
2017–18	1,590	1,550
2018–19	1,770	1,750
2019–20	1,835	1,815
2020–21	1,888	1,868
2021–22	1,960	1,940
2022–23	2,060	2,040
2023–24	2,203	2,183

మంద కృష్ణకు ఆంధ్ర రాజకీయాలతో ఏం సంబంధం?

లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్



మాట్లాడుతున్న కాకుమాను రాజశేఖర్, తదితరులు

గాంధనగర్ (విజయవాడ సెంట్రల్): తెలంగాణకు చెందిన ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలతో ఏం సంబంధమని లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణకు చెందిన ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ అక్కడ రాజకీయపార్టీ పెట్టి.. ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడడం ఎంత వరకు సబబని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. చంద్రబాబు మెప్పు కోసం మంద కృష్ణ ఎస్సీల మధ్య రాజకీయ చిచ్చు పెట్టడం సరికాదని మండిపడ్డారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, నెరేడ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవి, మందపాటి శేషగిరి రావు తదితరులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇపుడిపుడే రాజ్యాంగ ఫలాలు అందుకుంటున్న మాదిగలను ఇబ్బందులకు గురి చేసేందుకు.. మంద కృష్ణ ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకోబోమన్నారు. పక్క రాష్ట్రాల వారు ఇక్కడికి వచ్చి వాస్తవాలు తెలియకుండా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. దళిత నాయకులు పి.శ్రీనివాస్, బూదాల శ్రీనివాసరావు, మేదర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ–2024 నిర్వహణపై 'ఈసీ'కి లేఖ

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ వెల్లడి



సాక్షి, అమరావతి: ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5 వరకు నిర్వహించిన 'టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్' (టెట్) ఫలితాల ప్రకటన, డీఎస్సీ–2024ను హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించాలని అనుకుంటున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున దీనిపై ఎన్నికల కమిషన్ అనుమతి కోరినట్లు చెప్పారు. తొలుత టెట్ ఫలితాలను ఈ నెల 20న ప్రకటించాలని నిర్ణయించుకున్నా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సెట్ ఫలితాలు ప్రకటన, డీఎస్సీ నిర్వహణకు అనుమతి కోరుతూ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కు లేఖ రాసినట్లు వివరించారు. దీనిపై ఈసీ నుంచి అనుమతి రాగానే టెట్ ఫలితాలు ప్రకటనతో పాటు డీఎస్సీ నిర్వహణకు పరీక్షా కేంద్రాల ఎంపిక, హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కానీ ఈ విషయం తెలిసీ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవాలను చెప్పకుండా ప్రభుత్వం టెట్, డీఎస్సీని వాయిదా వేయాలని చూస్తుందంటూ దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బీఈడీ చేసిన 51 వేల మంది ఎస్‌టీజీ పరీక్షలకు అనర్హులయ్యారని, వీరికి త్వరలోనే ఫీజు తిరిగి చెల్లిస్తామన్నారు. ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోలేకపోయిన అభ్యర్థులకు కూడా ఫీజు వాపసు చేస్తామన్నారు.

డీసీఐ ఎండీ, సీఈవోగా దూబే



సాక్షి, విశాఖపట్నం: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (డీసీఐ) ఎండీ, సీఈవోగా దుర్గేష్‌కుమార్ దూబే నియమితులయ్యారు. ప్రస్తుత ఎండీ కెప్టెన్ దివాకర్ కాలపరిమితి ఇటీవలే ముగిసిన నేపథ్యంలో.. కొత్త ఎండీ కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో వచ్చిన దరఖాస్తులపై పోర్టు ప్రధాన కార్యాలయంలో జరిగిన డీసీఐ బోర్డు డైరెక్టర్స్‌తో పోర్టు చైర్మన్ అంగముత్తు సమావేశంలో చర్చించారు. ఎండీ దివాకర్ కూడా దరఖాస్తు చేసుకున్నా ఆయనపై వచ్చిన ఆరోపణలపై పోర్టు చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేసి అభ్యర్థనను తోసిపుచ్చారు. ఆయన స్థానంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు కొత్త ఎండీ, సీఈవోగా దూబేని నియమిస్తున్నట్లు బోర్డు ప్రతిపాదించింది. 2020 డిసెంబర్ నుంచి విశాఖ పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న దూబే.. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) 2006 బ్యాచ్‌కు చెందినవారు. గతంలో విశాఖ పోర్టు లాజిస్టిక్స్ పార్క్ లిమిటెడ్, సేతు సముద్రం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థల డైరెక్టర్‌గా దూబే పనిచేశారు.

33 శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

నోటిఫికేషన్ జారీ చేసిన మీనా

సాక్షి, అమరావతి: పోలింగ్ విధులతోపాటు వివిధ నిత్యావసర సేవల్లో ఉంటూ పోలింగ్ రోజు గైర్హాజరయ్యే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వివిధ సేవల్లో నిమగ్నమయ్యే 33 శాఖలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతోపాటు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 12–డి పత్రాలను అందుబాటులో ఉంచుతారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం పొందిన ఓటర్లకు ఆ విషయం గురించి తెలియజేస్తారు.

పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు వీరే

మెట్రో రైలు, రైల్వే రవాణా సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి ఎన్నికల కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు జారీ చేయబడిన మీడియా వ్యక్తులు, విద్యుత్ శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్–టెలిగ్రామ్, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కో–ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, అగ్నిమాపక శాఖ, జైళ్లు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ట్రెజరీ సర్వీసెస్, అటవీ శాఖ, సమాచార, ప్రజా సంబంధాల శాఖ, పోలీస్, పౌర రక్షణ–హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు–వినియోగదారుల వ్యవహారాలు, ఇంధన శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్, విపత్తు నిర్వహణ సంస్థ ఉద్యోగులు.

వలంటీర్లు టెర్రరిస్టులా!?

- వారిని ఉగ్రవాదులతో పోల్చడం అమానుషం
- కరోనా కష్టకాలంలో.. సంక్షేమ పథకాల అమలులో వారిదే కీలకపాత్ర
- టీడీపీ నేత బొజ్జలపై సర్వత్రా ఆగ్రహావేశాలు
- టీడీపీ–జనసేన పార్టీలకు వారంటే కడుపుమంట: ప్రభుత్వ సలహాదారు ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి
- ప్రజల్లో తేల్చుకుందామా అంటూ వలంటీర్ల సంఘం సవాల్
- వలంటీర్లను చూస్తే బాబు కూటమికి భయం : మంత్రి సురేష్



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న పాయసంపల్లె వలంటీర్లు



ఏర్పేడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

సాక్షి, అమరావతి/వీరపునాయునిపల్లె/ఏర్పేడు (తిరుపతి జిల్లా)/ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు)/కవిటి/టంగుటూరు : నిరంతరం ప్రజల సేవలో ఉంటున్న వలంటీర్లను శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి టెర్రరిస్టులతో పోల్చడంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ వ్యవస్థను మెచ్చుకుంటుంటే టీడీపీ నేతలు మాత్రం రాజకీయ కోణంలో వారిని టార్గెట్ చేయడంపై అన్ని వర్గాలు మండిపడుతున్నాయి. సేవే పరమావధిగా ప్రజలకు మంచి చేస్తున్న వీరిని స్లీపర్స్ సెల్స్ అని.. ఉగ్రవాదులు, డేటా చోరీ చేస్తున్నారని అనడం చాలా బాధాకరమని.. సుధీర్‌రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా రాష్ట్రంలోని వలంటీర్లందరికీ క్షమాపణలు చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. బొజ్జల సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలపై ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల సేవలను మరచిపోయారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిని ఉగ్రవాదులతో పోల్చడం అమానుషమన్నారు. గతంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కూడా వలంటీర్లను తీవ్రంగా విమర్శించారని.. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మంచిగా అమలవుతుండడంతో టీడీపీ, జనసేన పార్టీలకు కడుపుమంటగా మారిందన్నారు.

వలంటీర్ల విశ్వసనీయత, తేల్చుకుందామా?

మరోవైపు.. బొజ్జల సుధీర్‌రెడ్డి వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా తప్పుబట్టింది. ప్రజలోకి మీరు, మేము వెళ్దాం.. ఎవరిపట్ల మంచితనం, విశ్వసనీయత, విశ్వాసం ఉందో చూద్దాం అని వలంటీర్లందరి తరఫున కమిటీ సవాల్ విసిరింది. అప్పట్లో సొంత కుటుంబ సభ్యులే దగ్గరికి రాని పరిస్థితుల్లో వలంటీర్లు తమ ప్రాణాన్ని పణంగా పెట్టి సేవలు చేశారని.. అలాగే, ఆ రోజుల్లో సుధీర్‌రెడ్డి హైదరాబాద్‌కే పరిమితమయ్యారని.. కానీ, వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు ఆయనకేం తెలుసని ప్రశ్నించింది. 'అలాంటి వారిపై సుధీర్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయటం చాలా బాధాకరమని, సుధీర్‌రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వలంటీర్లందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం'.. అంటూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీట నాగమల్లేష్, ప్రధాన కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మద్దిలి కాళిదాస్, ఉపాధ్యక్షులు పూజారి ఉదయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

13 మంది వలంటీర్లు రాజీనామా..

సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలంలోని పాయసంపల్లె సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 13మంది వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ పులి రాంసింగ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ నాయక్‌లకు రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ నేతలు వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపట్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. అవ్వతాతలు, చదువురాని పేదలకు సేవచేసేందుకు సీఎం వైఎస్ జగన్ తమకు అవకాశం కల్పించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నామని.. కానీ, టీడీపీ నేతలు దీనిని రాజకీయం చేస్తున్నారన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి లాంటి నేతలు మరోసారి విమర్శించేందుకు అవకాశంలేకుండా రాజీనామాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇక తిరుపతి జిల్లా ఏర్పేడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ సచివాలయాలకు చెందిన వలంటీర్లు నిరసన చేపట్టారు. టీడీపీ అంటేనే టెర్రరిస్ట్ పార్టీ అని వారు మండిపడ్డారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవచేస్తున్న వలంటీర్లను జిహాదీ తీవ్రవాదులు, బాంబులు పెట్టే టెర్రరిస్టులు, స్లీపర్ సెల్స్ అంటూ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన బొజ్జల వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి: మంత్రి సురేష్



మంత్రి సురేష్



ఎంపీ ఎంవీవీ

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ నాయకులు, కూటమి పార్టీల నేతలు అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మీడియా సమక్షంలో చెప్పారు. వలంటీర్లను చూస్తే చంద్రబాబు కూటమికి భయం పట్టుకుందన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల సంగతి తెలుస్తామని గతంలో వారు మాట్లాడారన్నారు. ప్రజలకు సేవలు చేస్తున్న వలంటీర్లపై టీడీపీ నేతలు ఇలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే వలంటీర్లే బుద్ధి చెబుతారని మంత్రి హెచ్చరించారు. అలాగే, వలంటీర్లపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పగబట్టిందని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ విశాఖలో విమర్శించారు. వలంటీర్లను టెర్రరిస్టులుగా పేర్కొనడం దారుణమన్నారు. వలంటీర్లపై టీడీపీ కూటమి పగబట్టడం దారుణమన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తెచ్చిన జన్మభూమి కమిటీలు ప్రజలను ఎలా దోచుకున్నాయో అందరికీ తెలిసిందేనని.. కానీ, వలంటీర్లు అలా కాదని.. వారు అందిస్తున్న సేవలను ప్రజలు మరిచిపోరన్నారు.



‘ఈ రోజులను చూస్తుంటే మా రోజుల్లోనే అమ్మాయిలకు తగినంత స్వేచ్ఛ,
అనుకున్నవి సాధించే ధైర్యం, సమాజాన్ని అర్థం చేసుకునే పరిణతిని పొందారు’ అనిపిస్తుంటుంది అన్నారు రిటైర్డ్ ప్రిన్సిపల్ కమలా మీనన్. తిరుపతి పద్మావతి మహిళా కళాశాల మూడవ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహించిన కమలా మీనన్ సికింద్రాబాద్ బోయినపల్లిలో ఉంటున్నారు.

భర్త డగ్లస్ ఎమ్ కాక్రన్ జ్ఞాపకాలతో పాటు, 86 ఏళ్ల జీవితంలో ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలు తనను ఎలా నిలబెట్టాయో వివరించారు.

‘‘చదువు అమ్మాయిలను శక్తిమంతులను చేస్తుంది. ఈ విషయాన్ని ఆ రోజుల్లోనే మా అమ్మ గుర్తించారు..’ అంటూ గతకాలపు విషయాలను మన ముందుంచారు.

చదువు శక్తినిస్తుంది

● మా రోజుల్లోన్లే గుర్తించాం: పద్మావతి వర్సిటీ రిటైర్డ్ ప్రిన్సిపల్ కమలా మీనన్

■ చదువు వేసిన మార్గం..

‘‘పుట్టి పెరిగింది చెన్నైలో. నాన్నగారు బ్రిటిష్ గవర్నమెంట్‌లో ఉద్యోగం చేసేవారు

అమ్మానాన్నలకు ఎనిమిది మంది సంతానం. అక్కతోపాటు ఆరుగురు అన్నలు నాకు. ఆడ, మగ అనే వివక్ష ఏ మాత్రం లేదు. అందరికీ మంచి చదువులు చదువుకునే అవకాశం ఇచ్చారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ఆనర్స్ పూర్తయ్యాక బెంగళూరు మౌంట్ కార్మెల్ కాలేజీలో లెక్చరర్‌గా ఐదేళ్లు పని చేశాను. ఆ ఎక్స్‌పీరియెన్స్ నాకు చాలా హెల్ప్ అయ్యింది. అప్పుడు చదువుకునే అమ్మాయిల శాతం కూడా బాగానే ఉంది. ఆ తర్వాత మార్పు కోసం తిరిగి మద్రాస్‌కు వచ్చేశాను. తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో పొలిటికల్ విభాగంలో టెంపరరీ జాబ్ గురించి పేపర్‌లో ప్రకటన చూసి, అప్లై చేసి, సెలక్ట్ అయ్యాను. ఆరు నెలల తర్వాత పర్మినెంట్ అయ్యింది.

■ సవాళ్లను తట్టుకుని ఎదుగుతూ..

జీవితంలో సవాళ్లు, బాధలు ఎక్కడి నుంచైనా ఎదురు కావచ్చు. నన్ను విపరీతంగా బాధపెట్టే సంఘటన నుంచి కోలుకోవడానికి సమయం పట్టింది. మా అక్క ఢిల్లీలో ఉండేవారు. జబ్బు పడి అక్క, నాన్న ఇద్దరూ ఒకే రోజు చని పోయారు. ఈ సంఘటన నన్ను బాగా కదిలించాయి. ఆ టైమ్‌లో డా.రాజేశ్వరి మూర్తి కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉండేవారు. ఆవిడ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లినప్పుడు సెలక్షన్ కమిటీ నన్ను ఇన్‌ఛార్జిగా ఎంపిక చేసింది. నా మైండ్ కూడా ఛేంజ్ కావాలనుకొని, 1975లో ఆ బాధ్యత తీసుకున్నాను. ఇంటర్వ్యూ ద్వారా టెంపరరీ జాబ్ వచ్చింది. తర్వాత పర్మినెంట్ అయ్యింది. ఆ తర్వాత ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా అవకాశం వచ్చింది. నాకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. అదే సమయంలో విదేశాలకు వెళ్లిన మరో సీనియర్ మహిళా లెక్చరర్ తిరిగి వచ్చారు. అప్పుడు మేనేజ్‌మెంట్ సీనియర్ కాబట్టి ఆవిడను నా ప్లేస్‌లో రీ ప్లేస్ చేశారు. అప్పటికే నన్ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది, ఆ తర్వాత మరొకరికి ఇచ్చింది. దీంతో నా పొజిషన్ కోసం కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ నేను గెలిచాను. అలా యూనివర్శిటీకి 3వ మహిళా ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్నాను. ఆ తర్వాత 1993లో రిటైర్ అయ్యేవరకు ప్రిన్సిపల్‌గా చేశాను. 1997 వరకు దేవస్థానం ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా వర్క్ చేశాను.

లెక్చరర్‌గా ఎంతో మంది విద్యార్థులను చూశాను. ఎంతోమంది విద్యార్థులతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటికీ కలిసేవారు, ఫోన్లు చేసి మాట్లాడేవారున్నారు. ఆత్మీయులుగా మారినవారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన, మొదటి తరం అమ్మాయిలే అక్కడంతా. వారిలో భవిష్యత్తుని చక్కగా మార్చుకోవాలనే పరిణతి బాగా కనిపించేది. వారి భవిష్యత్తుకు ప్రత్యేక క్లాసులు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ చేర్చాం. లెక్చరర్లు ఎంతో సపోర్ట్‌గా నిలిచేవారు. నాటి ఆ విద్యార్థుల్లో నేడు ఎంతోమంది పెద్ద పెద్ద పొజిషన్లలో, దేశ విదేశాల్లో ఉన్నారు.

■ జీవితంలో ముఖ్యమైన మలుపు

1979–80లో నాటి మద్రాస్‌లో సౌత్ ఇండియా అమెరికా రాయబార కార్యాలయానికి డగ్లస్ ఎమ్ కాక్రన్ కాన్సులేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాలేజీ సెమినార్ సందర్భంగా మద్రాస్ నుంచి తిరుపతికి సెమినార్‌కు వచ్చారు. అక్కడ డిస్కషన్స్ అన్నీ పూర్తయి, వెళ్లిపోయారు. ఆ సమయంలో యునైటెడ్ స్టేట్స్ ఇరాన్ పొలిటికల్ ఇష్యూస్ జరుగుతున్నాయి. చెన్నైలోని అమెరికన్ ఎంబసీ ఎదుట నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో సేఫ్‌గా ఉండమని రాసిన నోట్ తిరిగి మమ్మల్ని కలిపింది. ఆ తర్వాత జరిగిన డిస్కషన్స్ మమ్మల్ని మంచి స్నేహితులుగా మార్చాయి. 1985లో మేం పెళ్లి చేసుకున్నాం. ఆ విధంగా శ్రీమతి డగ్లస్ ఎమ్ కాక్రన్ అయ్యాను. జీవితంలో ఒక అద్భుతమైన వ్యక్తిని కలిసాను అనిపించేది. మా అమ్మను ఆమె సొంత కొడుకుల కన్నా డగ్లస్ గొప్పగా చూసుకున్నారు. ఇన్నేళ్ల మా జీవనంలో ఎన్నో అందమైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఇటీవల డగ్లస్ అనారోగ్యంతో భౌతికంగా దూరమయ్యారు. అయితేనేం.... ఆ జ్ఞాపకాలు ఎంతో పదిలంగా ఉన్నాయి. అవే నన్ను శక్తిమంతురాలిని చేస్తున్నాయి.

■ విశ్రాంత జీవనంలో..

రిటైర్ అయినా కొన్ని విదేశీ కంపెనీలు, సూపర్‌మార్కెట్స్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించేవారు డగ్లస్. నేను రిటైర్ అయిన తర్వాత ఎక్కడ ఉండాలో ఇద్దరమూ ఆలోచించుకున్నాం. అందుకు, సికింద్రాబాద్‌లోని బోయినపల్లి మాకు అనువైనదిగా అనిపించింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాం. మా ఇంట్లోనే కాదు మా చుట్టుపక్కల ఇళ్లలో పనులు చేసే వారి పిల్లలకు మంచి చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో వారిని ఒక చోట చేర్చి చదువులు చెప్పేవాళ్లం. కాలనీలోని చదువుకున్న మహిళల చేత ట్యూషన్స్ చెప్పించేవాళ్లం. వారి పిల్లలను కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించి, మంచి భవిష్యత్తు ఇవ్వాలనుకునేవాళ్లం. అలా, ఆ పిల్లలు కూడా ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

అమ్మానాన్నల పెంపకంలోనూ, చదువులోనూ, సమాజంలో మనకు లభించే స్వేచ్ఛ దుర్వినియోగం చేసుకోకూడదు. ఆ స్వేచ్ఛను మనకు అనుకూలంగా మలచుకోవాలి. అదే మనల్ని శక్తిమంతులుగా నిలుపుతుంది అది ఏ దేశమైనా అని నేనూ కాక్రన్ అనుకునేవాళ్లం’’ అంటూ నేటి తరంలో వస్తున్న మార్పులను అన్వయించుకుంటూ తెలియజేశారు’’ కమలా మీనన్.

– నిర్మలారెడ్డి

పట్టణాలలో, నగరాలలో మానసిక సమస్యలకు వైద్యం అందుబాటులో ఉంటుంది. పల్లెల్లో ఎలా? ముఖ్యంగా మహిళలకు మానసిక సమస్యలు వస్తే? డిప్రెషన్‌తో బాధ పడ్డ నటి దీపికా పడుకోన్ గ్రామీణ మహిళల మానసిక ఆరోగ్యం కోసం ‘లివ్ లవ్ లాఫ్’ అనే సంస్థను స్థాపించింది. దాని బాధ్యతను చెల్లెలు అనిషా పడుకోన్‌కు అప్పజెప్పింది. అనిషా నిర్వహణలో ఆ సంస్థ ఆరు రాష్ట్రాలలో గ్రామీణ మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తోంది.

సేవ



అనిషా పడుకోన్

అక్క చూపిన మార్గంలో

చెన్నైకి గంటన్నర ప్రయాణ దూరంలో ఉండే తిరువళ్లూరులో శశికళ అనే మహిళకు మతి చలించింది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆమెను తీసుకొచ్చి చెన్నైలో చూపిస్తే మందులు వాడాలన్నారు. చెకప్‌ల కోసం, మందుల కోసం నెలకోసారి చెన్నై రావాలంటే డబ్బులు ఖర్చవుతాయి. ఆమె అంత డబ్బు ఖర్చు పెట్టలేని పేద మహిళ. మందులు మానేసింది. మానసిక స్థితి ఇంకా దెబ్బ తిని ఊళ్లో దిమ్మరిగా తిరగడం మొదలెట్టింది. గ్రామీణ స్త్రీల మానసిక ఆరోగ్యం కోసం పని చేస్తున్న ‘లివ్ లవ్ లాఫ్’ సంస్థ ప్రతినిధులకు ఈ సంగతి తెలిసింది. తమతో కలిసి పని చేస్తున్న చెన్నైకి చెందిన వసంతం ఫౌండేషన్‌కు ఈ సంగతి తెలియపరిచారు. ఆ ఫౌండేషన్ వారు ఆమెను తరచు వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. కావలసిన మందులు కొనిచ్చారు. కేర్‌గివర్‌గా పని చేస్తున్న తల్లికి దారి ఖర్చులు సమకూర్చారు. శశికళకు పూర్తిగా నయమైంది. ఆ తర్వాత ఆమె చిన్న చిల్లరకొట్టు నడుపుకోవడానికి 5000 రూపాయల సహాయం అందించారు. శశికళ ఇప్పుడు తన పిల్లలను చూసుకుంటూ జీవిస్తోంది.

‘ఇలా సహాయం అందాల్సిన వారు మన దేశంలో చాలామంది ఉన్నారు’ అంటుంది అనిషా పడుకోన్. ఆమె ‘లివ్ లవ్ లాఫ్’ సంస్థకు సి.ఇ.ఓ.

దీపిక స్థాపించిన సంస్థ

తాను డిప్రెషన్‌తో బాధ పడుతున్నట్టు దీపికా పడుకోన్ 2015లో లోకానికి వెల్లడి చేసింది. స్త్రీల మానసిక ఆరోగ్యం గురించి అందరూ ఆలోచించాలని పిలుపునిచ్చింది. అంతే కాదు తన బాధ్యతగా 2016లో బెంగళూరు కేంద్రంగా స్త్రీల మానసిక ఆరోగ్యం కోసం ‘లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్’ను స్థాపించింది. దానికి తన చెల్లెలు అనిషా పదుకోన్‌ను సి.ఇ.ఓగా నియమించింది. అనిషా ఈ సంస్థ కోసం చురుగ్గా పని చేస్తోంది. ఇప్పటికి ఈ ఫౌండేషన్ సేవలను ఆరు రాష్ట్రాలకు విస్తరించింది. ఆ ఆరు రాష్ట్రాలలోని 13 జిల్లాల్లో ఈ సంస్థ వాలంటీర్లు పని చేస్తున్నారు. వీరివల్ల 15,000 మంది గ్రామీణ మహిళలు ఇప్పటి వరకూ మానసిక చికిత్స పొందారు. అంతే కాదు 26,000 మంది సంరక్షకులు, అంగన్‌వాడి కార్యకర్తలు మానసిక చికిత్సలో ప్రాథమిక అవగాహనకై ట్రయినింగ్ కూడా ఈ సంస్థ వల్ల పొందారు.

గోల్ఫ్ ప్లేయర్

అనిషా పడుకోన్ తండ్రి ప్రకాష్ పడుకోన్ ప్రఖ్యాత బాడ్మింటన్ ప్లేయర్ కావడం వల్ల అనిషా స్పోర్ట్స్ పట్ల ఆసక్తి కనపరిచింది. ఆమె గోల్ఫ్ క్రీడను ప్రొఫెషనల్ స్థాయిలో నేర్చుకుని మన దేశం తరపున అమెచ్యూర్ లెవల్‌లో ప్రాతినిధ్యం వహించింది. అయితే ఆ ఆటను కొనసాగించే సమయంలోనే దీపికా పడుకోన్ సూచన మేరకు ఫౌండేషన్ బాధ్యతలు తీసుకుంది. ‘ఇక్కడ పని చేయడం మొదలెట్టాక మానసిక సమస్యల తీవ్రత అర్థమైంది. మన దేశంలో 20 కోట్ల మంది మానసిక సమస్యలతో బాధ పడుతున్నారు. వీరిలో గ్రామీణ స్త్రీలు ఎక్కువ శాతం ఉన్నారు. వీరి కోసం మందులు, వైద్యం, పెన్షన్, సంరక్షకుల ఏర్పాటు, ఉపాధి... ఇవన్నీ సాధ్యం కావాలంటే పెద్ద ఎత్తున సాయం కూడా అందాలి. వాలంటీర్లు ముందుకు రావాలి. కలిసి పని చేయాలి’ అంటుంది అనిషా.

స్త్రీలు వ్యాయామం చేయడంతో పాటు పోషకాహారం తీసుకుంటూ తగినంత నిద్ర పోవడం అవసరం అంటుందామె. మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు అని పిలుపునిస్తోంది.

ఇన్నోవేషన్

స్మార్ట్ స్కోప్

- ప్రమాదాన్ని హెచ్చరిస్తుంది

సర్వైకల్ క్యాన్సర్‌ను ముందుగానే పసిగట్టే సంస్థ ‘స్మార్ట్ స్కోప్’ అనే డిజిటల్ డివైజ్‌ను రూపొందించింది పుణెలోని పెరివింకిల్ టెక్నాలజీస్...



వీణా మోక్తాలి

మహిళలకు ఎక్కువగా వచ్చే క్యాన్సర్‌లలో సర్వైకల్ క్యాన్సర్ రెండో స్థానంలో ఉంది. ఈ క్యాన్సర్ ప్రమాదాన్ని పసిగట్టడంలో ‘స్మార్ట్ స్కోప్’ కీలకపాత్ర పోషిస్తోంది. యూఎస్, యూకేలలో పని చేసిన వీణా మోక్తాలి ఆమె భర్త కౌస్తుభ్ నాయక్‌లు మన దేశానికి వచ్చి పుణె కేంద్రంగా పెరివింకిల్ టెక్నాలజీకి శ్రీకారం చుట్టారు.

ఈ కంపెనీ నుంచి వచ్చిన ‘స్మార్ట్ స్కోప్’ డిజిటల్ డివైజ్ సులభంగా ఉపయోగించేలా ఉంటుంది.

‘ప్రస్తుతం ఉన్న సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పద్ధతులు సమయం తీసుకుంటాయి. ఈ సౌకర్యాలు పెద్ద నగరాల్లోని సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా ఎక్కువమంది మహిళలు స్క్రీనింగ్ చేయించుకోలేకపోతున్నారు’ అంటుంది వీణ.

ఈ నేపథ్యంలో ‘స్మార్ట్ స్కోప్’ అనేది చిన్న ప్రైవేట్ క్లినిక్, నర్సింగ్ హోమ్స్, మున్సిపల్ డిస్పెన్సరీలు, ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్, జిల్లా ఆస్పత్రులలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక బ్యాంకు మేనేజర్‌కు గ్రేడ్–2 దశలో క్యాన్సర్‌ని గుర్తించడంలో స్మార్ట్ స్కోప్ ఉపయోగపడింది. మన దేశంలోని ఆరు రాష్ట్రాలకు చెందిన లక్షమంది ఈ పరికరం సహాయంతో జాగ్రత్త పడ్డారు. ఈ డివైజ్ నిర్వహణ ఖర్చు తక్కువ కావడం కూడా మరో సానుకూల అంశం.

‘కూలి పనుల వల్ల రోజుల తరబడి ప్రయాణాలు చేసే టైమ్ గ్రామీణ మహిళలకు ఉండడం లేదు. స్మార్ట్ స్కోప్ ద్వారా ఫలితం కోసం ఎక్కువ సమయం ఎదురు చూడాల్సిన అవసరం లేదు’ అంటుంది వీణ.

అంతర్జాతీయ మార్కెట్‌లోకి కూడా విస్తరించాలనే లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది వీణా మొక్తాలి.

నేడు వరల్డ్ థియేటర్ డే

యూత్ పల్స్

నాటక యవనికపై యువ సంతకం



నవన్ శరణ్

పెద్దలు ఇష్టపడే కళగా గుర్తింపు పొందిన ‘నాటక కళ’పై యువత ఆసక్తి ప్రదర్శించడమే కాదు అందులో ఇష్టంగా భాగం అవుతోంది. పాశ్చాత్య నాటకాల పరిశీలన నుంచి మన నాటకాలలో ప్రయోగాల వరకు నాటకరంగంపై యువ సంతకం మెరుస్తోంది....

తిరువనంతపురంలోని ‘నిరీక్షణ ఉమెన్స్ థియేటర్’ వారి నాటకమహోత్సవానికి హాజరైన రోజు నుంచి నందినికి నాటకరంగంపై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది. దేశ నలుమూలల నుంచి ఎనిమిది మంది మహిళా దర్శకుల నాటకాలను ఈ నాటక మహోత్సవంలో ప్రదర్శించారు. ఇందులో మూడు స్ట్రీట్‌ప్లేలు కూడా ఉన్నాయి. ఇరవై నాలుగు సంవత్సరాలుగా కళాప్రియులను ఆకట్టుకుంటున్న ‘నిరీక్షణ’ నిర్వహించే వర్క్‌షాప్‌లకు యువతరం నుంచి మంచి స్పందన లభిస్తోంది.

‘నాటకాలు చూడడం తప్ప ఎప్పుడూ ఆడలేదు. స్వాతి తిరునాల్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో నిరీక్షణ నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన తరువాత నటనపై ఆసక్తి పెరిగింది’ అంటుంది మనీష. ఎంబీఏ చేస్తున్న మనీష రంగస్థల పాఠాలపై కూడా దృష్టి పెడుతోంది.

నాటకరంగంపై యువతకు ఆసక్తి కలిగించడానికి భూపేష్ రాయ్, ప్రియాంక సర్కార్‌లు లక్నోలో నిర్వహించిన థియేటర్ ఫెస్టివల్‌కు మంచి స్పందన లభించింది. ‘ఒకప్పుడు థియేటర్ ఫెస్టివల్ అంటే పెద్దవాళ్లు ఎక్కువగా కనిపించేవారు. ఇప్పుడు యూత్ కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాటకాలపై చర్చించుకుంటున్నారు’ అంటున్నాడు భూపేష్ రాయ్.

బెంగళూరులోని ఆల్–ఉమెన్ ట్రూప్ ‘ది అడమెంట్ ఈవ్స్’ యువతలో నాటకరంగంపై ఆసక్తిని కలిగిస్తోంది. ఈ ట్రూప్‌లో సభ్యురాలైన బాలశ్రీ యూఎస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నప్పుడు నాటకాలకు సంబంధించిన ఒక వర్క్‌షాప్‌కు హాజరైంది. ఇక అప్పటినుంచి నాటకరంగం ఆమెకు ఇష్టంగా మారింది. ఒకవైపు అనలిస్ట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే నాటకాల్లో నటిస్తోంది.

పిల్లల నుంచి యువతకు వరకు ఎంతోమందిలో నాటకరంగంపై ఆసక్తి కలిగిస్తోంది కావ్య శ్రీనివాసన్. ఆమె థియేటర్ యాక్టర్, ప్లేరైటర్, స్టోరీ టెల్లర్. మధు శుక్లా థియేటర్ ప్రాక్టీషనర్, కోచ్, స్టోరీ టెల్లర్. వృత్తిరీత్యా అనలిస్ట్ అయిన లక్ష్మీ ప్రియా మంచి నటి. ఉద్యోగ సమయం తరువాత ఈ బృందం రిహార్సల్స్, ప్లానింగ్, ఇంప్రూవ్ షోలు చేస్తుంది. ప్రతి మంగళ, గురువారాల్లో ఏదో ఒక మెంబర్ ఇంట్లో రిహార్సల్ కోసం సమావేశం అవుతారు. ‘వేదికపై ఉన్నప్పుడు సౌకర్యవంతంగా, ఆత్మవిశ్వాసంతో ఉండడానికి తమ నైపుణ్యాలను నటులు ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడం అవసరం’ అంటుంది బాలశ్రీ.

కావ్య శ్రీనివాస్ నుంచి బాలశ్రీ వరకు ఎంతో మంది నాటకరంగ కళాకారులు యువతకు స్ఫూర్తిని ఇస్తున్నారు.

నాటకరంగంలో చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకున్నాడు క్వాసర్ ఠాకూర్ పదంసీ. ఇరవై సంవత్సరాల వయసులో సెక్యూర్డ్ జాబ్‌ను వదిలేసి నాటకరంగానికి అంకితం అయ్యాడు ‘వ్యక్తుల జీవిత కథలను మరింత శక్తిమంతంగా చెప్పే దిశగా భారతీయ నాటకరంగం ప్రయాణిస్తోంది. మన నాటకం కాలంతోపాటు పయనిస్తూ ఎప్పటికప్పుడూ కొత్త సాంకేతికతను సొంతం చేసుకుంటుంది. లైవ్ కెమెరాలు, ప్రొజెక్షన్‌లు నాటకరంగంలో భాగం అయ్యాయి’ అంటాడు పదంసీ.

మన నాటకరంగ విశిష్టతను ఒకవైపు చెబుతూనే మరోవైపు... ‘కష్టాలు ఉంటాయి. ఇదేమీ లాభసాటి వృత్తి కాదు’ అంటాడు. అయితే అభిరుచులు, ఆసక్తులను వాణిజ్య కొలమానాలతో చూడడానికి ఇష్టపడని యువత నాటకరంగాన్ని అమితంగా ప్రేమిస్తోంది. నాటక సమాజాలతోపాటు అవి చేస్తున్న ప్రయోగాల గురించి కూడా ఆసక్తిగా తెలుసుకుంటోంది. రేపటి నాటకానికి తమ వంతుగా సన్నద్ధం అవుతోంది.

తమాషాగా సంతోషంగా...

ముంబైకి చెందిన నవన్ శరణ్ పొయెట్, రైటర్, యాక్టర్. థియేటర్ కంపెనీ ‘తమాషా’ ఫౌండింగ్ మెంబర్‌లలో ఒకరు. కొత్త రకం ఐడియాలకు ‘తమాషా’ పుట్టిల్లుగా మారింది. శరణ్ మొదటి నాటకం క్లబ్ డిజైర్. క్రమం తప్పకుండా నాటకాలు ప్రదర్శించే శరణ్ మోడలింగ్ చేస్తుంది. సినిమాల్లో నటిస్తుంది. కవితలు కూడా రాస్తుంటుంది. నాటక రంగానికి సంబంధించి కొత్త ప్రయోగాలు చేయడంలో యువతరానికి స్ఫూర్తి ఇస్తున్న వారిలో నవన్ శరణ్ ఒకరు.

తోడా ధ్యాన్ సే...

సమకాలీన సామాజిక అంశాలను చర్చించడానికి నాటకాన్ని ఒక మాధ్యమంగా ఉపయోగించుకుంటున్న వారిలో ఢిల్లీకి చెందిన థియేటర్ ప్రాక్టీషనర్ మల్లికా తనేజా ఒకరు. పురుషాధిక్యత నిండిన కళ్లతో స్త్రీని ఎలా చూస్తారు? స్త్రీ భద్రతకు వస్త్రధారణకు ఎలా ముడిపెడతారు? అదృశ్య అణచివేతరూపాలు... మొదలైన అంశాలను తన సోలో నాటకం ‘తోడా ధ్యాన్ సే’ ప్రతిబింబిస్తుంది. మల్లిక వ్యక్తిగత అనుభవాలే ఈ నాటకానికి పునాది.



మల్లికా తనేజా

రంగస్థలమే పాఠశాల

మన దేశంలోని ప్రతిభావంతులైన యువనటులలో ఐరా దూబే ఒకరు. ‘యేల్ స్కూల్ ఆఫ్ డ్రామా’లో చదువుకుంది. ‘9 పార్ట్స్ ఆఫ్ డిజైర్’లో ఆమె సోలో పెర్‌ఫార్మెన్స్‌కు మంచి పేరు వచ్చింది. దూబే కుటుంబంలో చాలామంది నటులు ఉన్నారు. అందుకే సరదాగా ‘నాటకాల ఫ్యామిలీ’ అని పిలుస్తారు.

“థియేటర్ ఆర్ట్స్‌పై యంగ్ పీపుల్ ఆసక్తి ప్రదర్శించడమే కాదు నాటకకళ పట్ల తమ నిబద్ధతను చాటుకుంటున్నారు. యువనటులకు బోలెడు అవకాశాలు ఉన్నాయి. మనం ఒక నాటకం చేస్తే ఏ కారణం కోసం చేస్తున్నామో, ఏ ప్రేక్షకుల కోసం చేస్తున్నామో తెలుసుకోవాలి. టార్గెట్ ఆడియెన్స్ గురించి అవగాహన కూడా ముఖ్యం. యాక్టింగ్ స్కూల్ ద్వారా మాత్రమే నటన వస్తుంది అనే దాన్ని నేను నమ్మను. రంగస్థలమే పాఠశాల. అక్కడే ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు” అంటుంది ఐరా దూబే.



‘9 పార్ట్స్ ఆఫ్ డిజైర్’లో ఐరా దూబే



బంగ్లాదేశ్ జట్టులో షకీబ్ పునరాగమనం

రాజకీయ నాయకుడిగా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాక బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ జాతీయ జట్టులోకి పునరాగమనం చేశాడు. శ్రీలంక జట్టుతో చట్టోగ్రామ్‌లో శనివారం మొదలయ్యే రెండో టెస్టులో షకీబ్ ఆడనున్నాడు. గత ఏడాది భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్‌కప్ మధ్యలో షకీబ్ గాయంతో వైదొలిగాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో 37 ఏళ్ల షకీబ్ అవామీ లీగ్ పార్టీ తరఫున మగురా నియోజకవర్గం నుంచి పోటీచేసి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యాడు.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఫ్లోరిడాలో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 7–5, 7–6 (7/3)తో హ్యూగో నిస్ (మొనాకో)–జాన్ జిలెన్‌స్కీ (పోలాండ్) జోడీపై గెలిచింది. 99 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు.



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శ్రీజ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 25 ఏళ్ల శ్రీజ ఏడు స్థానాలు ఎగబాకి 40వ ర్యాంక్‌కు చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీజ గత వారం లెబనాన్‌లో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) రెండు టోర్నీల్లో రాణించింది. తొలి టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన ఆమె రెండో టోర్నీలో విజేతగా నిలిచింది. మనిక బత్రా 38వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. మే 16వ తేదీ వరకు భారత టాప్–2 ర్యాంకర్లకు పారిస్ ఒలింపిక్స్‌లో సింగిల్స్ విభాగంలో పోటీపడే అవకాశం లభిస్తుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఆచంట శరత్ కమల్ 35వ ర్యాంక్‌లో ఉండగా... సత్యన్ జ్ఞానశేఖరన్ 43 స్థానాలు ఎగబాకి 60వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. తెలంగాణ ప్లేయర్ స్నేహిత్ 22 స్థానాలు పురోగతి సాధించి 144వ ర్యాంక్‌లో నిలిచాడు.

గాయత్రి జోడీకి చుక్కెదురు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో ఐదో సీడ్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గాయత్రి–ట్రెసా ద్వయం 18–21, 22–20, 18–21తో ఆనీ జు–కెర్రీ జు (అమెరికా) జంట చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. మరోవైపు అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) జంటకు తొలి రౌండ్‌లో వాకోవర్ లభించడంతో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ నుంచి మిథున్ మంజునాథ్ (భారత్) మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించగా... సమీర్ వర్మకు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్ తొలి మ్యాచ్‌లో మిథున్ 15–21, 24–22, 21–18తో శంకర్ ముత్తుస్వామి (భారత్)పై, రెండో మ్యాచ్‌లో 21–16, 21–12తో లియావో జు ఫు (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు.

చెన్నై ధనాధన్ గెలుపు

- చెలరేగిన దూబే, రచిన్ రవీంద్ర
- పడగొట్టిన దీపక్, తుషార్
- 63 పరుగులతో ఓడిన గుజరాత్


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శివమ్ దూబే

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ ఆల్‌రౌండ్ షోకు నిరుటి రన్నరప్ గుజరాత్ టైటాన్స్ పోరాటం వదిలి చేతులెత్తేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో చెన్నై 63 పరుగుల తేడాతో గుజరాత్‌పై ఘనవిజయం సాధించింది. మొదట చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీ స్కోరు చేసింది. శివమ్ దూబే (23 బంతుల్లో 51; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర (20 బంతుల్లో 46; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులే చేసి ఓడింది. సాయి సుదర్శన్ (31 బంతుల్లో 37; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పరుగుల తేడా పరంగా ఐపీఎల్‌లో గుజరాత్‌కిదే అతిపెద్ద ఓటమి. చెన్నై బౌలర్లు దీపక్ చహర్, తుషార్ దేశ్‌పాండే, ముస్తఫిజుర్ తలా 2 వికెట్లు తీశారు.

ముందు రచిన్... తర్వాత దూబే...

చెన్నై ఇన్నింగ్స్ తొలి 10 ఓవర్లు, తర్వాత 10 ఓవర్లు అన్నట్లుగా రెండు దశలూ ధనాధన్‌గా సాగింది. తొలి దశను ఓపెనర్ రచిన్ దూకుడుగా మొదలుపెట్టాడు. అతను క్రీజులో ఉన్నది కాసేపే అయినా... భారీ షాట్లతో విరుచుకుపడటంతో మెరుపు వేగంతో చెన్నై స్కోరు దూసుకెళ్లింది. ఆరో ఓవర్ రెండో బంతికి రషీద్ అతని జోరుకు కళ్లెం వేశాడు. ఓపెనింగ్ జోడీ 32 బంతుల్లో 62 పరుగులు జతచేయగా, ఇందులో 46 పరుగులు ఒక్క రచిన్‌వే కావడం విశేషం. తర్వాత రహానే (12), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (36 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) చెన్నైను నడిపించారు. 10 ఓవర్లలో చెన్నై 104/1 స్కోరు చేసింది. తర్వాతి ఓవర్ తొలి బంతికే రహానే అవుట్‌కాగా... శివమ్ దూబే రావడంతో రెండో దూకుడు కొత్తగా మొదలైంది. స్పిన్, పేస్ ఏ బౌలర్‌కు తలొగ్గకుండా దూబే బ్యాట్ దంచేసింది. మిచెల్ (20 బంతుల్లో 24 నాటౌట్; 2 ఫోర్లు) అండతో శివమెత్తడంతో... ఈ జోడీ కూడా 35 బంతుల్లో 57 పరుగులు జోడించింది. 22 బంతుల్లో దూబే అర్ధసెంచరీ పూర్తయిన వెంటనే నిష్క్రమించాడు. సమీర్ రిజ్వీ (6 బంతుల్లో 14; 2 సిక్స్‌లు) మెరుపులతో చెన్నై స్కోరు 200 పైచిలుకు చేరింది.

టైటాన్స్ వల్ల కాలేదు!

కొండంత లక్ష్యం చూసే గుజరాత్ బీతిల్లినట్లుంది. ఓపెనర్లు మొదలు ఆఖరి వరుసదాకా అందరి బ్యాటర్లదీ అదే తీరు! ఛేదించాల్సిన లక్ష్యం కోసం ఆడాల్సిన తీరు ఏ ఒక్కరిలోనూ కనిపించలేదు. పవర్‌ప్లేలోనే కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (8), సాహా (17 బంతుల్లో 21; 4 ఫోర్లు) పెవిలియన్‌కు వెళ్లిపోయారు. వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కానీ మెరిపించలేదు... కాసేపైనా మురిపించ లేదు. హిట్టర్లు విజయ్ శంకర్ (12), మిల్లర్ (16 బంతుల్లో 21; 3 ఫోర్లు), రాహుల్ తెవాటియా (6) అంతా చెన్నై కట్టుదిట్టమైన బౌలింగ్‌కు వికెట్లు అప్పగించేశారు.


రచిన్ రవీంద్ర

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) సాహా (బి) జాన్సన్ 46; రచిన్ (స్టంప్డ్) సాహా (బి) రషీద్ ఖాన్ 46; రహానే (స్టంప్డ్) సాహా (బి) సాయికిషోర్ 12; దూబే (సి) శంకర్ (బి) రషీద్ ఖాన్ 51; మిచెల్ (నాటౌట్) 24; సమీర్ రిజ్వీ (సి) మిల్లర్ (బి) మోహిత్ 14; జడేజా (రనౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు)** 206. **వికెట్ల పతనం:** 1–62, 2–104, 3–127, 4–184, 5–199, 6–206. **బౌలింగ్:** అజ్మతుల్లా 3–0–30–0, ఉమేశ్ 2–0–27–0, రషీద్ ఖాన్ 4–0–49–2, సాయికిషోర్ 3–0–28–1, జాన్సన్ 4–0–35–1, మోహిత్ శర్మ 4–0–36–1.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) తుషార్ (బి) దీపక్ 21; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీపక్ 8; సాయి సుదర్శన్ (సి) సమీర్ (బి) పతిరణ 37; విజయ్ శంకర్ (సి) ధోని (బి) మిచెల్ 12; మిల్లర్ (సి) రహానే (బి) తుషార్ 21; అజ్మతుల్లా (సి) రచిన్ (బి) తుషార్ 11; తెవాటియా (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 6; రషీద్ ఖాన్ (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 1; ఉమేశ్ (నాటౌట్) 10; జాన్సన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 143. **వికెట్ల పతనం:** 1–28, 2–34, 3–55, 4–96, 5–114, 6–118, 7–121, 8–129. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–28–2, ముస్తఫిజుర్ 4–0–30–2, తుషార్ దేశ్‌పాండే 4–0–21–2, జడేజా 2–0–15–0, మిచెల్ 2–0–18–1, పతిరణ 4–0–29–1.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × ముంబై
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం


కెప్టెన్ సునీల్ ఛెత్రి

భారత్‌కు అఫ్గానిస్తాన్ షాక్

1–2తో అనూహ్య ఓటమి • తన 150వ మ్యాచ్‌లో కెప్టెన్ సునీల్ ఛెత్రికి నిరాశ

గువాహటి: ఫుట్‌బాల్‌లో భారత జట్టు దీనావస్థను చూపించే మరో ఉదాహరణ! ఆసియాలో అనామక జట్లలో ఒకటైన అఫ్గానిస్తాన్‌తో నాలుగు రోజుల క్రితం జరిగిన మ్యాచ్‌లో ఒక్క గోల్ కూడా చేయకుండా 'డ్రా'గా ముగించిన భారత్ ఆటతీరు ఈసారి మరింత దిగజారింది. 2026 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య మంగళవారం సొంతగడ్డపై జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లోనూ భారత్ కనీస ప్రదర్శనను ఇవ్వలేకపోయింది. చివరకు 1–2 గోల్స్ తేడాతో అనూహ్యంగా ఓటమి పాలైంది. ఈ పరాజయంతో ఆసియా క్వాలిఫయర్స్‌లో భారత జట్టు మూడో రౌండ్‌కు అర్హత సాధించే అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎ'లో నాలుగు మ్యాచ్‌ల తర్వాత భారత్ ఖాతాలో 4 పాయింట్లే ఉన్నాయి. మన టీమ్ తర్వాతి మ్యాచ్‌లలో కువైట్ (జూన్ 6న కోల్‌కతాలో), ఆసియా చాంపియన్ ఖతర్ (జూన్ 11న దోహాలో) జట్లతో తలపడాల్సి ఉంది. అఫ్గాన్‌తోనే ఓడిన మన టీమ్ ఈ నాణ్యమైన టీమ్‌లపై ఏమాత్రం ప్రభావం చూపిస్తుందనేది సందేహమే. చివరిసారి 2013లో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిపోయిన భారత జట్టు ఈ మ్యాచ్‌లో ముందుగా గోల్ చేసి ఆధిక్యంలోకి వెళ్లి కూడా ఆఖరికి మ్యాచ్‌ను ప్రత్యర్థికి అప్పగించింది. భారత్ తరఫున 38వ నిమిషంలో సునీల్ ఛెత్రి కెరీర్‌లో 94వ గోల్ నమోదు చేయగా... అఫ్గానిస్తాన్ ఆటగాళ్లలో రహ్మత్ అక్బరీ (70వ ని.లో), షరీఫ్ ముఖమ్మద్ (88వ ని.లో) గోల్స్ చేశారు. తన 150వ అంతర్జాతీయ మ్యాచ్‌లో ఛెత్రి గోల్ చేయడం విశేషమే అయినా... ఓటమి భారత్‌ను నిరాశకు గురి చేసింది.

పెర్త్‌లో భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు

ఈ ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన

మెల్‌బోర్న్: మూడు దశాబ్దాల తర్వాత ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య మళ్లీ ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. ఈ ఏడాది నవంబర్‌లో తమ దేశంలో భారత జట్టుతో జరిగే టెస్టు సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) విడుదల చేసింది. పెర్త్ వేదికగా నవంబర్ 22 నుంచి 26 వరకు ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగే తొలి టెస్టుతో బోర్డర్–గావస్కర్ ట్రోఫీ సిరీస్ మొదలవుతుంది. అనంతరం అడిలైడ్‌లో రెండో టెస్టు (డిసెంబర్ 6–10; డే/నైట్), బ్రిస్బేన్‌లో మూడో టెస్టు (డిసెంబర్ 14–18), మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు (డిసెంబర్ 26–30)... సిడ్నీలో చివరిదైన ఐదో టెస్టు (2025 జనవరి 3 నుంచి 7) జరుగుతుంది. చివరిసారి 1991–1992లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగ్గా... భారత జట్టు 0–4తో సిరీస్‌ను చేజార్చుకుంది.



డిసెంబర్‌లో భారత మహిళల జట్టుతో సిరీస్


ఈ ఏడాది డిసెంబర్‌లో భారత మహిళల జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. మూడు మ్యాచ్‌లతో కూడిన వన్డే సిరీస్ ఆడనుంది. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య డిసెంబర్ 5, 8, 11వ తేదీల్లో మూడు వన్డేలు జరుగుతాయి.

సినిమా


• ఎన్టీఆర్

పాట.. ఫైటు

గోవాకు బై బై చెప్పారు 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. శ్రుతీ మరాఠి, చైత్ర, సైఫ్ అలీఖాన్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. కాగా ఇటీవల గోవాలో మొదలైన 'దేవర' సినిమా చిత్రీకరణ ముగిసిందని సమాచారం. ఓ ఫైటు సీక్వెన్స్‌తో పాటు ఓ పాటను చిత్రీకరించారట మేకర్స్. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ కాంబినేషన్‌లోని సన్నివేశాల చిత్రీకరణ కూడా జరిగిందని తెలిసింది. తదుపరి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం అవుతుందని, ఏప్రిల్ మొదటివారంలో ఈ కొత్త షెడ్యూల్ ఉండే అవకాశం ఉందని భోగట్టా. కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ స్వరకర్త. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమా తొలి భాగం ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల కానుంది.


• రవితేజ

విల్లు ఎక్కు పెట్టి..!

రెండు రోజుల క్రితం రణ్‌బీర్ కపూర్ తలకిందులుగా నిలబడిన ఫొటో వైరల్ అయ్యింది. ఈ శీర్షాసనం ఎందుకూ అంటే.. శిక్షణలో భాగంగా. రామాయణం ఆధారంగా నితీష్ తివారీ దర్శకత్వంలో రూపొందనున్న 'రామాయణ్' చిత్రం కోసమే రణ్‌బీర్ వర్కవుట్స్ మొదలుపెట్టారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించనున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా నియమించిన ట్రైనర్ ఆధ్వర్యంలో రణ్‌బీర్ కపూర్ మేకోవర్ అవుతున్నారు. ఒకవైపు ఫిజికల్ మేకోవర్ మరోవైపు యుద్ధ విద్యలు నేర్చుకుంటూ బిజీగా ఉన్నారు రణ్‌బీర్. మొన్న శీర్షాసనం ఫొటో వైరల్ కాగా తాజాగా విలు విద్య నేర్చుకోవడానికి రణ్‌బీర్ సిద్ధమవుతున్న ఫొటోలు బయటికొచ్చాయి. మేకోవర్ ట్రైనర్ వేరు... విలు విద్య నేర్పిస్తున్న ట్రైనర్ వేరు. రాముడంటే యుద్ధ విద్యల్లో సూపర్ కాబట్టి ఆ పాత్రకు న్యాయం చేయడానికి ఏమేం చేయాలో అన్నీ చేయడానికి రణ్‌బీర్ రెడీ అయిపోయారు. ఇక ఈ చిత్రంలో సీత పాత్రలో సాయి పల్లవి, రావణుడిగా యశ్, కైకేయిగా లారా దత్తా నటిస్తారనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియా మూవీగా అల్లు అరవింద్, మధు మంతెన, నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారట.


• రణ్‌బీర్ కపూర్

దిల్ సే సోల్జర్స్... దిమాక్ సే సైతాన్స్!

అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా నటించిన యాక్షన్ చిత్రం 'బడే మియా చోటే మియా'. మానుషీ చిల్లర్, ఆలయ హీరోయిన్లుగా పృథ్వీరాజ్ సుకుమారన్, సోనాక్షీ సిన్హా కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించారు. జాకీ భగ్నానీ, వసు భగ్నాని, దీప్శిఖా దేశ్‌ముఖ్, అలీ అబ్బాస్ జాఫర్, హిమాన్షు కిషన్ మెహ్రా నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఎవరు నువ్వు..', 'ప్రళయం నేను..', 'ప్రపంచం ఇలాంటి ఓ యుద్ధాన్ని ఇప్పటివరకూ చూసి ఉండదు. మీ దగ్గర మూడే రోజులు ఉన్నాయి. మీరు ఇప్పుడు రెస్పాండ్ అవ్వాల్సిందే', 'అలాంటి ఓ సైకోని పట్టుకోవాలంటే ... ఆ సైకోను మించి సైకోలుగా మేం మారాల్సిన అవసరం ఉంది', 'దిల్ సే సోల్జర్స్.. దిమాక్ సే సైతాన్స్ హై ఓ' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నట్లుగా తెలుస్తోంది. భారత దేశాన్ని నాశనం చేయాలనుకునే ఓ సైకో సైంటిస్ట్‌ను ఇద్దరు భారత సోల్జర్స్ ఏ విధంగా అడ్డుకున్నారు? అన్నదే ఈ చిత్రకథ.


• టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్

యాక్షన్ బచ్చన్

లక్నోలో ఫైట్స్ చేస్తున్నాడు మిస్టర్ బచ్చన్. హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ లక్నోలో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ సినిమాలో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ జరుగుతోంది. పనోరమా స్టూడియోస్, టి–సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ స్వరకర్త.

మళ్లీ హ్యాపీ డేస్

కాలేజ్ బ్యాక్‌డ్రాప్ చిత్రాల్లో 'హ్యాపీ డేస్' (2007) ఓ ట్రెండ్ సెట్టర్. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ యూత్‌ఫుల్ చిత్రం విడుదలై పదిహేడేళ్లయింది. వరుణ్ సందేశ్, తమన్నా భాటియా, నిఖిల్ సిద్ధార్థ్ తదితరుల కాంబినేషన్‌లో అమిగోస్ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం అప్పట్లో మంచి వసూళ్లతో సంచలన విజయం సాధించింది. శేఖర్ కమ్ముల టేకింగ్, నటీనటుల పెర్ఫార్మెన్స్, మిక్కీ జే మేయర్ సంగీతం, విజయ్ సి. కుమార్ కెమెరా పనితనం అన్నీ అద్భుతంగా కుదిరిన ఈ చిత్రం ఇప్పుడు మళ్లీ విడుదల కానుంది. ఏప్రిల్ 12న ఈ చిత్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ సినిమాస్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రానుంది.



హిట్ జోడీ రిపీట్

టామ్ హాలండ్, జెండయా హిట్ జోడీ. 'స్పైడర్ మేన్' సిరీస్‌లో వెండితెరపై ప్రేమికులుగా కనిపించిన ఈ ఇద్దరూ నిజంగానే ప్రేమికులు కూడా. అయితే బ్రేకప్ చెప్పుకున్నారనే వార్తలు ఈ మధ్య వస్తే... 'అలాంటిదేం లేదు' అంటూ ఈ జంటను ఇష్టపడే వారిని ఖుషీ చేశారు టామ్. ఇప్పుడు హాలీవుడ్ నుంచి మరో ఖుషీ కబురు అందింది. 'స్పైడర్‌మేన్' సిరీస్‌లోని నాలుగో భాగంలోనూ ఈ ఇద్దరూ జంటగా నటించనున్నారన్నది ఆ కబురు. నిజానికి 'యుఫోరియా' సిరీస్‌లోని మూడో సీజన్‌లో నటిస్తున్నందున జెండయా 'స్పైడర్‌మేన్ 4'లో నటించడానికి వీలుపడని పరిస్థితి. అయితే 'యుఫోరియా' కథ ఇంకా పూర్తి కాకపోవడంతో ఆ సిరీస్ కమిట్ అయిన నటీనటులకు వేరే ప్రాజెక్ట్ ఒప్పుకునే వెసులుబాటుని ఇచ్చిందట యూనిట్. దాంతో తాను ఎంతగానో ఇష్టపడే 'స్పైడర్‌మేన్' చిత్రానికి డేట్స్ కేటాయించే పని మీద ఉన్నారట జెండయా. ఇక టామ్ హాలండ్ తాను ఇష్టపడే చిత్రాల్లో 'స్పైడర్‌మేన్'కి ప్రముఖ స్థానం ఉందని అంటుంటారు. సో.... పీటర్ పార్కర్ (టామ్ చేసే స్పైడర్‌మేన్ పాత్ర పేరు), ఎమ్‌జె (పీటర్ గాళ్‌ఫ్రెండ్‌గా జెండయా చేసే పాత్ర పేరు)ల ప్రేమను మరోసారి 'స్పైడర్‌మేన్ 4'లో చూడొచ్చన్న మాట. ఈ హిట్ జోడీ రిపీట్ అయ్యే విషయం గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జస్టిన్ లిన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబర్ లేదా అక్టోబరులో ఆరంభం కానుంది.


• టామ్ హాలాండ్, జెండయా

పట్టణంలో థ్రిల్

విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో...'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి. మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో విశ్వ కార్తికేయ మాట్లాడుతూ– ''మా సినిమా కథ నంద్యాలలో జరుగుతుంది. అందుకే 'కలియుగం పట్టణంలో..' అనే టైటిల్ పెట్టాం. కడప లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంలో సరైన బాధ్యత తీసుకోకపోతే ఏం జరగొచ్చు? అన్నదే మా చిత్రకథ. సస్పెన్స్ అండ్ థ్రిల్ అంశాలతో పాటుగా సినిమాలో మదర్ సెంటిమెంట్ కూడా ఉంది. హారర్ నేపథ్యంలో సాగే నా తర్వాతి చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతుంది'' అని చెప్పుకొచ్చారు.


• విశ్వ కార్తికేయ

మంజుమ్మెల్ బాయ్స్ వస్తున్నారు

మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'మంజుమ్మెల్ బాయ్స్' తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన తారాగణంగా చిదంబరం దర్శకత్వంలో ఈ సర్వైవల్ డ్రామాను బాబు షాహిర్, సౌబిన్ షాహిర్, షాన్ ఆంటోని నిర్మించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న విడుదలైన ఈ చిత్రం దాదాపు 200 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్‌తో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను 'మంజుమ్మెల్ బాయ్స్' టైటిల్‌తోనే మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి తెలుగులో ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నారు. ఇక 2006లో కొడైకెనాల్‌లోని గుణ కేవ్‌లో చిక్కుకున్న తమ స్నేహితుడిని రక్షించిన ఎర్నాకులం మంజుమ్మెల్ యువకుల నిజమైన అనుభవాల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది.


• 'మంజుమ్మెల్ బాయ్స్'లో ఓ దృశ్యం

సాక్షి బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	362	72,470
నిఫ్టీ ▽	92	22,005

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,428	▲	43
డోజోన్స్	39,403	▲	89
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,931	▲	13
డాక్స్	18,384	▲	123
షాంఘై	3,031	▲	5
నికాయ్	40,398	▽	17

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	66,716
బంగారం (22 క్యా.)	66,449
వెండి (కేజీ)	74,279

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.23	106.78
€	యూరో	ఒకటి	89.30	91.68
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.64	55.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.64	55.56
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.64	64.35
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.30	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.78	23.57
¥	చైనా యువాన్	ఒకటి	10.42	12.49

బిలియనీర్ల నగరం ముంబై



- 92 మంది సంపన్నులకు కేంద్రం
- బీజింగ్‌ను దాటిన దేశ ఆర్థిక రాజధాని
- హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్‌లో వెల్లడి

ముంబై: బిలియనీర్ల విషయంలో దేశ ఆర్థిక రాజధాని ముంబై తాజాగా బీజింగ్‌ను అధిగమించింది. మంగళవారం విడుదలైన హురున్ గ్లోబల్ రిచ్ లిస్టు ప్రకారం ముంబైలో 92 మంది అత్యంత సంపన్నులు ఉండగా బీజింగ్‌లో ఈ సంఖ్య 91గా ఉంది. ఇక చైనాలో మొత్తం 814 మంది బిలియనీర్లు ఉండగా భారత్‌లో 271 మంది ఉన్నారు. దేశీయంగా కుబేరుల మొత్తం సంపద 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 115 బిలియన్ డాలర్ల సంపదతో అత్యంత సంపన్న భారతీయుడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. గత ఏడాది వ్యవధిలో ఆయన సంపద మరో 40 శాతం (33 బిలియన్ డాలర్లు) పెరిగింది. ఇక హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదికతో గణనీయంగా దెబ్బతిన్న గౌతమ్ అదానీ తిరిగి కోలుకున్నారు. ఆయన సంపద 62 శాతం వృద్ధి చెందింది. అంతర్జాతీయంగా అంబానీ పదో స్థానంలో ఉండగా, అదానీ 15వ స్థానంలో ఉన్నారు. 231 బిలియన్ డాలర్లతో టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ నంబర్ వన్‌గా ఉన్నారు. కొత్త బిలియనీర్లయిన వారి విషయంలో చైనాను భారత్ అధిగమించింది. భారత్ నుంచి ఈ లిస్టులో 94 మంది చోటు దక్కించుకోగా, చైనా నుంచి 55 మందికి చోటు దక్కింది. గత ఏడాది వ్యవధిలో ముంబైలో 27 మంది బిలియనీర్లు కాగా, బీజింగ్‌లో ఆరుగురు మాత్రమే ఈ హోదా దక్కించుకున్నారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
26-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.25

ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావం

ముంబై: ఫైనాన్స్, బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలపాలయ్యాయి. సెన్సెక్స్ 362 పాయింట్లు తగ్గి 72,470 వద్ద నిలిచింది.. నిఫ్టీ 92 పాయింట్లు పతనమై 22,005 వద్ద ముగిసింది. మూడు సెలవు రోజుల తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందడంతో సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో రోజంతా నష్టాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 469 పాయింట్లు క్షీణించి 72,363 వద్ద, నిఫ్టీ 149 పాయింట్లు పతనమై 21,948 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చైనా కరెన్సీ యువాన్ బలపడటం, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

కాగా జీవితకాల కనిష్ట స్థాయి(83.61) నుంచి రూపాయి రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో మంగళవారం 32 పైసలు బలపడి 83.29 వద్ద ముగిసింది. అమెరికా డాలర్ బలహీనపడటం, ఆసియా దేశాల కరెన్సీ బలపడటం రూపాయి కోలుకునేందుకు సహకరించాయి.

భారతీ హెక్సాకామ్ @ రూ.542-570



భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ ఐపీవోకు రూ. 542-570 ధరల శ్రేణిని ప్రకటించింది. ఏప్రిల్ 3న ప్రారంభంకానున్న ఇష్యూ 5న ముగియనుంది. ఆఫర్ ద్వారా రూ. 4,275 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

ట్రంప్ మీడియా నాస్‌డాక్‌లో లిస్టింగ్



యూఎస్ మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా కంపెనీ తాజాగా నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయ్యింది. 50 డాలర్ల ధరలో డీజేటీ సింబల్‌తో నాస్‌డాక్‌లో ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్ప్ కౌంటర్‌లో ట్రేడింగ్ ప్రారంభమైంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 8.45 ప్రాంతంలో ట్రంప్ మీడియా షేరు నాస్‌డాక్‌లో 39 శాతం దూసుకెళ్లి 69.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

అదానీ చేతికి గోపాల్‌పూర్ పోర్టు

- 95 శాతానికి రూ. 1,349 కోట్లు
- షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్, ఒరిస్సా స్టీవ్‌డోర్స్ నుంచి కొనుగోలు





న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ ఖాతాలోకి మరో పోర్టు వచ్చి చేరనుంది. గ్రూప్‌లో భాగమైన అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ సంస్థ (ఏపీ సెజ్) తాజాగా ఒడిశాలోని గోపాల్‌పూర్ పోర్టును (జీపీఎల్) దక్కించుకోనుంది. ఇందుకోసం జీపీఎల్‌లో షాపూర్‌జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్, ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ (ఓఎస్ఎల్) నుంచి 95 శాతం వాటాలను రూ. 1,349 కోట్లకు కొనుగోలు చేయనుంది. జీపీఎల్‌లో ఎస్‌పీ పోర్ట్ మెయింటెనెన్స్‌కి 56 శాతం, ఓఎస్ఎల్‌కి 44 శాతం వాటాలు ఉన్నాయి. ఇందులో ఎస్‌పీ గ్రూప్ వాటాలను పూర్తిగా, ఓఎస్ఎల్ నుంచి 39 శాతం వాటాలను ఏపీసెజ్ కొనుగోలు చేయనుంది. ఓఎస్ఎల్ 5 శాతం వాటాతో జాయింట్ వెంచర్ భాగస్వామిగా కొనసాగనుంది. రూ. 3,080 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువతో 95 శాతం వాటాను రూ. 1,349 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ఏపీసెజ్ తెలిపింది. నిర్దిష్ట మైలురాళ్లను అధిగమించాకా 5.5 ఏళ్ల తర్వాత మరో రూ. 270 కోట్లు చెల్లించే ప్రాతిపదికన ఈ డీల్ ఉంటుందని పేర్కొంది. దీంతో ఎంటర్‌ప్రైజ్ విలువను రూ. 3,350 కోట్లుగా లెక్కగట్టినట్లవుతుంది. గోపాల్‌పూర్ పోర్టు కొనుగోలుతో తమ కస్టమర్లకు మరింతగా సమగ్రమైన సేవలు అందించేందుకు వీలవుతుందని ఏపీసెజ్ ఎండీ కరణ్ అదానీ తెలిపారు. దీనితో ఒడిశాలోని మైనింగ్ హబ్‌లు, పొరుగు రాష్ట్రాలు అందుబాటులోకి రాగలవని, తద్వారా మారుమూల ప్రాంతాలకు కూడా తమ లాజిస్టిక్స్ సేవలను విస్తరించడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ఏపీసెజ్‌కి ప్రస్తుతం తూర్పు, పశ్చిమ తీరాల్లో పద్నాలుగు పోర్టులు, టెర్మినల్స్ ఉన్నాయి.

20 మిలియన్ టన్నుల సామర్థ్యం..

ఒరిస్సాలోని గంజాం జిల్లాలో 20 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో గోపాల్‌పూర్ పోర్టు పని చేస్తోంది. ఇనుప ఖనిజం, బొగ్గు, అల్యూమినా మొదలైన కార్గోను హ్యాండిల్ చేస్తోంది. ఇటీవలే ఇది ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినల్‌ను నెలకొల్పేందుకు పెట్రోనెట్ ఎల్ఎన్‌జీతో కూడా ఒప్పందం కుదుర్చుకుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో జీపీఎల్ 11.3 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ ద్వారా రూ. 520 కోట్ల ఆదాయం ఆర్జించవచ్చని అంచనాలు ఉన్నాయి.

అసెట్ మానిటైజేషన్‌పై ఎస్‌పీ దృష్టి..

రూ. 20,000 కోట్ల రుణభారాన్ని తగ్గించుకునే దిశగా ఎస్‌పీ గ్రూప్ గత కొన్నాళ్లుగా అసెట్ మానిటైజేషన్ (ఆస్తులను విక్రయించడం లేదా, లీజుకివ్వడం ద్వారా నిధులు సమకూర్చుకోవడం)పై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గతంలో మహారాష్ట్రలోని ధరమ్‌తార్ పోర్టును రూ. 710 కోట్ల విలువకు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకి విక్రయించింది. 2015లో దీన్ని కొనుగోలు చేసిన ఎస్‌పీ గ్రూప్.. ఆ తర్వాత కార్యకలాపాలను టర్న్‌అరౌండ్ చేయగలిగింది. వార్షిక సామర్థ్యాన్ని 1 ఎంటీపీఏ నుంచి 5 ఎంటీపీఏకి పెంచింది. ఇక గోపాల్‌పూర్ పోర్టు ఒప్పందం గత కొద్ది నెలల్లో రెండో డీల్. రెండు పోర్టులను గణనీయమైన విలువకు విక్రయించడమనేది అసెట్స్‌ను టర్న్‌అరౌండ్ చేయడంలోను, స్వల్ప కాలంలోనే వాటాదారులకు మెరుగైన రాబడులు అందించడంలోనూ తమకు గల సామర్థ్యానికి నిదర్శనమని ఎస్‌పీ గ్రూప్ ప్రతినిధి తెలిపారు.

ప్రపంచంలోనే పటిష్టమైన బీమా బ్రాండ్.. ఎల్ఐసీ



న్యూఢిల్లీ: దేశీ బీమా దిగ్గజం ఎల్ఐసీ ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన బీమా సంస్థగా నిల్చింది. 2024 సంవత్సరానికి సంబంధించి బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100 నివేదికలో ఈ విషయం వెల్లడైంది. దీని ప్రకారం స్థిరంగా 9.8 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో, 88.3 బ్రాండ్ పటిష్టత సూచీ స్కోరుతో, ట్రిపుల్ ఏ రేటింగ్‌తో ఎల్ఐసీ అగ్రస్థానంలో ఉంది. క్యాథే లైఫ్ ఇన్సూరెన్స్ రెండో స్థానంలో ఉంది. ఈ సంస్థ బ్రాండ్ విలువ 9% పెరిగి 4.9 బిలియన్ డాలర్లకు చేరింది. ఎన్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ 1.3 బిలియన్ డాలర్ల విలువతో (82% వృద్ధి) మూడో స్థానంలో ఉన్నట్లు బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ తెలిపింది. మరోవైపు, విలువపరంగా చూస్తే చైనా కంపెనీల ఆధిపత్యం కొనసాగుతోంది. 33.6 బిలియన్ డాలర్లతో పింగ్ ఆన్ సంస్థ అగ్రస్థానంలో ఉండగా, చైనా లైఫ్ ఇన్సూరెన్స్ అలాగే సీపీఐసీ వరుసగా 3వ, 5వ స్థానాల్లో కొనసాగుతున్నాయి.

క్యూ3లో క్యాడ్ 10.5 బిలియన్ డాలర్లు



ముంబై: భారత్ కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) అక్టోబర్-డిసెంబర్ (క్యూ3) త్రైమాసికంలో 10.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇదే కాలంలో నమోదయిన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువతో పోల్చితే ఈ విలువ 1.2 శాతం. అంతక్రితం త్రైమాసికంతో పోల్చితే (విలువలో 11.4 బిలియన్ డాలర్లు, జీడీపీలో 1.3 శాతం) ఇది తక్కువ కావడం గమనార్హం. ఎగుమతుల్లో పురోగతి, వాణిజ్యలోటు తగ్గడం దీనికి కారణం.

యూనివర్సిటీకి 'మహీంద్రా' రూ.500 కోట్లు



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, ఆయన కుటుంబం హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయానికి రూ.500 కోట్లు సమకూరుస్తోంది. కొత్త విభాగాల ఏర్పాటుకు గాను 2028-29 వరకు ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. అలాగే యూనివర్సిటీలో భాగమైన ఇందిర మహీంద్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు ఆనంద్ మహీంద్రా సొంత నిధుల నుంచి రూ.50 కోట్లు వెచ్చించనున్నారు.

ఏపీలో ఇండోసోల్ ప్లాంటు రెడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ఉన్న ఇండోసోల్ సోలార్ ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన 500 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ మాడ్యూల్స్ తయారీ ప్లాంట్ సిద్ధం అయింది. నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద 30 ఎకరాల్లో విస్తరించిన ఈ అత్యాధునిక కేంద్రంలో మార్చి 31 నుంచి ఉత్పత్తి ప్రారంభం అవుతుందని ఇండోసోల్ సీఈవో శరత్ చంద్ర మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభం అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 23,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇండోసోల్‌ను షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ ప్రమోట్ చేస్తోంది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 14 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **విభాగాలు:** ఎంబెడెడ్ సిస్టమ్స్-హార్డ్‌వేర్, ఎంబెడెడ్ సిస్టమ్స్-సాఫ్ట్‌వేర్, పవర్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ డిజైన్, రేడియో ఫ్రీక్వెన్సీ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, పని అనుభవం, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.04.2024
» **దరఖాస్తు హార్డ్‌కాపీలు పోస్టులో పంపడానికి చివరితేది:** 20.04.2024.
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 30 టెక్నీషియన్(గ్రేడ్2) పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. టెక్నీషియన్(గ్రేడ్2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్-07,ఎలక్ట్రీషియన్-06,మెషినిస్ట్-07,ఫిట్టర్-10.
» **అర్హత:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ఎలక్ట్రీషియన్/ఫిట్టర్/మెషినిస్ట్ ట్రేడ్స్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. ఏడాది పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 13.04.2024 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.20,480.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.04.2024
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

సెయిల్‌లో 108 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

జార్ఖండ్‌లోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్), బొకారో స్టీల్ ప్లాంట్‌లో.. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 108
» **ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(బాయిలర్), అటెండెంట్ కమ్ టెక్నీషియన్(బాయిలర్), మైనింగ్ ఫోర్మాన్, సర్వేయర్, ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(మైనింగ్/ఎలక్ట్రికల్), మైనింగ్ ఫోర్‌మ్యాన్, అటెండెంట్ కమ్ టెక్నీషియన్ ట్రైనీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా,డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.05.2024
» **వెబ్‌సైట్:** https://sail.co.in

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, న్యూఢిల్లీలో 63 ఇంజనీర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
» **పోస్టుల వివరాలు:** ఇంజనీర్(ఆర్ఈ-సివిల్)-20, ఇంజనీర్ (ఆర్ఈ -ఎలక్ట్రానిక్స్)-29, ఇంజనీర్(ఆర్ఈ-మెకానికల్)-09, ఎగ్జిక్యూటివ్ (ఆర్ఈ-హెచ్ఆర్)-01, ఇంజనీర్ (ఆర్ఈ-సీడీఎం)-01, ఎగ్జిక్యూటివ్ (ఆర్ఈ-ఫైనాన్స్)-01, ఇంజనీర్(ఆర్ఈ-ఐటీ)-01, ఎగ్జిక్యూటివ్(ఆర్ఈ-కార్పొరేట్ కమ్యూనికేషన్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.83,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.04.2024.
» **వెబ్‌సైట్:** https://ntpcrel.co.in

బీమా కంపెనీలో ఆఫీసర్

బీమా రంగం గత కొంతకాలంగా కొలువుల కామధేనువుగా మారుతోంది. పలు బీమారంగ సంస్థలు నిత్యం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ రంగ బీమా సంస్థ ది ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఓఐసీఎల్).. మొత్తం 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకౌంటింగ్ నుంచి లీగల్ వరకూ పలు విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది! ఈ నేపథ్యంలో.. ఓఐసీఎల్‌లో ఏఏ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 100 ఏఓ పోస్టుల భర్తీకి ఓఐసీఎల్ నోటిఫికేషన్
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ఎంపికైతే నెలకు రూ.85 వేల వేతనం

మొత్తం 100 పోస్టులు

ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ తాజా నోటిఫికేషన్ ద్వారా ఆరు విభాగాల్లో 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో అకౌంట్స్-20 పోస్టులు, యాక్చుయేరియల్-5 పోస్టులు, ఇంజనీరింగ్-15 పోస్టులు, ఇంజనీరింగ్ (ఐటీ)-20 పోస్టులు, మెడికల్ ఆఫీసర్-20 పోస్టులు, లీగల్-20 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి బీకాం/సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/ఎంబీఏ(ఫైనాన్స్)/ నిర్దేశిత బ్రాంచ్‌లతో బీటెక్ లేదా ఎంటెక్/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ (స్టాటిస్టిక్స్/మ్యాథమెటిక్స్/యాక్చుయేరియల్ సైన్స్)/ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** డిసెంబర్ 31, 2023 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ.. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ.

వంద మార్కులకు ప్రిలిమినరీ

ఎంపిక ప్రక్రియలో తొలిదశ ప్రిలిమినరీ పరీక్షను మూడు విభాగాల్లో 100మార్కులకు నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 మార్కులకు ఉంటాయి. ప్రిలిమ్స్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్ష వ్యవధి ఒక గంట.

రెండో దశ మెయిన్

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు 20 మందిని చొప్పున (1:20 నిష్పత్తిలో) రెండో దశ మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష అయిదు విభాగాల్లో మొత్తం 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.

టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్ 40 మార్కులకు, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 మార్కులకు, ప్రొఫెషనల్ నాలెడ్జ్/సబ్జెక్ట్ నాలెడ్జ్ 40 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

డిస్క్రిప్టివ్ టెస్ట్

మెయిన్ పరీక్షలో భాగంగానే 30 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో 10 మార్కులకు లెటర్ రైటింగ్, 20 మార్కులకు ఎస్సే రైటింగ్ ఉంటాయి. డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు కేటాయించిన సమయం 30 నిమిషాలు. ఇది అర్హత పరీక్ష మాత్రమే.

చివరగా ఇంటర్వ్యూ

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున ఎంపిక చేసి.. చివరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.



ఇంటర్వ్యూలో అభ్యర్థుల అకడమిక్ నేపథ్యం, సబ్జెక్ట్ నాలెడ్జ్, ఇన్సూరెన్స్ రంగంపై ఉన్న ఆసక్తి తదితర అంశాలను పరిశీలిస్తారు.

వెయిటేజీ విధానం

తుది విజేతలను ప్రకటించే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు. రాత పరీక్షలో సాధించిన మార్కులకు 80 శాతం; పర్సనల్ ఇంటర్వ్యూలో పొందిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తారు. దీనికి అనుగుణంగా అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి.. తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

సర్వీస్ బాండ్..ప్రొబేషన్

ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగంలో చేరేముందు సర్వీస్ అగ్రిమెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. సంస్థలో కనీసం నాలుగేళ్లపాటు విధులు నిర్వర్తిస్తామని తెలిపే విధంగా బాండ్ సమర్పించాలి. తుది నియామకాలు ఖాయం చేసుకున్న వారికి ఏడాది ప్రొబేషనరీ పిరియడ్ ఉంటుంది. ఈ సమయంలో వారు ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించే లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనం

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయమైన వేతనం లభిస్తుంది. ప్రారంభంలోనే నెలకు రూ.85 వేల వేతనం అందుతుంది. మూల వేతనాన్ని రూ. 50,925 (పే స్కేల్ రూ.50,925 రూ.96,765)గా నిర్ధారించారు. దీనికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ వంటి ఇతర భత్యాలు లభిస్తాయి. వీటితోపాటు మెడికల్ ఇన్సూరెన్స్, ఎల్‌టీఏస్ వంటి సదుపాయాలు సైతం ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 12
- **రాత పరీక్షల తేదీలు:** మే/జూన్‌లో నిర్వహించే అవకాశం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://orientalinsurance.org.in/web/guest/careers

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

రీజనింగ్ ఎబిలిటీ

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన విభాగం.. రీజనింగ్. దీనికోసం సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో బెస్ట్ స్కోర్ కోసం హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు ఇన్సూరెన్స్ రంగంలో తాజా పరిణామాలు, స్టాక్ జీకే, ఆర్థిక సంబంధ పరిణామాల(ఎకానమీ, ప్రభుత్వ పథకాలు)కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్,టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను సాధన చేయాలి. ఫలితంగా ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

అన్ని పోస్టులకు ఉండే విభాగం.. ప్రొఫెషనల్ నాలెడ్జ్. దీనికోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్‌పై ఫోకస్ చేయాలి. బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

మెయిన్స్ దృక్పథం

అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచే మెయిన్ పరీక్ష దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి. మూడు విభాగాలు ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ఉన్నాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ ప్రశ్నల్లో క్లిష్టత స్థాయిలో వ్యత్యాసం ఉంటుంది. మెయిన్స్ దృక్పథంతో చదివితే ప్రిలిమ్స్‌లో సులభంగా విజయం సాధించే అవకాశం ఉంటుంది.

గత ప్రశ్న పత్రాలు

అభ్యర్థులు గత ప్రశ్న పత్రాల సాధన, మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం మేలు. గ్రాండ్ టెస్ట్‌ల సమాధానాలను సరి చూసుకోవడం ద్వారా తాము ఇంకా అవగాహన పొందాల్సిన అంశాలపై స్పష్టత లభిస్తుంది. అంతేకాకుండా మాక్ టెస్ట్‌లకు హాజరవడం వల్ల పరీక్ష హాల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.